గురువారం
3•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 57
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

కాంగ్రెస్ తెలంగాణ పిశాచి

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ దుర్మార్గపు విధానాల గురించి ఆలోచన చేయాలి. కాళేశ్వరం నీళ్లు వచ్చే జూన్‌నాటికి వస్తయి అంటే కాంగ్రెస్ పార్టీవాళ్ల గుండెలు అవిసిపోతున్నయి. కాళ్ల కింద భూమి కదిలిపోతున్నది. ఏం చేసైనా సరే ప్రాజెక్టులు ఆపాలని కుట్ర. ఒక్క కాళేశ్వరం మీదనే 119 కేసులు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఇంత దుగ్ధ ఎందుకు?

గ్రూప్ 1, 2, టెట్.. ఇలా ఏ నోటిఫికేషన్ వచ్చినా కోర్టును ఆశ్రయించేలా కాంగ్రెస్‌వాళ్లు ఉసిగొల్పుతున్నరు.. నిరుద్యోగుల కడుపు కొడుతున్నరు. సెక్రటేరియట్ కడుతామంటే స్టే, బైసన్‌గ్రౌండ్ అంటే స్టే.. ప్రజలకు మంచి చేస్తే చూస్తూ ఊరుకోం అన్నట్టుంది. మేం ఉక్కు సంకల్పంతో ముందుకుపోతున్నం. ప్రజల దీవెన ఉంది. ఎన్ని కేసులు పెట్టినా అధిగమిస్తం.

రాష్ట్రంలో కమ్యూనిస్టులకు అసలు స్థానం లేదు. సర్వే రిపోర్టులో వారి ప్రభావం 0.3 శాతం మాత్రమేనని తేలింది. అడుగకముందే అంగన్‌వాడీలకు, బల్దియా కార్మికులకు, హోంగార్డులకు జీతాలు పెంచటంతో కమ్యూనిస్టులకు నిద్ర పట్టడంలేదు. పిచ్చోళ్లలా మాట్లాడుతున్నరు. క్యాడర్ లేక ఆ పార్టీలు కనుమరుగయ్యేస్థితికి చేరుకున్నయి.


బుధవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

అభివృద్ధికి అడ్డుగా అడుగడుగునా క్షుద్ర రాజకీయం

సిద్ధాంతం.. సిగ్గులేని పార్టీ కాంగ్రెస్ ▪ పుట్టగతులుండవనే కేసుల పురాణం

లక్ష కుటుంబాలకు లబ్ధి కలుగకుండా అడ్డుకుంటారా? ▪ మూడేండ్లలో వివిధ పనులపై 196 కేసులు వేశారు

కాంగ్రెస్‌లో కురుస నాయకులు.. నిర్మాణాత్మకంగా మాట్లాడటంలేదు ▪ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలున్నాయా?

కాంగ్రెస్, విపక్షాల తీరుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిప్పులు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో మధ్యంతర తీర్పును ఆహ్వానిస్తున్నాం

వారు చెప్పినదానికన్నా వెయ్యి ఎక్కువే ఇస్తాం ▪ రెగ్యులరైజేషన్ కాదు.. అబ్సార్‌ప్షన్ చేస్తున్నాం ▪ కాంట్రాక్టు ఉద్యోగులకు భయం అవసరం లేదు

▪ వారికి సాధారణ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ▪ హోంగార్డులకు కూడా త్వరలోనే న్యాయం చేస్తాం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ పిశాచిలా, భూతంలా పరిణమించిందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఆ పార్టీ పనిచేస్తున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం లక్షమంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని సంకల్పిస్తే కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గడిచిన మూడేండ్లలో వివిధ న్యాయస్థానాల్లో 196 కేసులు వేయడమే దీనికి నిదర్శనమని సోదాహరణంగా వివరించారు. బుధవారం ప్రగతిభవన్‌లోని జనహితలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలపై సీఎం నిప్పులు చెరిగారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్ష కాంగ్రెస్ అడుగడుగునా ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్‌ను రాష్ట్ర ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, ఇదే తీరు కొనసాగిస్తే ఆ పార్టీకి తెలంగాణలో భవిష్యత్తే ఉండదని చెప్పారు. జాతీయ పార్టీ స్థాయిలో కాంగ్రెస్ వ్యవహరించడంలేదన్నారు. రాష్ట్రంలో వామ పక్షాలు పూర్తిస్థాయిలో ప్రజలకు దూరమయ్యాయన్న సీఎం.. 'అసలు రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇంకా ఏమన్నారంటే..

'దేశంలో ఎక్కడలేని విచిత్ర పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నయి. తెలంగాణ ప్రభుత్వం ఒకపక్క గొప్పగా, స్ఫటికసదృశంగా పాలన సాగిస్తుంటే ప్రతిపక్ష కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతున్నది. తెలంగాణ వచ్చిన కొత్తలో తమకే అధికారం వస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆశించి భంగపడ్డరు. ప్రజలు వారిని తిరస్కరించిండ్రు. తెలంగాణ ఉద్యమ సమయంలో వీరు వ్యవహరించిన శైలే ఇందుకు కారణం. వాళ్లకు కమిట్‌మెంట్ లేకపోవడం.. ఏ ఒక్కరోజు కూడా రాష్ట్ర సాధన కోసం చిత్తశుద్ధితో పనిచేయకపోవడం.. చివరికి ఒక ముఖ్యమంత్రి నిండు శాసనసభలో లేచి, 'తెలంగాణ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వను.. రాసుకో' అని అంటే.. ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా లేచి నిలబడి.. ఇదేం అన్యాయం అని మాట్లాడకపోవడం.. వీటన్నింటినీ గమనించిన ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించిండ్రు. కష్టపడి పద్నాలుగు, పదిహేనేండ్లు అనేక అవమానాలు, ఛీత్కారాలు, బూత్కారాలు పడి.. ఢిల్లీ వెళ్లి

మిగతా 2,3వ పేజీల్లో

తెలంగాణలో కేసీఆర్, టీఆర్‌ఎస్ మార్కు ఉండొద్దా?

- డ్రగ్స్, పబ్బుల సంస్కృతి తెచ్చింది కాంగ్రెస్సే.. ప్రజలపై ప్రేమతో కాంగ్రెస్ రాష్ట్రం ఇవ్వలేదు
- కేంద్ర ప్రభుత్వానికి అంశాలవారీగానే మా మద్దతు.. ప్రత్యేక గూర్ఖాలాండ్‌కు మద్దతుపై చర్చ జరుగాలి
- అసెంబ్లీ సీట్లు పెరుగడంపై మాకు ఆసక్తి లేదు.. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు పెరుగుతాయి
- వెంకయ్యనాయుడి ప్రమాణ స్వీకారానికి వెళ్తా.. మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి

తదుపరి ఆదేశాలవరకు విలీన ప్రక్రియ ఆపండి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అబ్సార్‌ప్షన్‌పై విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం 12

నిజామాబాద్‌లో స్పైస్ పార్కు

వరంగల్‌లో డెవలప్‌మెంట్ బోర్డు

తెలంగాణ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: తెలంగాణకు స్పైస్‌పార్కుతోపాటు స్పైస్ డెవలప్‌మెంట్ బోర్డు కూడా రానున్నది. నిజామాబాద్‌లో స్పైస్‌పార్కును, వరంగల్‌లో స్పైస్ డెవలప్‌మెంట్ బోర్డును నెలకొల్పడానికి కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది. రాజ్యసభలో ఎంపీ రేణుకాచౌదరి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ సంగతి తెలిపారు. నిజామాబాద్ పట్టణంలో పసుపు పంట కోసం స్పైస్ పార్కును నెలకొల్పాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తికి తాము సానుకూల స్పందనను తెలియజేశామని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో

గురుకుల ఖాళీల భర్తీ
ఇక వేగవంతం


మహిళా సిబ్బందితోనే పోస్టుల భర్తీ ▪ ఒకరిద్దరి కోసం ప్రక్రియ నిలిపివేత సరికాదు

హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యలు ▪ సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేత

పరీక్షల రీషెడ్యూలుకు టీఎస్‌పీఎస్సీ చర్యలు ▪ పరీక్షల తేదీలు త్వరలో ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని బాలికల గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, మహిళా డిగ్రీ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు అవాంతరాలు తొలిగిపోయాయి. ఆయా పాఠశాలలు, కాలేజీల్లో పోస్టులను మహిళలకే రిజర్వ్‌చేయడాన్ని తప్పుపడుతూ భర్తీ ప్రక్రియను నిలిపివేసిన సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఎత్తివేసింది. భర్తీ ప్రక్రియను యథాతథంగా కొనసాగించడానికి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ శ్యాంప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం అనుమతించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో




పోస్టుల భర్తీ ప్రక్రియ యథాతథంగా కొనసాగనుంది. దీంతో.. గతంలో కోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన పరీక్షలను రీషెడ్యులు చేసే పనిలో టీఎస్‌పీఎస్సీ నిమగ్నమైంది.

మహిళలతో పోస్టుల భర్తీని వ్యతిరేకిస్తూ పిటిషన్

రాష్ట్రంలోని సాంఘిక, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సైటీల ఆధ్వర్యంలో బాలికలు, యువతుల కోసం నిర్వహించే

మిగతా 12వ పేజీలో


రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో హరితహారంలో పాల్గొని విత్తన బంతులను విసురుతున్న మంత్రి కేటీఆర్

ప్రజలే మా ప్రభువులు

వచ్చే జూన్‌నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి.. మంత్రి కే తారక రామారావు వెల్లడి

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో పర్యటన 14

మరింత చౌకగా గృహ, వాహన రుణాలు

తగ్గనున్న ఈఎంఐల భారం

రెపో రేటు 0.25 శాతం తగ్గించిన ఆర్బీఐ 13


కాల్పులకు ఉపయోగించిన తుపాకీని మీడియాకు చూపుతున్న సీపీ మహేందర్‌రెడ్డి

కాల్పులు నాటకమే

50 లక్షలకు ఒప్పందం..

సుపారీ ఇచ్చి కాల్పులు జరిపించుకున్న విక్రమ్‌గౌడ్

అప్పులు తప్పించుకునేందుకు.. ఎమ్మెల్యేగా గెలిచేందుకు డ్రామా 12

నో డిటెన్షన్ రద్దు

ఎన్‌ఆర్‌ఐల పరోక్ష ఓటింగుకు ఆమోదం

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు 11


బెంగళూరులోని తన నివాసంలో మీడియాకు నమస్కరిస్తున్న కర్ణాటక మంత్రి డీ కే శివకుమార్

కర్ణాటక మంత్రి ఆస్తులపై ఐటీ పంజా

- 64 ప్రాంతాల్లో శివకుమార్ ఆస్తులపై దాడులు
- రూ.11 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం

ఐటీ దాడులపై కాంగ్రెస్ ధ్వజం

- రాజ్యసభ వాయిదా.. లోక్‌సభలో కాంగ్రెస్ వాకౌట్
- రిసార్ట్‌లోని తమ ఎమ్మెల్యేలను భయపెట్టేందుకే కేంద్ర బలగాలను పంపారన్న కాంగ్రెస్
- రాజ్యసభ ఎన్నికలకు, ఐటీ దాడులకు సంబంధం లేదన్న ప్రభుత్వం


11

నారాయణ, శ్రీచైతన్య కాలేజీల కోత

- 13 నారాయణ జూనియర్ కాలేజీలు
- 16 శ్రీచైతన్య జూనియర్ కాలేజీలు
- 29 కాలేజీల అఫిలియేషన్ కట్
- అఫిలియేషన్లకు 10 వరకు గడువు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరుగుతున్న ప్రవేశాలు
- 260 కోట్లతో అభివృద్ధి.. డిజిటల్ తరగతులు ప్రారంభం
- ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని 29 కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు ఇప్పటివరకు 2017-18 విద్యాసంవత్సరానికి అఫిలియేషన్లు ఇవ్వలేదని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. వీటిలో 16 శ్రీచైతన్య జూనియర్ కాలేజీలు, 13 నారాయణ జూనియర్ కాలేజీలు ఉన్నాయని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో అఫిలియేషన్లు పొందడానికి ఈ నెల 10 వరకు గడువు విధించామన్నారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అఫిలియేషన్ ప్రక్రియ కొనసాగించే ప్రసక్తే లేదని బుధవారం మీడియా స్పష్టంచేశారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించిన ఈ 29 కార్పొరేట్ కాలేజీలు విజిలెన్స్ తనిఖీలలో పట్టుబడ్డాయని చెప్పారు. వీటిలో నారాయణ జూనియర్ కాలేజీలు రూ.62,72,000, శ్రీచైతన్య


నాంపల్లి ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బోర్డు కార్యదర్శి అశోక్

జూనియర్ కాలేజీలు రూ.1,04,14,000 జరిమానా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ జరిమానాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించిన కాలేజీలకు అఫిలియేషన్లు ఇవ్వడానికి ఈ నెల 10 వరకు మాత్రమే గడువు ఉన్నదని చెప్పారు. అఫిలియేషన్ లేకుండా కాలేజీలను నడిపినా, అదనపు సెక్షన్లు ఏర్పాటుచేసినా, అదనపు కోర్సులు నడిపినా కఠిన చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1,205 ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చామని, మరో 395 కాలేజీలకు షరతులతో కూడిన అఫిలియేషన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిలో 85 కాలేజీలు రేకుల షెడ్లలో కొనసాగుతున్నాయని చెప్పారు. అఫిలియేషన్లు ఇచ్చే ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతున్నదని అశోక్ తెలిపారు.

ప్రభుత్వ కాలేజీల్లో పెరుగుతున్న విద్యార్థులు

రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల నమోదు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఒక లక్ష వరకు

మిగతా 12వ పేజీలో



హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్ ట్రాన్స్‌కో- జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు

కాంగ్రెస్ తెలంగాణ పిశాచి

మొదటిపేజీ తరువాయి...

మొత్తం దేశ రాజకీయాలను మెప్పించి.. రాష్ట్ర సాధనను సాధ్యంచేసిన టీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టంగట్టింద్రు. ఇది అందరికీ తెలిసిన చరిత్ర. దీంతో ఆశాభంగానికి గురైన కాంగ్రెస్ నేతలకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక పటిష్ఠమైన, ప్రజాకర్షక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు.. అనేక శాఖల్లో అర్ధాకలితో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులకోసం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రోయాక్టివ్ రోల్ చూసి కన్నుకుట్టి.. తమకు పుట్టగతులుండవని గ్రహించి కేసులు వేస్తుంద్రు. నీటిపారుదల ప్రాజెక్టుల మీద 164 కేసులా? ఎక్కడైన ఉంటయా? మొత్తం మీరు (కాంగ్రెస్) వేసిన కేసులు 196. ప్రభుత్వం ఆర్డర్ తీయాలె.. కాంగ్రెస్ పార్టీ కేసు వేయాలె.. అన్నట్టు తయారైంది. 'మేమేం చేయలేకపోయాం.. ఆ రోజు సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర నేతల అడుగులకు మడుగులొత్తాం.. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తే మాకు పుట్టగతులుండవు..' అనే దుగ్ధ కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తున్నది. ఇది వారి దివాళాకోరుతనం రాజకీయం.

అర్ధాకలితో ఉన్నవారి కడుపు నింపడం తప్పా?

నూతనంగా ఏర్పడిన రాష్ట్రం.. నిర్మాణాత్మకంగా ముందుకు పోవాలె. తాగునీరు రావాలె. కరెంటు రావాలె. ప్రజలకు మంచి జరుగాలె. అర్ధాకలితో పని చేసే ఉద్యోగుల పొట్టలు నిండాలె.. అనే పాజిటివ్ వైఖరి తీసుకోకుండా.. కేవలం తమ చిల్లరమల్లర రాజకీయాల కోసం, పనికిమాలిన రాజకీయ లబ్ధికోసం నీచాతినీచంగా ప్రవర్తిస్తున్నారు. కాంగ్రెస్ వారిని ప్రజలు గమనిస్తుంద్రు. ఉద్యోగాల మీద కేసులు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మీద కేసులు, ఉద్యోగమిస్తే కేసు, సింగరేణి డిపెండెంట్ ఎంప్లాయీస్‌కు అవకాశం కల్పించిన దానిమీద కేసులు.. అన్నీ కాంగ్రెస్ వేసినవే. మిషన్ భగీరథ మీద కేసులు, ఇరిగేషన్ ప్రాజెక్టు మీద కేసులు, హైదరాబాద్ నగరం మీద కేసులు, స్పెషల్ రోడ్ డెవలప్‌మెంట్ మీద కేసులు! ఇరవై రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు మీద సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్, సుప్రీం కోర్టు.. ఇట్లా ఆరు కేసులు వేసింద్రు. ఆరు కేసులూ వీగిపోయినయ్. చివరికి సుప్రీంకోర్టు కూడా కొట్టేసింది. కొంతమంది న్యాయమూర్తులు చివాట్లు కూడా పెట్టింద్రు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేయొద్దా? మీరు ప్రాజెక్టుల వెంటపడుతున్నరేంది? అని బహిరంగంగా కామెంట్ చేసింద్రు. చివరికి హైకోర్టు సింగిల్ బెంచ్ నుంచి సుప్రీంకోర్టు దాకా ఎగ్జాస్ట్ అయిపోయిన తర్వాత.. ఏదన్న చేసి ఆపాలె.. ఎట్లయిన చేసి కాళేశ్వరం ప్రాజెక్టు ఆపాలె.. అని గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లింద్రు. మీరు తెలంగాణ బిడ్డలు కాదా! కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి నీళ్లు రావాలంటే ఎంత ఆరాటంతో పని చేయాలె! ప్రతిపక్షం ఎంత బాధ్యతతో పని చేయాలె! దిక్కుమాలిన రాజకీయాలు చేస్తుంద్రు. కాంగ్రెస్ రాజకీయాలు చూసి జాలిపడుతున్నా. రియల్లీ ఫీల్ పిటీ. వారికి సరిగ్గ రాజకీయం కూడా తెలియదు. వాళ్ల తీరు ఆ పార్టీలోనే డెఫినెట్‌గా బూమరాంగ్ అవుతున్నది.



లోకం పోకడ



మేము ఇటు నుంచి వెళ్లి ఉద్యోగాలు ఇవ్వడం లేదని లొల్లి చేస్తాం.. మీరు అటునుంచి వెళ్లి ఇచ్చే ఉద్యోగాల మీద కేసులేసి అడ్డుకోండి!

చంద్రబాబు కాంట్రాక్టు వ్యవస్థను తెచ్చిండు.. కాంగ్రెసోళ్లు కొనసాగించిండ్రు..

పుణ్యాత్ముడు చంద్రబాబు కాంట్రాక్ట్ వ్యవస్థను మొదలువెట్టిండు. అది కాంగ్రెసోళ్లు కొనసాగించిన్రు. ఎన్నెమ్మార్‌లని మొదలువెట్టిండు. వారు కొనసాగుతా ఉన్నరు. మీరు మొట్టమొదట పెట్టింద్రు. చంద్రబాబు దానిని ముందుకు తీసుకెళ్లిండు. గత పదేండ్లుగా కాంగ్రెస్ దాన్నే సుభిక్షంగా నడిపింది. నాకు గుర్తుంది. అప్పుడు రాజశేఖర్‌రెడ్డి సీఎం. నేను ఉద్యమ నాయకుడిగా ఉన్నా. హోంగార్డులు వచ్చి చెప్పింద్రు. మూడు వేల జీతం వాళ్లకు. హోంగార్డులలో సగం మంది పద్దెనిమిది, పందొమ్మిది వేల మంది ఉంటే.. అందులో పది, పదకొండు వేల మంది హైదరాబాద్‌లో పనిచేస్తరు. భార్యాపిల్లలెట్ల? రూము కిరాయి ఎంత? అయినా దిక్కులేక.. పాపం ఏ రోజయినా రెగ్యులరైజ్ చేస్తరనో.. ఏ రోజుకన్నా తాము బాగుపడుతమనో.. అర్ధాకలితో పనిచేసిన్రు. ఒకరోజు జయలక్ష్మి గార్డెన్స్ అని బోయిన్‌పల్లిలో మ్యారేజ్ హాల్ ఉంది. హోంగార్డుల మీటింగ్ పెడితే.. 'ముఖ్యమంత్రి గనక జీతాలు పెంచకపోతే నేనే లేబర్ కోర్టుకెళ్లి కేసు వేస్తా' అని చెప్పిన. దాంతో ఆదరాబాదరాగా మూడు వేల రూపాయలు పెంచిన్రు. ఆరు వేల రూపాయలు చేసిన్రు. మళ్ల తర్వాత మినిమం వేజే పెట్టిన్రు. కిరణ్‌కుమార్‌రెడ్డి వెయ్యి, పన్నెండు వందలు పెంచిండు. టీఆర్‌ఎస్ గవర్నమెంట్ రాగానే మరో మూడు, నాలుగు వేలు పెంచి పన్నెండు వేలు చేసినం. వాళ్లను కూడా రెగ్యులరైజ్ చేద్దామని నిర్ణయం చేసినం. సింగరేణి డిపెండెంట్ మీద ఎప్పుడైతే కాంగ్రెస్ వాళ్లు కోర్టుకు పోయింద్రో.. ఆలోచనలో పడ్డాం. రెగ్యులరైజ్ చేయడమా? ఏం చేయడం? అని ఆలోచనలో పడ్డం.

రెగ్యులరైజేషన్ కాదు.. అబ్జార్ప్షన్

ఈ కరెంటు వాళ్ల మీద కంట్రాక్టర్లు ఉన్నరు. వీళ్లు తమ కింద పనిచేసే కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంత ఇయ్యాలో అంత ఇయ్యరు. మల్ల వెయ్యో, రెండు వేలో కట్ చేసుకుంటడు. ఫిఫ్టీన్ పర్సంట్ అయినా కమిషన్ తీసుకుంటడు. మల్ల వారి బ్యాంకు కార్డులు తీసుకుని, రెండు, మూడు వేలు కట్ చేసుకుంటడు. ఈ దురవస్థ నుంచి విద్యుత్ కార్మికులను కాపాడాలె. వీళ్లకు డ్యూటీ అవర్స్ లేవు. పగల్లేదు. రాత్రి లేదు. కరాబైతే పోల్ ఎక్కాలే. బ్రేక్ డౌన్ అయితే అటెండ్ చేయాలె. ఉష్ణోగ్రతలు అధికంగ ఉన్న సమయాల్లో పని చేస్తరు. విపరీతమైన జనరేటర్లు, టర్బైన్లు, బూడిద, కోల్ ప్లాంట్లలో.. ఇలా దారుణ పరిస్థితుల్లో జాబ్ చేస్తరు. వీళ్లకు అన్యాయం జరుగుతున్నదని తెలిసి.. నాలుగు సంస్థల్లో పనిచేసే వీరిని కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ వ్యవస్థ నుంచి తప్పించి ఒక స్కేలు డిసైడ్ చేసినం. రెగ్యులరైజ్ చేయకుండా డిపార్టుమెంట్‌లో అబ్జార్బ్ చేసుకున్నం. అంతేకానీ ఇది క్రమబద్ధీకరణ కాదు. కాంట్రాక్టర్ల దోపిడీకి గురవుతున్నరు కాబట్టి.. మేమే అబ్జార్బ్ చేసుకున్నం. వారి డిమాండ్ కూడా అదే. దీన్ని అర్థం చేసుకోకుండా కోర్టుల చుట్టూ తిరుగుతున్నరు. సుప్రీంకోర్టు తీర్పు ఉంది.. అందరినీ రెగ్యులరైజ్ చేయకూడదన్నారు. హైకోర్టు కూడా అదే చెప్పింది.

కోర్టు తీర్పును అభినందిస్తున్నాం..

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. వాళ్లకు స్కేలు ఇవ్వాలని చెప్పింది. వాళ్లు చెప్పినదానికంటే ఎక్కువే ఇవ్వాలనుకున్నం. విద్యుత్ బోర్డు ప్రపోజ్ చేసింది హైలీ స్కిల్డ్‌కు రూ.21,750 ప్రపోజ్ చేస్తే.. రూ.22 వేలు ఇస్తున్నం. స్కిల్డ్ వారికి రూ.17,500 ఉంటే రూ.18వేలు చేసినం. అన్‌స్కిల్డ్‌కు రూ.12,100 ఉంటే రూ.13వేలు చేసినం. కోర్టు వారు మానవతా దృక్పథంతో చేసిన సూచనలకు ధన్యవాదాలు చెప్పినం. సంవత్సరానికి 25 కోట్లు అదనపు భారం పడుతున్నా.. వారిని ఆదుకోవాలని ఉద్దేశంతోనే కోర్టు తీర్పు ప్రకారం ఇవ్వాలని నిర్ణయించుకున్నం. కోర్టు అవలంబించిన తీరు అభినందనీయం. దళారులు వేసిన పిటిషన్‌ను దళారీ వ్యవస్థ నిర్మూలించేందుకు కోర్టు కొట్టివేయడం వల్ల కార్మికులకు రక్షణ వచ్చింది. గతంలో గాంధీభవన్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్లు ముట్టడించింద్రు. త్వరలో హోంగార్డులను పిలిచి, వారికి తగిన న్యాయం చేస్తం. రెగ్యులరైజ్ కాకుండా జీతం పెంచాలా? అనేది ఆలోచిస్తం. వారి సమస్యలను పరిష్కరిస్తం. కాంగ్రెస్ దుష్టపన్నాగాన్ని ప్రజలు కూడా గమనించాలె. ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నరు.

మాకూ రాజకీయాలు తెలుసు..

కాంట్రాక్ట్ లెక్చరర్లు గాంధీభవన్ ముందు ధర్నాలు చేసినా, కాంగ్రెస్‌వాళ్ల బుద్ధి మారట్లేదు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష కుటుంబాలకు లబ్ధికలిగిస్తే రాజకీయంగా తమకు (కాంగ్రెస్‌కు) నష్టం కదా అనే కుత్సిత బుద్ధి. కచ్చితంగా ఇది కాంగ్రెస్‌కు బూమరాంగ్ అయితది తప్ప మరోటి కాదు. మేమూ రాజకీయాల్లో ఉన్నాం. మాకూ రాజకీయాలు తెలుసు. నెగెటివ్ దృక్పథం మంచిదికాదు. కాంట్రాక్టు లెక్చరర్లు, కరెంటు ఉద్యోగులు అమాయకులు కాదు. ఎవరు అడ్డుకుంటున్నరో వాళ్లకు తెలుసు. హోంగార్డుల గురించి అసెంబ్లీలో ప్రకటనచేశాం. వాళ్లను రెగ్యులరైజ్ చేయకపోయినా వాళ్ల జీతాలు పెంచే ప్రయత్నం చేయాలని డీజీపీకి చెప్పిన. హోంగార్డులను జనహితకు పిలిచి మాట్లాడి, వాళ్ల సమస్యను కూడా పరిష్కరిస్తాం. రెగ్యులరైజ్ చేయలేకపోయినా, ప్రభుత్వం వాళ్ల కడుపులు నింపే ప్రయత్నం చేస్తుంది.

కాంగ్రెస్ దుష్ట పన్నాగాలను తిప్పికొట్టాలి

కాంగ్రెస్ దుష్ట పన్నాగాలను తిప్పికొట్టాలని కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలు, హోంగార్డుల కుటుంబాలను కోరుతున్నా. రాష్ట్రంలో ప్రజలు కూడా కాంగ్రెస్ దుర్మార్గ విధానాలపై ఆలోచన చేయాలి. కాళేశ్వరం నీళ్లు వచ్చే జూన్ నాటికి వస్తయి అంటే కాంగ్రెస్ వాళ్ల గుండెలు అవిసిపోతున్నయి. కాళ్లకింద భూమి కదిలిపోతున్నది. ఏం చేసైనా సరే ప్రాజెక్టులు ఆపాలని చూస్తున్నారు. ఒక్క కాళేశ్వరంపైనే 119 కేసులు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇంత దుగ్ధ ఎందుకు? భూములు కోల్పోతున్న వాళ్లకు మేం ఇస్తున్నది రూ.6లక్షలు, రూ.9 లక్షలు, రూ.12 లక్షలు. నేను అడుగుతున్న కాంగ్రెస్ నాయకులను.. మీ పార్టీ చరిత్రలో కట్టిన మొత్తం ప్రాజెక్టులకు ఎక్కడైనా పరిహారం రూ.6 లక్షలు ఇచ్చింద్రా! భూములు కోల్పోయిన రైతులకు ఇండ్లు కట్టుకునేందుకు రూ.5.40 లక్షలు ఇచ్చింద్రా? రూ.70వేలు ఇచ్చి చేతులు దులుపుకొన్నరు. ఇవన్నీ చరిత్ర.

నేను చెప్పేది నిజమైతే కాంగ్రెస్‌కు శిక్ష

నేను చెప్పేవన్నీ ప్రజలు వింటున్నరు. నేను చెప్పేది తప్పయితే ప్రజలు మాకు శిక్ష విధిస్తరు. అది రైట్ అయితే అదే కాంగ్రెస్‌కు శిక్ష పడ్తది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం.. ఏదైనా సాగునీరు రాకుండా రకరకాల కేసులు వేస్తున్నారు. జీవో 123 తెస్తే దానిమీద ఒక కేసు.. దాన్ని చట్టం చేసి రాష్ట్రపతి ఆమోదం తెలిపితే.. మళ్లీ దానిమీద కేసు. కాళేశ్వరం, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నుంచి 620 మీటర్ల ఎత్తులో ఉన్న కొండ పోచమ్మ సాగర్‌కు నీళ్లు వస్తయి. అది నేను ఎమ్మెల్యేగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలో ఉంది. హెచ్‌ఎండీఏలో పరిధిలో దాని మునక భూమి ఉంది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్ వాల్యూ అయ్యింది. నా నియోజకవర్గం కాబట్టి, స్వయంగా నేనే రైతులకు చెప్పి, పరిహారం ఇప్పిస్తా.. పునరావాసం కూడా నేనే దగ్గరుండి తొందరగా ఇప్పిస్తానంటే.. వాళ్లు నా మాటమీద గౌరవం ఉంచి ఒప్పుకున్నరు. 4,400 ఎకరాల భూమికిగాను 4,200 ఎకరాల భూసేకరణ అయిపోయింది. అంటే 99% అయ్యింది. ఆ ఒక్కశాతం ఆపింది కాంగ్రెస్ పార్టీ. అంటే.. కాంగ్రెస్ వైఖరి ఏంది? భూసేకరణ ఆగిన 200 ఎకరాలు వందశాతం కాంగ్రెస్‌పార్టీ నాయకులవి. 200 ఎకరాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులను అడ్డపెట్టుకుని కొండపోచమ్మ ప్రాజెక్టు ఆపుతరా? ఇది ఒక రాజకీయ పార్టీనా? ఇంత దివాళా తీసిందా? ఇంత భ్రష్టు పట్టిందా?

ప్రజలు.. రైతులే నిలదీయాలి..

ప్రాజెక్టులను ఆపడంద్వారా మీరు ప్రజల్లో ఓట్లు సంపాదించుకుంటారా? ఎందుకు ఇంత దరిద్రపు ఆలోచనలు? ఇప్పటికే ఒకసారి శాసనసభలో చెప్పిన. కొత్తగా తెచ్చుకున్న రాష్ట్రాన్ని మీ చిల్లర రాజకీయాల కోసం శాపాల పాలు చేయొద్దు.. తెలంగాణను చిన్నగ చెయ్యొద్దు అని కోరిన. పూర్తిగా నెగెటివ్ బుద్ధి పెట్టుకుని విషపూరితంగా దుర్మార్గంగా చేస్తున్నారు. వీళ్లకు ప్రజలే బుద్ధి చెప్పాలి. వీళ్లను నిలదీయాలని తెలంగాణ రైతాంగానికి, తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

కరెంటునూ అడ్డుకుంటున్నరు

తెలంగాణకు కరెంటు ఎంత అవసరమో.. 30 ఏండ్లు గోస అనుభవించిన రాష్ట్ర ప్రజలకు, రైతులకు తెలుసు. పారిశ్రామికవేత్తలు ఫ్యాప్సీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేసింద్రు. అంత దురవస్థలో కరెంటు వ్యవస్థ ఉంటే.. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణానికి మేం ఆగమేఘాల మీద శాంక్షన్లు, క్లియరెన్సులు తెస్తే.. టెక్నికల్ కారణాలు చూపి భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లపై కేసులు వేసింద్రు. ప్రజలకు కరెంటు రాకున్నా ఫర్వాలేదు.. ప్రజలకు నీళ్లు రాకున్నా ఫర్వాలేదు అంటే కాంగ్రెస్ ఎంత గొప్ప దివాళాకోరు పార్టీనో తెలుస్తుంది. ఇదేనా కొత్త రాష్ట్రంలో ఒక జాతీయ పార్టీ అవలంబించే విధానం?

ఎన్నికలకు చాలా సమయం ఉంది

ఎన్నికలకు చాలా సమయం ఉంది. అయినా మిడిసిపడుతున్నరు. అడ్డంపొడుగు మాటలు మానుకోవాలి. లేకుంటే కర్రు కాల్చి వాత పెడుతరు. ఏ ఎన్నికచూసినా మాదే విజయం. అన్నిపార్టీలు కలిసి అచ్చంపేట మున్సిపాలిటీకి పోటీచేసినా 20 కౌన్సిలర్ స్థానాలకు 20 గెలిచినం. అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు లక్షలపై చిలుకు ఓట్లతో గెలిచాం. మహాకూటమి పాలేరులో పోటీచేస్తే మా నేత తుమ్మల నాగేశ్వరరావు చిత్తుగా ఓడించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పరువు పోగొట్టుకున్నారు. ఆఖరికి చనిపోయిన ఎమ్మెల్యే స్థానంలో కూడా గెలువలేదు. అన్ని ఎన్నికల్లో ఓటమే. ప్రజలు బుద్ధిచెప్పినా రాలేదు. తిరస్కరించినా ప్రవర్తన మార్చుకోరు. పెండ్లికి, చావుకు ఒకే మంత్రం వేస్తున్నరు. కాంగ్రెస్ పార్టీ నవ్వుల పాలవుతున్నది. ఓపికతో వ్యవహరిస్తుంటే ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నరు. మిషన్ కాకతీయ ప్రారంభం కాకముందే ఆరోపణలు చేశారు. ప్రతి పథకం గురించి లేనిపోని నిందలు వేస్తున్నారు. ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులొత్తి తెలంగాణ చరిత్రను నాశనం చేశారు. సీఎంగా ఉన్నప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఒకే జిల్లాకు రూ.8000 కోట్లు తీసుకుపోతే ఎలా ఆమోదించారు? చేతగానితనంతో దద్దమ్మలుగా నిలిచారు. మేం పనిచేస్తుంటే వాళ్ల కండ్లు మండుతున్నాయి. ఉన్మాదుల్లా ప్రవరిస్తున్నారు. ప్రాజెక్టుల్లో జేసీబీ మిషన్లు పనిచేస్తుంటే వాళ్ల గుండెను తవ్వినట్లు ఫీలవుతున్నరు. రైతులు ఆనందంగా ఉంటే ఎవరైనా ఏడుస్తారా? సాగునీరు ఇస్తే కండ్ల మంట ఎందుకు? సొల్లు పురాణాలు చెప్తూ ఆరోపణలు చేస్తూ ప్రతిపనికి అడ్డంగా నిలుస్తున్నారు.

నేరెళ్ల ఘటన రాజకీయ లబ్ధికోసమే

సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనను కావాలని రాద్ధాంతం చేస్తున్నారు. గుండాగిరీ చేస్తుంటే పోలీసులు కేసుపెట్టారు. కావాలని దళితులను పోలీసులు టార్గెట్ చేయలేదు. దళితులను కొట్టాలని ప్రభుత్వం చెప్తుందా? కేసీఆర్ చెప్తాడా? అలా జరుగాల్సింది కాదు. కానీ కాంగ్రెస్ భూతద్దంలో చూస్తున్నది. పెద్దప్రచారం కల్పించి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ కేసులలో దళితులతోపాటు ఇతరులు ఉన్నారు. కేసులు పెట్టడం సహజం. ఇసుక ద్వారా తెలంగాణ రాక ముందు పదేండ్లలో రూ.50 కోట్లు ఆదాయం రాలేదు. మా ప్రభుత్వం వెయ్యికోట్ల వరకు ఆదాయం తీసుకొచ్చింది. దందాలు జరిగితే ఇంత ఆదాయం వస్తుందా? ఇసుక దందా తీసుకొచ్చినం అనే వాళ్లవి నోళ్లా లేక తాటిమట్టలా? పిచ్చి ఆరోపణలు చేయటం మానాలి.

మిగతా 3వ పేజీలో...

ఏ నోటిఫికేషన్ వచ్చినా కోర్టులకా?

గ్రూప్ 1, 2, టెట్.. ఇలా ఏ నోటిఫికేషన్ వచ్చినా కోర్టును ఆశ్రయించేలా కాంగ్రెస్‌వాళ్లు ఉసిగొల్పుతున్నారు. ఒక్క పరీక్ష జరుగకుండా అడ్డుపడి నిరుద్యోగుల కడుపు కొడుతున్నారు. సెక్రటేరియట్ కడుతామంటే స్టే.. బైసన్‌గ్రౌండ్ అంటే స్టే. గచ్చిబౌలి స్టేడియం వాడుతున్నారా? విజయ్‌భాస్కర్ రెడ్డి స్టేడియం వాడుతున్నారా? హకీంపేటలోని మైదానం వినియోగిస్తున్నారా? లేదు! హైదరాబాద్‌లో 500 ఎకరాల పైచిలుకు ఆటస్థలాలున్నాయి. 15 ఎకరాలు పోతేనే ప్రపంచం పోతదా? 'మేం ఏం చేయలేదు.. మీరూ చేయవద్దు. ప్రజలకు మంచి చేస్తే చూస్తూ ఊరుకోం' అన్నట్టుంది కాంగ్రెస్ తీరు. కొత్త సెక్రటేరియట్ నిర్మిస్తే తప్పా? అసెంబ్లీ ఉంటే తప్పా? ఎన్ని మకిలి ప్రయత్నాలు చేసినా తెలంగాణను అభ్యుదయపథంలో నడిపించే ప్రయత్నాన్ని ఆపలేరు. ఉక్కు సంకల్పంతో ముందుకుపోతున్నం. ప్రజల దీవెన ఉంది. ఎన్ని కేసులు పెట్టినా అధిగమిస్తం. ఇప్పటికే కోర్టు ఎన్నోసార్లు అక్షింతలు వేసింది. అయినా మారరు. అమరవీరుల స్మృతి చిహ్నం నిర్మిస్తామన్నా, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నా కోర్టుకు వెళ్లి స్టే తెస్తున్నారు. ఇలాంటి వాటిలో ప్రజాప్రయోజనం ఏముందో కాంగ్రెస్ నేతలే చెప్పాలి.

కాంగ్రెస్ కేసులు.. 196

అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టుల బాట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వలసపాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన తెలంగాణను అభివృద్ధిలో అగ్రపథాన నిలిపేందుకు టీఆర్‌ఎస్ సర్కారు అమలుచేస్తున్న కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు పని చేస్తున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్ మూడేండ్లుగా అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి 196 కేసులు వేయడమే నిదర్శనం. సాగునీటిపారుదల నుంచి మొదలుకుని..నిరుద్యోగుల ఆశలను వమ్ముచేసేలా ఉద్యోగాల నోటిఫికేషన్లపై.. ఎన్నో ఏండ్లుగా సేవలు అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సింగరేణి వారసత్వ ఉద్యోగాలు, విద్యుత్‌శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విలీనంపై కేసులు వేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కింది. ఒక్కోశాఖ వారీగా చూస్తే అత్యధికంగా సాగునీటి ప్రాజెక్టులపై 164 కేసులు వేయడం గమనార్హం.

1.సాగునీటి ప్రాజెక్టులపై మొత్తం 164 కేసులు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై 119 కేసులు
- పాలమూరు-రంగారెడ్డిపై 23 కేసులు
- డిండి ఎత్తిపోతలపై ప్రజాప్రయోజన వ్యాజ్యం
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు
- మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా 872 మంది పేర్లతో పిటిషన్లు, ఏడుగురు మృతుల పేర్లతోపాటు వేరే ప్రాంతాల్లో ఉన్న వారి పేర్లుకూడా ఉన్నాయి.
- జీవో నంబర్ 123కు వ్యతిరేకంగా 29 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు.
- మల్లన్నసాగర్‌పై 10, పాలమూరు-రంగారెడ్డిపై 8, గౌరవెల్లిపై 3, అనంతగిరిపై 2 పిల్స్

2. సుందిళ్ల బ్యారేజీపై 20 రోజుల్లో 5 కేసులు
- 17 మే 2017న హైకోర్టులో పిటిషన్
- 22 మే 2017న స్పెషల్ లీవ్ పిటిషన్
- రెండు రోజుల తరువాత డివిజన్ బెంచ్‌కు
- తర్వాత సుప్రీంకోర్టులో పిటిషన్
- తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్

3. ఉద్యోగాల నోటిఫికేషన్లపైన 16 కేసులు
- గ్రూప్-1 పరీక్షపై కేసులు
- గ్రూప్-2 పరీక్షపై కేసులు
- టెట్‌పై కేసులు
- గురుకుల ఉపాధ్యాయ నియామకాలపై కేసులు

4. 20 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కేసు వేసి కొట్టివేయించారు.

5. సింగరేణిలో దాదాపు 20 వేల మందికి వారసత్వ ఉద్యోగాలిచ్చే జీవోపైనా కేసు వేసి కొట్టివేయించారు.

6. విద్యుత్‌శాఖ ప్రాజెక్టులు, ఉద్యోగాలపై ఐదు కేసులు
- భద్రాద్రి ప్రాజెక్టుపై హ్యూమన్ రైట్స్ ఫోరం వాళ్లు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్)కు వెళ్లారు. ఎన్జీటీ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ఇవ్వడంపై మళ్లీ కేసు వేశారు
- ఏపీ, తెలంగాణ ఉద్యోగుల విభజనపై కేసులు
- విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులపై కేసులు
- 21 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కేసులు

7. హైదరాబాద్ నగరాభివృద్ధిపై 8 కేసులు
- ఎన్టీయార్ స్టేడియం-కళాభారతిపై కేసులు
- హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు వ్యతిరేకంగా ఎన్జీటీ కేసు
- ఎస్సార్డీపీ (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)కు వ్యతిరేకంగా కేసులు
- కేబీఆర్ పార్కు వద్ద రోడ్ల విస్తరణపై ఎన్జీటీలో కేసు

8. మిషన్ భగీరథలో చేపడుతున్న పనులపైనా కేసులు

మర్రి శశిధర్‌రెడ్డి కేసులు
- అంబేద్కర్‌నగర్ వీకర్ సెక్షన్ డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- అమరవీరుల స్మారకస్తూపం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై కేసులు
- ఉస్మానియా దవాఖాన కూల్చివేతపై కేసులు
- చెస్ట్ హాస్పిటల్ తరలింపుపైనా కేసులు

రాష్ట్రం మొత్తం పర్యటిస్తా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవ పనుల శంకుస్థాపన తర్వాత రాష్ట్రం మొత్తం పర్యటిస్తాం. వీళ్ల (కాంగ్రెస్ నాయకుల) బతుకులను చౌరస్తాలల్ల ఎండగడుతం. ప్రజాక్షేత్రంలో వీళ్లు అవలంబిస్తున్న దుర్మార్గపు, క్షుద్ర రాజకీయాలు ఎంతకాలం చేస్తరో.. ఎవరి మేలు కోరి చేస్తరో.. కాంగ్రెస్‌పార్టీ సమాధానం చెప్పాలి. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం గొంతు నులిమేందుకు 196 కేసులు పెట్టి విషపూరితంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌పార్టీని ఎండగడుతా. 2001 ఏప్రిల్ 27 నాడు జలదృశ్యంలో నేను మొట్టమొదటి ప్రసంగంలోనే చెప్పిన.. తెలంగాణ దుస్థితికి విలన్ నంబర్ వన్ కాంగ్రెస్ అని చెప్పిన. అప్పటి పేపర్ కటింగులు, వీడియో క్లిప్పింగులు కూడా ఉన్నయి. నాటి నుంచి నేటి దాకా తెలంగాణ ప్రజలపాలిట పిశాచి, భూతం కాంగ్రెస్‌పార్టీ. ఉన్న తెలంగాణను ఫజల్ అలీ కమిషన్ తీర్మానానికి వ్యతిరేకంగా, తెలంగాణ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి.. ఆనాటి కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తెలంగాణ ప్రజల గోసపోసుకున్నడు. ఆ తర్వాత 1969లో ఉద్యమం వచ్చి తెలంగాణ కావాలని ఇక్కడి ప్రజలు అడిగితే, ఆయన బిడ్డ ఇందిరాగాంధీ.. 400 మందిని కాల్పుల్లో చంపించి, వేలమందిపై పీడీయాక్టులు పెట్టి, ప్రజల నిర్ణయాన్ని తిరస్కరించింది. తెలంగాణకు ముల్కీరూల్స్ ఉండాలని సుప్రీంకోర్టు చెప్తే.. ఆ తీర్పును కాలరాస్తూ, రాజ్యాంగ సవరణ చేసి తెలంగాణ ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టింద్రు. ఆ తర్వాత 'మా పాపాలు కడుక్కుంటం.. తెలంగాణ ఇస్తం' అని 2004లో టీఆర్‌ఎస్‌తో దోస్తీ కట్టి, అధికారం కైవసం చేసుకుని, మళ్లీ కొన్ని వందల మంది చనిపోవడానికి కారణమైంది కాంగ్రెస్. దాదాపు 10 ఏండ్లు ఆపి, ఇక బతుకం, సచ్చిపోతం అనే పరిస్థితి తీసుకువచ్చింది. దేశమంతా నెగెటివ్ అయింది. తెలంగాణ ఇస్తేనన్న ఇక్కడ గంజినీళ్లు దొరుకుతయేమోనని తెలంగాణ ఇచ్చింద్రు తప్ప, తెలంగాణ ప్రజలమీద ప్రేమతో ఇవ్వలేదు. అందుకే తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఘోరంగా తిరస్కరించింద్రు. ఆ తర్వాత ఇప్పుడు మల్ల కేసుల రూపంలో తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకోవడానికి శిఖండి పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్‌పార్టీ. అంతా విచిత్రమైన వైఖరితో ప్రవర్తిస్తున్నది. బాధ్యత గల ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రజలకు నేను గుర్తు చేసేది ఏందంటే.. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు సాగునీళ్లు ఇచ్చేందుకు కాదు. వాటన్నింటినీ మనం రీడిజైన్‌చేశాం.. చేసుకుంటున్నాం.. బాధ్యతగల ముఖ్యమంత్రిగా నేను 'శాసనసభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తా అందరు వినండి, ఏవైనా సూచనలు ఉంటే చెప్పండి' అంటే.. ఈ కాంగ్రెస్‌పార్టీ పారిపోయింది.



ముహూర్తం



సూర్యోదయం: 6.00 గంటలకు



సూర్యాస్తమయం: 6.45 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం ఏకాదశి సాయంత్రం 4.39 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: జ్యేష్ఠ సాయంత్రం 6.14 వరకు తదుపరి: మూల. అమృత ఘడియలు: ఉదయం 8.21 నుంచి 9.57 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.58 నుంచి 3.33 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.21 నుంచి 5.03 వరకు, వర్జ్యం: లేదు

(2వ పేజీ తరువాయి...)

సింగరేణిపైనా కుట్రలా?

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు రాకుండా అడ్డుకున్నారు. కోర్టుకు వెళ్లి అడ్డుగా నిలిచారు. మంచి పని చేసి కుటుంబాలకు న్యాయం చేద్దామంటే వినడం లేదు. గతంలో జాతీయసంఘాలతో కలిసి టీడీపీ డిపెండెంట్ ఉద్యోగాలను రద్దు చేసింది. దాన్ని కాంగ్రెస్ కొనసాగించింది. ప్రస్తుతం మేం కొడుకులకు ఇస్తామంటే, కోర్టుకు వెళ్లారు. ఇదా పద్ధతి? ఇంత దుర్మార్గంగా పని చేస్తారా? గతంలో సింగరేణి ఉద్యోగులకు ఆదాయం పన్ను వర్తింపు నిబంధన తొలిగించాలని కేంద్రస్థాయిలో ప్రయత్నించా. సింగరేణి ఉద్యోగం సుఖమయం కాదు. నరకం కనిపిస్తది. వచ్చి పోయేముందు గని వద్ద ఉండే మైసమ్మ, పోచమ్మ గుడులకు మొక్కుతరు. అంత దారుణమైన, ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేయాల్సి ఉంటది. జీవితాంతం మోకాళ్ల నొప్పులతో తిప్పలు పడుతున్నరు. అలాంటివారికి క్షేమంకోసం, బాగుకోసం ప్రయత్నిస్తే అడ్డుకుంటరు. సింగరేణి ఉద్యోగాల పట్ల ఇప్పటికే చర్చలు జరుపుతున్నాం. అన్యాయం జరుగకుండా కాపాడుకుంటం.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు భరోసా

విద్యుత్ కార్మికుల విషయంలో కాంట్రాక్టు ఉద్యోగులకు భయం అవసరం లేదు. ఎలాగైనా కాపాడుకుంటం. విద్యుత్‌శాఖే కాదు, కాంట్రాక్టు ఉద్యోగులు ఏ శాఖలో ఉన్నా సాధారణ ఉద్యోగులతో సమాన వేతనాలు అందిస్తాం. రెగ్యులరైజ్ కాదు, విలీనమని ఏజీకి చెప్పాం. సుప్రీంతీర్పు ఆధారంగా హైకోర్టు సూచించింది. విలీనం చేయడం కూడా నిబంధనలకు వ్యతిరేకం అంటే ఫర్వాలేదు. సాధారణ ఉద్యోగుల్లా జీతాలు చెల్లిస్తాం. క్యాబినెట్ మీటింగ్ పెట్టి త్వరలో నిర్ణయిస్తాం. జెన్‌కో, ట్రాన్స్‌కోతో మాట్లాడి బిడ్డల్లా కాపాడుతాం. మనసు చిన్నబుచ్చుకోవద్దు. హోంగార్డులు బాధపడద్దు. న్యాయం చేస్తం. కాంట్రాక్ట్ లెక్చరర్లకు పెంచినట్టే న్యాయం చేస్తం. సమాన పనికి సమానవేతనం ఇస్తామని ఎన్నికల్లో చెప్పిన మాట నిలబెట్టుకుంటా. విద్యుత్‌శాఖ అద్భుతంగా పని చేస్తున్నది. నిరంతరం కరెంట్ సరఫరా చేస్తూ ఉద్యోగులు కష్టపడుతున్నారు. డిమాండ్‌కు సరిపడా కరెంట్‌లేని పరిస్థితి నుంచి 24 గంటలు కరెంట్ సరఫరాచేసే స్థాయికి ఎదుగడంలో వారి పాత్ర కీలకం. లక్ష్యం చేరుకున్నాం. 9,326 మెగావాట్ల వినియోగాన్ని సైతం తట్టుకుంటున్నాం. నల్లగొండ జిల్లాలోని సంస్థాన్ నారాయణపూర్ ప్రజలు 24 గంటల కరెంట్ వద్దని ధర్నా చేస్తున్నరు. మూడేండ్లలో 24 గంటల కరెంట్ ఇస్తా అంటే జానారెడ్డి అద్భుతమే అన్నారు. ఇప్పుడు అద్భుతం కనిపించటం లేదా? అభివృద్ధి జరుగుతుంటే పిచ్చికూతలు ఎందుకు? చిల్లరగా, దగాకోరు దివాలాకోరు రాజకీయాలు చేయటం ఎందుకు?

కమ్యూనిస్టులకు నిద్రపట్టడం లేదు

కమ్యూనిస్టులకు రాష్ట్రంలో అసలు స్థానం లేదు. వారి ప్రభావం 0.3% మాత్రమేనని సర్వే రిపోర్టులో తేలింది. అడుగకముందే అంగన్‌వాడీలకు, బల్దియా కార్మికులకు, హోంగార్డులకు జీతాలు పెంచటంతో కమ్యూనిస్టులకు నిద్ర పట్టడంలేదు. పిచ్చోళ్లలా మాట్లాడుతున్నరు. క్యాడర్ లేక కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. అయినా ఉనికిని ప్రదర్శించడానికి లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజల ముందు చులకన అవుతున్నారు.

పునర్నిర్మాణంలో విపక్షాల విఫల పాత్ర

స్టాప్ దిస్ న్యూసెన్స్ అండ్ నాన్సెన్స్. డోంట్ బిహేవ్ రబ్బిష్. ఇప్పటికైనా ఆపండి. పునర్నిర్మాణంలో విఫలపాత్ర పోషిస్తున్నారు. మీ వైఖరి అందరికీ తెలుసు. ఇలాగేచేస్తే ఉన్న సీట్లు కూడా రావు. మీరేంచేసినా అభివృద్ధి కార్యక్రమాలు ఆగవు. ఇరిగేషన్ పనులు ఆలస్యం కావచ్చు.. పూర్తిగా ఆపడం మీ వల్లకాదు. ప్రజలకు టీఆర్‌ఎస్ వైఖరి తెలుసు. సర్వే రిపోర్టులు చూసి మీ గుండెలు ఆగుతున్నయి. నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. అసెంబ్లీలో చర్చపెడితే పారిపోతరు. మాట్లాడరు. ఎప్పుడు అసెంబ్లీ పెడుదామన్న సిద్ధంగా ఉండరు. పటిష్ఠమైన లక్ష్యం, పరిజ్ఞానం ఉంటే సభలో మాట్లాడండి. ప్రశ్నించండి. మేం ఎంతసేపైనా చర్చకు సిద్ధం. కాంట్రాక్ట్ ఉద్యోగులు, రాష్ట్ర అభివృద్ధి, ఒంటరి మహిళలకు పథకం అంటే కేసీఆర్ మాకు సినిమా చూపెడుతున్నాడని విమర్శలు చేస్తుంటారు. కాంగ్రెస్‌లో ఒక్క దృఢమైన నేత లేరు.

డ్రగ్స్ వ్యవహారంలో మంత్రులున్నా వదులొద్దని చెప్పా

'డ్రగ్స్ వ్యవహారంలో మంత్రులు ఉన్నా వదులొద్దు. అవసరమైతే క్యాబినెట్ నుంచి తొలగిస్తా' అని పోలీసులకు భరోసా ఇచ్చిన. మంత్రి ఉన్నా వదులొద్దని ఏ ముఖ్యమంత్రి అయినా చెప్తారా? ఇంత సిన్సియర్‌గా కష్టపడుతున్నా కాంగ్రెస్ వాళ్లు విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ ప్రభావం లేదు. మొగ్గలోనే తుంచేయాలనే ఆలోచనతో కఠినంగా వ్యవహరిస్తున్నా. అలా చేస్తే దుష్పాలన అంటారు. గుడుంబా, పేకాట లేకుండా చేశాం. విత్తనాల కల్తీ, ఆహార పదార్థాలు కల్తీ తయారుచేసే వారిని పట్టుకుని కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ఎన్డీయేలో మేం చేరలేదు

గూర్ఖాలాండ్ విషయంలో వ్యక్తిగా కాదు, పార్టీగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి ఎలాంటి వ్యక్తిని పెట్టాలని నన్ను అడిగారు. దళితుడైతే బాగుంటుందన్నా. దళితుడిని పెట్టినప్పుడు మద్దతు ఇచ్చాం. వెంకయ్యానాయుడు తెలుగు నాయకుడు, సంతోషంగా మద్దతు తెలిపాం. అంశాలవారీగా బీజేపీకి మద్దతిస్తున్నాం. బీజేపీతో దగ్గరగా ఉన్నామా? దూరమా? అనేది అప్రస్తుతం. ఎన్డీఏలో మేం చేరలేదు. కేంద్ర, రాష్ట్రాల దేశాన్ని బీజేపీ పరిపాలిస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్న రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటున్నాం. పీఎం, సీఎంల మధ్య చక్కటి ఆలోచనా విధానం ఉండాలి. తెలంగాణ తనంతటానే అభివృద్ధి చెంది, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.

హైదరాబాద్ గతేం కావాలి?

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మల్లన్నసాగర్ కీలకమైన స్టాక్ పాయింట్. ఇది 557 మీటర్ల ఎత్తులో కొండల మధ్య ఉంది. దీన్ని నదికి అడ్డంగా కాకుండా ఇంజినీర్లు ఎంపికచేసిన ప్రాంతంలో కడుతున్నాం. మల్లన్నసాగర్ నుంచి సింగూరుకు గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయి. ఎల్లంపల్లి కనెక్ట్ అయిన తర్వాత సింగూరు ప్రాజెక్టును ఆపేసిన మొదటి ముఖ్యమంత్రి నేనే. హైదరాబాద్, మెదక్, నిజామాబాద్ ప్రజలకు న్యాయం చేయాలని, రైతులకు మేలు జరుగుతదని బంద్ చేసినం. మా పార్టీ నాయకులే సింగూరు నీళ్ల విడుదల చేయాలని కోరారు. కానీ నేను ఒప్పుకోలేదు. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కడ్రాప్ కూడా మంజీరలో వస్తలేదు. లోకల్‌లో వర్షం పడితే 100 నుంచి 200 క్యూసెక్కుల నీళ్లు వచ్చునయి. రెండోది ఎస్సారెస్పీలో 9 టీఎంసీలు ఉంది. ఎల్లంపల్లిలో 10 టీఎంసీలు ఉంది. అంతే ఉంటది. అన్నిటికీ మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కూడా అన్నిటికంటే ముందుగా నిండేది కడెం ప్రాజెక్టే. ఆదిలాబాద్‌లో కొమురంభీం ప్రాజెక్టు, ఆల్మట్టిలో నీళ్లు నిండినా, వాళ్లు వదిలితేనే మనకు నీళ్లు వస్తయి. ఈ పరిస్థితుల్లో ఇట్లాగే కాలంఅయితే హైదరాబాద్ గతేం కావాలి? అంటే ఎల్లంపల్లికి నీళ్లురావు. నాగార్జునసాగర్‌కు నీళ్లురావు. ఏం మిగులుతది హైదరాబాద్‌కు. ఒక్క సింగూరు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సింగూరును కాపాడుకోవాలి. అది ఈ రోజునాటి పరిస్థితి. ఇంకా 60 రోజులు కాలం ఉంది. గత ఏడాది సెప్టెంబర్‌లో వర్షాలు పడ్డాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డి నీళ్లు అడిగితే చెప్పా, అన్నా మనం రాష్ట్రాన్ని నడుపుతున్నాం. మీరు అర్థం చేసుకోవాలి. జిల్లాకో, నియోజకవర్గానికో కాకుండా స్టేట్ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు ఇబ్బందులు రాకుండా సింగూరును కాపాడుతున్నా..కాలం కలిసొస్తే చూద్దామని చెప్పారు. ఇటువంటి పరిస్థితులను అధిగమించడానికి నేను పట్టుకున్నది మేడిగడ్డ. దాని మీదా కూడా లెఫ్ట్‌పార్టీలు కిరికిరి చేసినయి. ఈ రోజు సింగూరులో చుక్క రాలేదు, నిజాంసాగర్‌లో రాలే. ఎస్సారెస్పీలో రాలే..ఎల్లంపల్లిలో రాలే..కడెం నిండలేదు. ఇవన్నీ గోదావరి ప్రాజెక్టులే. మేడిగడ్డ ఉంటే 100 నుంచి 120 టీఎంసీలు కలిసొచ్చేవి. కరువు వచ్చినప్పుడు తెలంగాణను కాపాడుకోవడానికి మల్లన్నసాగర్ అవసరం. దీనికి 16 వేల ఎకరాలు కావాలి. వేములపల్లి అనే ఊరును కమ్యూనిస్టు కంత్రీలు, కాంగ్రెస్ భూతాలు పట్టుకున్నాయి. నేను ఫాంహౌస్ దగ్గర ఉన్నప్పుడు అక్కడే ఉన్న గ్రామప్రజలను పిలిచా. ముఖ్యమంత్రి పిలిస్తే కూడా పోవద్దని వాళ్లకు వందల ఫోన్లు, ఫేస్‌బుక్‌ల మెసేజ్‌లు పెట్టిండ్రు. అయినా వచ్చి మాట్లాడిండ్రు. ఒకరిద్దరు మినహా అందరు భోజనం కూడా చేసి పోయిండ్రు. కానీ వాళ్ల పత్రికలో మాత్రం వ్యతిరేక వార్తలు రాశారు. అవో పేపర్లు, మేం చూడాలి. ప్రగతి నిరోధకంగా ఒక ప్రాజెక్టును ఒక ఊరు ఆపుతదా? ఓపెన్ మైండెడ్‌గా ఉంటే అందరితో కలిసి మాట్లాడతాం.. చర్చిస్తాం. సంస్కారమైన పనేనా ఇది? ఫాంహౌస్‌కు పొయ్యేది జల్సాలకేనా? అలా చేయాలంటే హైదరాబాద్‌లో ఎన్ని ఫాంహౌస్‌లు ఉన్నాయి. ఇలా పిచ్చికూతలు కూసేవాడి గురించి మీరు రాతలు రాస్తారు. ఎన్నో కష్టాల కోర్చి, పదవులు త్యాగంచేసి ప్రత్యేక రాష్ట్రం సాధిస్తే, సాధించిన ముఖ్యమంత్రిపై ఇలాంటి రాతలు రాస్తారా? వాళ్లు జోకర్లా..బ్రోకర్లా..? ఏం మాట్లాడతరు?



మేం లౌకికవాదులం

మేం జీవితాంతం పూర్తిగా లౌకికవాదులుగానే ఉంటాం. ఎవరితో పనిచేస్తున్నామా చేయట్లేదా అన్నది అప్రస్తుతం. దేశంలో ఎప్పుడూ సెక్యులర్‌గానే ఉండాలని కోరుకుంటున్నా. అన్ని మతాలు, జాతుల వాళ్లు, సోదరభావతో కలిసికట్టుగా నివసించాల్సిందే. ముస్లిం దేశంలో రెండే పండుగలు ఉంటాయి. క్రిస్టియన్ దేశంలో ఒకటే పండుగ, మన దేశంలో అనేక పండుగలు.. దీపావళి, రంజాన్, దసరా, బక్రీద్, క్రిస్‌మస్, ఈస్టర్ ఇట్లా ప్రతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొనే ఏకైక దేశం మనదే.

సిన్సియర్‌గా పనిచేస్తే ప్రజలే గెలిపిస్తారు.

అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగినా ఒకటే..తగ్గినా ఒకటే. చిన్నరాష్ట్రాల్లో రాజకీయ అస్థిరత ఎక్కువ వచ్చే ప్రమాదం ఉంది. జైరాంరమేశ్ రాతల వల్లే నియోజకవర్గాలు పెరగని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన మంత్రే రాష్ట్రం బ్రహ్మాండంగా ముందుకు వెళ్తున్నదని చెప్పిండు. మాకు గర్వం లేదు. సిన్సియర్‌గా పనిచేస్తే ప్రజలే గెలిపిస్తారనే నమ్మకం ఉంది. మొన్న ప్రధానితో మాట్లాడినప్పుడు సీట్లు పెంచరని అర్థమైంది. నేను 20 ఏండ్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన.. తెలంగాణ ఏర్పడితే తప్ప పరిస్థితులు మెరుగవుతాయని భావించిన. కఠినమైన నిర్ణయం తీసుకుని, ఎవరు వచ్చినా.. రాకపోయినా ప్రత్యేకరాష్ట్రం కోసం పోరాడి విజయం సాధించా. కొత్త రాష్ట్రం కాబట్టి కాస్త కొత్తగా ముందుకు వెళ్దామని డిసైడ్ అయ్యా. పేకాట నిర్మూలన, హరితహారం వంటి మంచిపనుల్లో మీడియా సపోర్ట్ కావాలి. మల్లన్నసాగర్, కాళేశ్వరం కనెక్ట్ అయితే భిన్నమైన తెలంగాణ దర్శనమిస్తది. ఇది తెలిసే ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. రెండు, మూడేండ్లలో గొప్ప తెలంగాణ ఖాయం.

రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయా?

లెఫ్ట్ పార్టీలు ఇంకా రాష్ట్రంలో ఉన్నాయా? మూడొందల సంఘాల మీటింగ్, 600 సంఘాల మీటింగ్..రౌండ్ టేబుల్ ..స్క్వేర్ టేబుల్ మీటింగ్‌లు..300 పార్టీలా? వాళ్లకు 350 ఓట్లు కూడా రాలేదు. 350 ప్రజాసంఘాలు, దానికి ఎన్ని ఓట్లు వస్తాయండి. కనీసం డిపాజిట్లు రావా? అదో సంఘం..అదో పార్టీ..వాళ్లు మాట్లాడేది మేం పట్టించుకోవాలి? బేస్‌లెస్, ఫాల్స్ అలిగేషన్స్ వినడానికి సిద్ధంగా లేం. ఎరవన్నా..నిజంగా దమ్ముంటే ప్రూవ్ ఇట్. గట్స్ ఉండాలి. మేం దందాలు చేస్తలేం. వాటికి రాష్ట్రంలో చోటులేదు. వాళ్లకు ఏడాదికి ఆరు సమ్మెలు కావాలి. కానీ అర సమ్మె కూడా చేయలేదు. చేసేవాడు లేడు, పట్టించుకునే వాడు లేడు. జీహెచ్‌ఎంసీ కార్మికులు,అంగన్‌వాడీలను రెండోసారి నేనే పిలిచి రెండోసారి జీతం పెంచిన. వాళ్లు డిమాండ్ చేసిండ్రా? ఆశా వర్కర్లు డిమాండ్ చేసిండ్రా.. పిలిచి పెంచిన. అంతే వాళ్ల దుకాణం బంద్ అయ్యింది. లెఫ్ట్‌పార్టీలకు ఏం బాధ్యత ఉంది. వాళ్లకు ఒక పాత్ర ఉందా..? నిర్మాణాత్మకమైన వైఖరి ఉందా? ఆ పార్టీలు నానాటికీ ఎందుకు కృశించిపోతున్నాయి? ఏ సర్వేలో చూసినా వాళ్ల శాతం ఎంత కొన్ని పార్టీలకైతే ఒక శాతం కూడా లేదు. వాళ్లు సమీక్షించుకోవాలి. సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వచ్చి ఒక్కటే మాట్లాడతారు. మొన్నకూడా వచ్చి ఒక పిచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చిండు. సీపీఐ జాతీయ కార్యదర్శికి ఆ సిల్లీథింగ్స్ అవసరమా? తెలంగాణ ఉద్యమంలో 38 పార్టీలతో పనిచేశాం. 2004లో మహాకూటమిలో వాళ్లు ఉన్నారు. గౌరవప్రదంగా పనిచేస్తే పద్ధతిగా ఉంటుంది. కానీ తిట్టడం, నిందించడం, అర్థంపర్థంలేని ఆరోపణలు చేయడం..ఇది మాత్రమే మా పని అంటే ఏం చేస్తమండి. వాళ్లను పనికిమాలిన సంఘంగా భావిస్తాం.

పరేషాన్‌లో లోకల్ బీజేపీ

ఒక్కసారి కాదు.. రిపీట్‌గా చెప్పినా.. మల్ల మొన్న కూడా చెప్పిన.. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ చేయాలని ఉందన్నాం. ఇదే సమయంలో సుప్రీంకోర్టు 50శాతం రిజర్వేషన్లు దాట వద్దని చెప్పింది. దీనికి సంబంధించిన వివాదం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ తమిళనాడులో నిరాటంకంగా అమలు జరుగుతున్నది. మనం తీసుకున్న థియరీనే అది. ఎన్నికలకు ముందు, ఎన్నికలప్పుడు.. శాసనసభలోనూ చెప్పిన. మల్ల కూడా చెప్తా. తమిళనాడుకు ఏ న్యాయమైతే జరుగుతున్నదో మాకు అదే న్యాయం చేయండి.. వాళ్లకు ఇచ్చిన వెసులుబాటు మాకూ ఇవ్వండి. ఒక వేళ తమిళనాడు కేసు సుప్రీంకోర్టు కొట్టివేసిందనుకో.. మాది కూడ కొట్టివేస్తది.. అంతే కదా! ఇండియాలో ఒక దగ్గర అమలుచేసి.. ఇంకోదగ్గర అమలుచేయకపోతే అన్యాయం. మేము ముస్లింలు అంటలేము.. మతపరమైన రిజర్వేషన్లు చేయమని అంటలేము. ఎకనామికల్లీ బ్యాక్ వర్డ్.. బీసీ కమిషన్ రిపోర్ట్ తీసుకొని పోయినం. ఇంకో మాట చెప్తున్న.. పాపం లోకల్ బీజేపీ వాళ్లు పరేషాన్‌లో ఉన్నరు.. అవును నిజం చెపుతున్న మీరు కూడా రాయాలి (జర్నలిస్టుల నుద్దేశించి) వాళ్లు బిల్‌కుల్ పరేషాన్‌ల ఉన్నరు. ఎందుకంటే బిల్లు అసెంబ్లీలో పాస్ చేసుకొని కౌన్సిల్‌కు వెళ్లినప్పుడే సరిగ్గా ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమని వీళ్లు ఇక్కడ మాట్లాడారు.. సరిగ్గా అదే సమయలో ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఒడిశాలో వాళ్ల పార్టీ మీటింగ్‌లో స్పష్టంగా చెప్పిండు.. 'ముస్లింల వెనుకబాటుతనాన్ని కూడా బీజేపీ పరిగణలోకి తీసుకోవాలె. దేశవ్యాప్తంగా వంద మీటింగులు ముస్లింలతో పెట్టాలె' అని మాట్లాడారు. అది బాజాప్త పేపర్ల వచ్చింది. అప్పుడు బీజేపీవాళ్ల నోళ్లకు కుట్లు పడ్డయి. తరువాత నేను ప్రధానిని కలిసినప్పుడు స్పష్టంగా చెప్పిన. 'మా రాష్ట్రంలో పెద్దసంఖ్యలో ముస్లింలు ఉంటరు.. మేం రిజర్వేషన్లు తెచ్చుకున్నం.. ఎస్సీలకు ఒక శాతం పెరుగుతున్నది.. ఎస్టీలకు 3 శాతం పెరుగుతున్నది. ఇవైతే ఇవ్వాల్సిందే. 50శాతం కంటే పెరిగే ప్రాబ్లం మాకు కూడ వస్తది. మాకు ఇస్తానంటే 9వ షెడ్యూల్‌లో పెట్టు. ఇయ్య అంటవు.. నెగెటివ్ ఆర్డర్ ఇయ్యి.. నేను కూడ కోర్టుకు పోత' అని ఓపెన్‌గా ప్రధానికి చెప్పిన. 'నాకు నా ప్రయోజనం నెరవేరాలె. ఇస్తే.. నీకు మంచిపేరు వస్తది' అని చెప్పిన. ఆయన నాకు కుండబద్దలు కొట్టినట్లు చెప్పిందేమిటంటే.. 'మా గుజరాత్‌లో కూడా 8 శాతం ముస్లిం సోదరులు ఉన్నరు. వాళ్లల్లో కూడా చాలా మంది వెనుకబడిన వాళ్లు ఉన్నారు. ఒక్కసారిగా 8 శాతం మంది బాధ పక్కకు పెట్టి మనం ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని నడుపగలుగుతామా? కాబట్టి వాళ్లను కూడా కలుపుకొని నడువాలె. మీ విషయాన్ని నేను సానుకూలంగా పరిశీలిస్తా.. మీరు పంపియ్యుండి' అని చెప్పిండు. పంపించినం.. ఇప్పుడు హోంశాఖకు చేరింది. మొన్నటి ట్రిప్‌లో రాజనాథ్‌సింగ్‌ను కలిసినప్పుడు చెప్పిన. 'వచ్చిందని హోం వర్గాలు ధృవీకరించినయి.. మీ క్యాబినెట్, అసెంబ్లీ తీర్మానాలు ఉన్నాయి' అని ఆయన చెప్పారు. మొన్న మాట్లాడినప్పుడు ప్రధాన మంత్రికి కూడా చెప్పిన.



జైరాం రమేశ్ సర్పంచ్‌గానైనా గెలిచిండా?

మూడేండ్ల నుంచి సొల్లు పురాణ ఆరోపణలు చాలా చేసిండ్రు. ఒక్కటంటే ఒక్కటి మీ బతుక్కి..ఒక డాక్యుమెంటు.. ఒక ఎవిడెన్స్ ఉందా? ఆధారం లేకుండా సన్నాసుల లాంటి వాళ్లకు జర్నలిస్టులు వత్తాసు పలుకుతరా? వంద శాతం నోరు కట్టుకుని, కడుపుకట్టుకుని పనిచేస్తున్నం. మా ఆత్మకు తెలుసు. ప్రజలకు తెలుసు. పైరవీలు, అరాచకాలు, దందాలు లేవు. సెక్రటేరియట్‌లో పైరవీకారుల మందలుగా కనపడుతున్నయా? ట్రాన్స్‌ఫర్ల దందాలు కనపడుతున్నాయా? అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడాఉంది? జైరాంరమేశ్ సర్పంచిగానైనా గెలిచిండా? రాజ్యసభ సభ్యత్వమే తప్ప, ప్రజాజీవితంతో సంబంధమే లేదు. ఆయనకు ఏం తెలుసు.. పోలీసులకు వాహనాలు ప్రభుత్వాలు కొనడం తప్పా? అవినీతి జరిగినట్లు రుజువు చేస్తావా? ముక్కు నేలకు రాస్తావా? నీకు ధైర్యం ఉంటే ఆరోపణలకు రుజువులు చూపించు. చాలా మంది తెలివి లేక పిచ్చికూతలు కూస్తరు. నిజానికి బైసన్‌పోలో గ్రౌండ్, జింఖానా గ్రౌండ్ కూడా డిఫెన్స్‌లీజ్‌కు ఇచ్చిన స్థలాలు. బైసన్‌పోలో నుంచి ప్యారడైజ్ వరకు నాలుగువైపులా రోడ్డు ఉండేలా 60 ఎకరాలు కావాలని అడిగాం. రాజీవ్ రహదారిని విస్తరించి పీవీ నర్సింహారావు హైవే వంటిది కట్టాలి. ప్యారడైజ్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆ స్థలాలు ఇస్తే సెక్రటేరియట్, అసెంబ్లీ, కౌన్సిల్ నిర్మిస్తాం. నిజాం సంస్కృతి ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నాం. తెలంగాణ ఏమైనా బికారి రాష్ట్రమా? లక్ష ఎకరాలు నిజాంనవాబు హైదరాబాద్‌కు ఇచ్చారు. ఎంత గొప్పగా కట్టాలి అసెంబ్లీని! మేం కడుతామంటే, మీకు ఓపిక లేదు. టీఆర్‌ఎస్ మార్క్, కేసీఆర్ మార్క్ ఉండొద్దు. మేం చెయ్యలేదు.. మీరు కూడా చెయ్యొద్దన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ పరిస్థితి. గచ్చిబౌలి స్టేడియంలో పెండిండ్లు అయితున్నవి. ఆటలు లేవు. జింఖానా గ్రౌండ్ తీసేస్తమని చెప్పినమా? చెప్పలేదు కదా.. తీసేస్తమని ఊహించుకున్నారు. హైదరాబాద్ గొప్ప సంస్కృతి ఉన్న నగరం, అంతర్జాతీయస్థాయిలో ఏ సమావేశం నిర్వహిద్దామన్నా.. డబ్బాలాంటి రవీంద్రభారతి తప్ప వేరే దిక్కులేదు. అదే కైలాసం అనుకుంటున్నం. దాంట్లనే పంచాగశ్రవణం, కథ! హైదరాబాద్‌స్థాయికి తగ్గట్టుగా ఆర్ట్ గ్యాలరీ, మూడు వేల మంది కూర్చునే హాల్ కావాలి.



వ్యవసాయానికి పెట్టుబడి పథకం మీరు కూడా చేయండని ప్రధానికి చెప్పిన

'వ్యవసాయం విషయంలో పెట్టుబడి సమకూర్చే పథకం బాగుంటది. నేను చేస్తను. మీరూ చేయండి' అని ప్రధానమంత్రికి చెప్పిన. నోట్ ప్రిపేర్‌చేసి ఇవ్వండని ప్రధాని అడిగిండు. నెక్స్ట్ ట్రిప్పులో నేను పోయినప్పుడు ఆయనకు ఆ నోట్ ఇవ్వాలి. అదే సందర్భంలో నేను చెప్పిన.. 'లాస్ట్ ట్రిప్‌లో నేను రిక్వెస్ట్ చేస్తే పాజిటివ్‌గా తీసుకుంటామని అన్నరు. మీకు కూడా రాష్ట్రపతి ఎన్నిక అయింది. ఉప రాష్ట్రపతి ఎన్నిక అయిపోతున్నది. నెక్స్ట్ ట్రిప్‌లో వచ్చినప్పుడు కూడా రిజర్వేషన్ల అంశం తీసుకొని దాన్ని తేల కొట్టాలని చెప్పిన. తప్పకుండా చేద్దామని ప్రామిస్ చేసిండు. ఇది ముఖ్యమంత్రిగా నాకు, ప్రధానమంత్రికి మధ్య జరిగిన సంభాషణ. ఆయన సానుకూలతతో ఉన్నాడనే అనుకుంటున్నా. బాధ్యత గల ప్రధాని కాబట్టి వచ్చే పర్యటనలో నేను ఢిల్లీకి పోయినప్పుడు తెలుస్తది.

ప్రధాని నిర్ణయం బట్టి తదుపరి చర్య

యుద్ధం చేయాల్నా? ఫైట్ చేయాల్నా? కోర్టుకు పోవాల్నా? ఏం చేయాలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తేలిన తరువాత ఎస్సీలది జీవో ఇచ్చి అమలు చేస్తం. ఒక వేళ సుప్రీంకోర్టునుంచి స్టేనో ఏదో వస్తే ఆల్రెడీ పిల్లి సంఘాలు రెడీగా ఉన్నాయి కదా! ఈ పిల్లులు ఏం చేస్తయో తెలియదు. ఈ పిల్లులు కోర్టుకు పోతే మళ్ల కూడా దాన్ని బ్యాటింగ్ చేస్తం. యుద్ధం చేస్తం. ప్రయత్నం మాత్రం వందశాతం చిత్తశుద్ధితో చేస్తం. విజయం సాధిస్తామనే విశ్వాసం నాకు ఉంది. 10, 15 రోజుల్లో ఒక ఐడియా వస్తుంది. వెంకయ్యానాయుడు ప్రమాణ స్వీకారం 11వ తేదీన ఉంది. బహుశా నేను వెళుతా. ఆ రోజు కాకపోతే మరుసటి రోజు మంచి ఏమిటి? చెడ్డ ఏమిటి? మాట్లాడుతం. దానిని బట్టి నిర్ణయం తీసుకుంటం. కాంట్రాక్టుకానీ. పార్ట్‌టైమ్ కానీ.. వీళ్లందరి ఎడల ప్రభుత్వం సానుభూతితో ఉంది. శషభిషలు లేవు.. వాళ్లకు తప్పకుండా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం. వివరాలన్నీ తెప్పిస్తం. వివరాలు వచ్చిన తరువాత క్యాబినెట్ మీటింగ్ పెట్టి, సమగ్రంగా చర్చించి, ఎంత వరకు సాధ్యమైతదో అంత వరకు న్యాయం చేసి వాళ్ల కడుపులు నింపే ప్రయత్నం చేస్తం.

మాతాశిశువులకు మెరుగైన వైద్యం

- తొమ్మిది దవాఖానల్లో ప్రత్యేకంగా విభాగాలు
- మరో ఆరుచోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సర్కారు దవాఖానల్లో మాతాశిశువులకు మెరుగైన వైద్యం అందించి మరణాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మాతాశిశు సంరక్షణ(ఎంసీహెచ్) ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవం జరిగితే రూ.13వేలు (ఆడపిల్ల జన్మిస్తే మరో వెయ్యి అదనం) అందిచడంతోపాటు కేసీఆర్ కిట్లను ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. జూన్ 3న కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమయ్యాక సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే మాతాశిశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది దవాఖానాల్లో మాతాశిశు సంరక్షణ ప్రత్యేక విభాగాల ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే కరీంనగర్, సంగారెడ్డి, భద్రాచలం, ఖమ్మం దవాఖానాల్లో ఎంసీహెచ్ విభాగాలను ప్రారంభించారు. మిగిలిన ఐదు దవాఖానల్లో త్వరలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి తర్వాత మరో ఆరు ఎంసీహెచ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు.

ఎంసీహెచ్‌కు ఖర్చు 10,35,300

ప్రతి ఎంసీహెచ్ విభాగానికి స్టాఫ్ నర్సులు, డీఈవోలు, కౌన్సిలర్లు, ఓబీజీవైలు, మెడికల్ ఆఫీసర్లు, అనస్తీషియన్, ల్యాబ్ టెక్నీషియన్లు, థియేటర్ అసిస్టెంట్లు, గార్డులు, కాంటింజెంట్ వర్కర్లు.. మొత్తం సిబ్బందికి నెలకు రూ.10,35,300 ఖర్చు చేయనున్నారు. ప్రత్యేకంగా 50 పడకల సామర్థ్యంతో పది మాతాశిశు వైద్యశాలలను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నిర్ణయించింది. అన్ని దవాఖానల్లో పెరుగుతున్న ప్రసవాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని లేబర్ రూంల ఆధునీకరణ, అమ్మ ఒడికి అదనంగా మరో రెండు వందల 102 వాహనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఎంసీహెచ్‌కు ఎంపికచేసిన దవాఖాన	ప్రసవాల సంఖ్య	
	ప్రతినెలా	ఏడాదిలో
డీహెచ్ మహబూబ్‌నగర్	355	4257
టీహెచ్‌ఎంహెచ్ సుల్తాన్‌బజార్	1,071	12,857
డీహెచ్ సంగారెడ్డి	432	51,88
డీహెచ్ కరీంనగర్	287	3,449
ఏహెచ్ జనగామ	43	519
డీహెచ్ ఖమ్మం	406	4,874
డీహెచ్ నల్లగొండ	334	4,012
డీహెచ్ తాండూరు	281	3,373
డీహెచ్ కింగ్ కోఠి	164	1,963
మొత్తం	**3,374**	**40,492**

తెలంగాణకు 1.36 కోట్ల 'దీన్‌దయాళ్' నిధులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ సశక్తీకరణ్ పురస్కార్ –2017 కింద తెలంగాణ ప్రభుత్వానికి రూ.1.36 కోట్ల నిధులను అందించినట్టు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2015– 16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులను కింద పేర్కొన్న జిల్లాపరిషత్, మండలపరిషత్, గ్రామ పంచాయతీలకు ఖర్చుచేయాలని పేర్కొన్నది. కరీంనగర్ జిల్లాపరిషత్‌కు రూ.50 లక్షలు, వనపర్తి జిల్లా ఘన్‌పూర్ గ్రామ పంచాయతీకి రూ.25 లక్షలు, జయశంకర్ జిల్లా తాడ్వాయి గ్రామపంచాయతీకి రూ.25 లక్షలు, నిజామాబాద్ జిల్లా వెల్పూర్ (వాయిల్పూర్) గ్రామపంచాయతీకి రూ.12 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లా కస్బేకట్కూర్‌కు రూ.8 లక్షలు, అదే జిల్లాలోని గోపాల్‌రావ్‌పల్లికి రూ.8 లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లా నిజాలాపూర్‌కు రూ.8 లక్షలు, మెదక్ జిల్లాలోని ఇబ్రహీంపూర్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయించింది.

మరో 30 పెట్రోల్ బంకుల ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లశాఖలో ప్రస్తుతం నిర్వహిస్తున్న పెట్రోల్‌బంకులతోపాటు మరో 30 ఏర్పాటు చేయనున్నారు. బుధవారం 10 జిల్లాల జైలు సూపరింటెండెంట్లతో జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ సమీక్షించారు. ఈ 30 బంకులను ఐవోసీ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వంద పెట్రోల్‌బంకులను ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన కాగా ప్రసుతం 30 బంకుల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధంచేశారు.

బీసీ కమిషన్ ప్రత్యేకాధికారిగా వీ చంద్రశేఖర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బీసీ కమిషన్ ప్రత్యేకాధికారిగా రాజేంద్రనగర్ డిప్యూటీ కలెక్టర్ వీ చంద్రశేఖర్ నియమితులయ్యారు. చంద్రశేఖర్‌ను డిప్యుటేషన్‌పై ప్రత్యేకాధికారిగా నియమిస్తూ బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జీ అశోక్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఏఈఈ హాల్‌టికెట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏఈఈ ఉద్యోగాలకు ఈ నెల 12,13 తేదీల్లో నిర్వహించనున్న పరీక్ష హాల్‌టికెట్లను ఒకట్రెండు రోజుల్లో టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. వివిధ క్యాటగిరీల్లోని 463 పోస్టులకు జూన్ 2వ తేదీన టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కొలువులకు పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతున్న టీఎస్‌పీఎస్సీ ఒకట్రెండు రోజుల్లో వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు పెట్టనున్నట్లు తెలుస్తున్నది.

వెలుగులోకి మరిన్ని అక్రమాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (మెదక్, నిజామాబాద్) వై గంగాధర్‌రెడ్డికి సంబంధించిన మరిన్ని అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. బినామీ పేరుతో ఉన్న బ్యాంకు లాకర్‌ను పరిశీలించగా కిలో బంగారం, జీవిత బీమాపత్రాలు, ఓ పెన్‌డ్రైవ్ లభించినట్లు మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. గంగాధర్‌రెడ్డి వద్ద ఆదాయానికి మంచి ఆస్తులు ఉన్నట్టు సమాచారం రావడంతో ఆయన ఇండ్లలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సోదాల్లో ఆదాయానికి మించి భారీగా ఆస్తులున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సోదాల్లో లభించిన ఆధారాలతో కూకట్‌పల్లి ఐసీఐసీఐ బ్యాంకులో ఉన్న బినామీ లాకర్‌ను అధికారులు పరిశీలించారు. ఈ కేసుపై ఇంకా విచారణ కొనసాగుతున్నదని డీఎస్పీ తెలిపారు.

టీశాట్ నెట్‌వర్క్ చానళ్లలో నేటి ప్రసారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీశాట్ నెట్‌వర్క్ నిపుణ చానల్‌లో గురువారం ఉదయం 6 నుంచి 7 గంటలవరకు వ్యవసాయం–మెళకువలు, 8 నుంచి 9 వరకు కరెంట్ అఫైర్స్, సాయంత్రం 6 నుంచి 7 వరకు వ్యవసాయం–మెళకువలు, రాత్రి 7 నుంచి 8 వరకు అంతా రామమయం ప్రసారం కానున్నది. మధ్యాహ్నం 2 నుంచి 3 వరకు హిందీ, 3 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఉర్దూ గురుకుల ప్రత్యక్ష ప్రసారాలు ప్రసారమవుతాయి. టీశాట్ విద్య చానల్లో ఉదయం 10 నుంచి 10:30 వరకు తెలుగు గుడ్ హ్యాండ్‌రైటింగ్, 11 నుంచి 11:30 వరకు ఇంగ్లిష్ గుడ్ హ్యాండ్‌రైటింగ్ ప్రసారమవనున్నది.

టీడీపీకి ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి గుడ్‌బై

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ టీడీపీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి తన సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి వైపే మొగ్గారు. గత కొంతకాలంగా టీడీపీలో ఉండాలా.. సోదరునితోపాటు వెళ్లాలా అన్న అంశంపై ఎటూ తేల్చుకోని చక్రపాణిరెడ్డి.. తాజాగా బుధవారం టీడీపీకి రాజీనామా చేశారు. శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన నేపథ్యంలో పార్టీని వీడి వైసీపీలో చేరారు. దీంతో చక్రపాణిరెడ్డి కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. గురువారం ఉదయం వైసీపీలో చేరుతానని మీడియాకు వెల్లడించారు.



నితీశ్ కుమార్‌కు మా ఇంటిపై సీబీఐ దాడి జరుగుతుందని ముందే తెలుసు. నాపైనా, నా కుటుంబం పైనా కేసులు పెట్టడానికి బీజేపీతో కలిసి నితీశ్ కుట్ర పన్నిండు. ఉపముఖ్యమంత్రిగా తేజస్వికి వస్తున్న ప్రశంసలను చూసి నితీశ్ బెదిరిపోయి ఈ విధంగా పల్టీ కొట్టిండు.

లాలు ప్రసాద్ యాదవ్, ఆర్‌జేడీ అధినేత

ఇన్‌కమ్ టాక్స్ అధికారులు తమ పని తాము చేసుకుపోతున్నారు. వారు కర్ణాటకకు చెందిన ఓ మంత్రి రిసార్ట్‌లో సోదాలు నిర్వహించారు. ఆ రిసార్టులోనే గుజరాత్‌కు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారన్నది వారి పరిధిలోని విషయం కాదు. ఇందులో అధికార దుర్వినియోగమన్నదే లేదు.

అరుణ్ జైట్లీ, కేంద్రమంత్రి



చరిత్రలో నేడు



1914

బెల్జియంను ఆక్రమించిన జర్మనీ. మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం.

1934

జర్మనీ ఛాన్సలర్, అధ్యక్షపదవులను ఏకం చేసి కొత్తపదవిని సృష్టించిన హిట్లర్. తనకు తాను 'నేత'గా ప్రకటించుకున్న హిట్లర్.





1960

ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందిన నైగర్.

అమెరికాలో ఆహార-ఔషధ శాఖ ప్రజారోగ్యం గురించి సరికొత్త నిర్ణయం తీసుకున్నది. పొగాకు ఉత్పత్తులు, ముఖ్యంగా సిగరెట్లలో 'నికోటిన్' శాతాన్ని కనిష్ఠస్థాయికి తగ్గించి సిగరెట్లు తయారు చేయాలని ఆదేశించింది. దీంతో పొగ తాగేవారు సిగరెట్లకు అలవాటు పడే ప్రమాదం ఉండదని చెబుతున్నారు. ఈ మధ్యన మనదేశం కూడా పొగాకు ఉత్పత్తులపై వాటితో జరిగే ప్రమాదం గురించి హెచ్చరికలు ముద్రిస్తున్నది. దీనికితోడు అమెరికా చేసిన విధంగా చర్యలు తీసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

ది హిందూ

ఈ మధ్య పదవీ విరమణ చేసిన వంద మంది సైనిక అధికారులు ఓ బహిరంగ లేఖలో మిలిటరీ, సాయుధ బలగాలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. నిజమైన భిన్నత్వంలో ఏకత్వం సైనిక బలగాలలోనే బలంగా ఉన్నదన్నారు. పౌరసమాజంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయాల పేర ప్రజల మధ్య ఐక్యత దెబ్బతిని ప్రజాస్వామ్యం బలహీనపడింది. కానీ సైన్యం వీటన్నింటికీ అతీతంగా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా బలీయంగా ఉన్నది. ఇదే భారతీయ శక్తి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సింధు జల చర్చలు

నదీ జలాలు ఇరుగు పొరుగు మధ్య వైషమ్యాలనే సృష్టించాలని లేదు. శాంతి సౌహార్ద్రతలకు, అభివృద్ధికి సంకేతాలుగా నిలువవచ్చు. చరిత్రాత్మకమైన సింధు జల ఒప్పందంపై మనస్పర్థలను తొలిగించుకోవడానికి భారత్, పాకిస్థాన్ దేశాలు తాజా చర్చల్లో పురోగతి సాధించడం హర్షణీయం. భారత్ కిషన్‌గంగా (జీలం ఉపనది), చీనాబ్ నదులపై కొన్ని పరిమితులతో జలవిద్యుత్ ప్రాజెక్టులను నిర్మించుకోవచ్చునని ఈ చర్చల సందర్భంగా ప్రపంచబ్యాంకు ప్రకటించింది. వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్తాన్ మధ్య కార్యదర్శుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చలు సౌహార్ద్రపూరిత వాతావరణంలో జరిగాయని, సెప్టెంబర్‌లో మళ్ళా సమావేశం కావడానికి అంగీకారం కుదిరిందని ప్రపంచబ్యాంకు తన ప్రకటనలో వెల్లడించింది. రెండు దేశాల మధ్య ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని ఉన్న సమయంలో నదీ జలాలపై ఇరు పక్షాలు చర్చించుకోవడమే అభినందనీయం. జమ్మూకశ్మీర్‌లో నిర్మాణం తలపెట్టిన రెండు జల విద్యుత్ ప్రాజెక్టులపైనా పాకిస్థాన్ అభ్యంతరం చెబుతున్నది. కిషన్ గంగా నదిపై నిర్మించే జల విద్యుత్ కేంద్ర నిర్మాణం (330 మెగావాట్లు) 2007లో ప్రారంభమైంది. ఇది గత ఏడాదే పూర్తి కావలసింది. అయితే దీనిపై పాకిస్థాన్ హేగ్ న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. కనిష్ఠ స్థాయిలో జలాన్ని భారత్ జలవిద్యుత్ కోసం మళ్ళించుకోవచ్చునని హేగ్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. చీనాబ్ నదిపై రాత్లే దగ్గర నిర్మించ తలపెట్టిన జల విద్యుత్ ప్రాజెక్టు (850 మెగావాట్లు)పై కూడా పాకిస్థాన్ అభ్యంతరం తెలిపింది. అయితే ప్రపంచబ్యాంకు భారత్ తప్పులేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ సింధు జల ఒప్పందంలోని సంక్లిష్టతల దృష్ట్యా అనేక సాంకేతిక అంశాలు, వ్యాఖ్యానాలు ముందుకు వస్తున్నాయి.

సింధునదీ బేసిన్‌లోని ఆరు నదులు టిబెట్‌లో జనించి అరేబియా సముద్రంలో కలుస్తయి. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో సింధు జల ఒప్పందం 1960 సెప్టెంబర్ 19 వ తేదీన కుదిరింది. దీనిపై అప్పటి ప్రధాని నెహ్రూ, నాటి పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం తూర్పున ఉన్న రావి, బియాస్, సట్లేజ్ నదులపై నియంత్రణ భారత్‌కు, జీలం, చీనాబ్, సింధు నదులు పాకిస్థాన్‌కు కేటాయింపు జరిగింది. భారత్ పశ్చిమ నదులను కూడా వినియోగించుకోవచ్చునని అంటూనే నిలువపై పరిమితులను ఈ ఒప్పందం నిర్దేశిస్తున్నది. భారత్, పాకిస్థాన్ దేశాలు జలవివాదాన్ని పరిష్కరించుకొని, కాపాడుకుంటున్న తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను అందుకొంటున్నది. రెండు దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు కూడా ఈ ఒప్పందం ఉల్లంఘనకు గురికాలేదు. అయితే ఎగువన ఉన్న దేశమైన భారత్ ఏ ప్రాజెక్టు చేపట్టినా తమకు నీటి లభ్యత తగ్గుతుందనే కారణాలను చూపి పాకిస్థాన్ అభ్యంతరాలు చెబుతున్నది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ 'రక్తం, నీరు కలిసి ప్రవహించదు' అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. సింధు జల ఒప్పంద కమిషన్ చర్చలకు భారత్ హాజరుకాలేదు. కానీ ఆ తరువాత వివాద పరిష్కారానికి చర్చలకు వెళ్ళాలని నిర్ణయించారు. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో గత మార్చిలో రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ ప్రపంచ బ్యాంకును కోరింది. తటస్థ నిపుణుడిని నియమించమని భారత్ కోరింది. అయితే రెండు దేశాలు భిన్న వాదనలు చేయడంతో ప్రపంచబ్యాంకు విడిగా ఇరుపక్షాలతో చర్చలు జరిపింది. ఈ క్రమంలోనే గత సోమ, మంగళవారాలు వాషింగ్టన్‌లో చర్చలు జరిగాయి. భారత్ జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించుకోవడానికి అనుమతి సాధించింది.

భారత్, పాకిస్థాన్ మధ్య ఎంత ఉద్రిక్తత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సింధు జల ఒప్పందం నిలబడటం గొప్ప విషయమే. అయితే ఈ ఒప్పందం భవిష్యత్తులో నిలబడటం కష్టమని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో అభిప్రాయపడ్డది. వానలు సరిగా పడని కాలంలో నీటి లభ్యత దాదాపు సగానికి తగ్గుతున్నది. దీంతో నీటి పంపకం కష్టమవుతుందనేది ఒక అభిప్రాయం. నీటి వివాదాలను పరిష్కరించడంలో ఈ ఒప్పందం విఫలమైందని పాకిస్థాన్ ఇప్పటికే ఆరోపిస్తున్నది. భారత్ పాకిస్థాన్ సమగ్ర చర్చలలో సింధు జల వివాదాన్ని కూడా చేర్చాలని పాకిస్థాన్ కోరింది. కానీ ఒకసారి ఒప్పందం నుంచి బయట పడితే మరొకటి కుదుర్చుకోవడం అంత సులభం కాదని భారత్ భావిస్తున్నది.

భారత్, పాకిస్థాన్ మధ్య ఎంత ఉద్రిక్తత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సింధు జల ఒప్పందం నిలబడటం గొప్ప విషయమే. అయితే ఈ ఒప్పందం భవిష్యత్తులో నిలబడటం కష్టమని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో అభిప్రాయపడ్డది. వానలు సరిగా పడని కాలంలో నీటి లభ్యత దాదాపు సగానికి తగ్గుతున్నది. దీంతో నీటి పంపకం కష్టమవుతుందనేది హెచ్చరించింది. నీటి వివాదాలను పరిష్కరించడంలో ఈ ఒప్పందం విఫలమైందని పాకిస్థాన్ ఇప్పటికే ఆరోపిస్తున్నది. భారత్ పాకిస్థాన్ సమగ్ర చర్చలలో సింధు జల వివాదాన్ని కూడా చేర్చాలని పాకిస్థాన్ కోరింది. కానీ ఒకసారి ఒప్పందం నుంచి బయట పడితే మరొకటి కుదుర్చుకోవడం అంత సులభం కాదని భారత్ భావిస్తున్నది. భారత్ ఏ నీటి నిలువ వ్యవస్థలు నిర్మించుకున్నా అవి ఒప్పందానికి వ్యతిరేకమంటూ పాకిస్థాన్ అభ్యంతరాలు చెబుతూనే ఉంటుంది. ఒప్పందంలోని సంక్లిష్టతలు, సాంకేతికతల దృష్ట్యా పాకిస్థాన్ భిన్న వ్యాఖ్యానాలను ముందుకు తేవచ్చు. భారత ఉపఖండం యుద్ధాలతో తల్లడిల్లాలని కొన్ని విదేశీ శక్తులు కోరుకోవచ్చు. ఈ నేపథ్యంలో పెద్దదేశమైన భారత్ ఎంతో చాతుర్యంతో, సహనంతో వ్యవహరించవలసి వస్తున్నది. ఒప్పందాన్ని కాపాడుకుంటూనే, ఒప్పందం పరిధిలో వీలైనంత ఎక్కువ జలాలను వినియోగించుకోవడానికి ప్రయత్నించాలె. చర్చల ద్వారానే వివాద పరిష్కారానికి ప్రయత్నించాలె.

జనగళం

జనరల్ బోగీలను పెంచాలి

పండుగల సమయంతో దక్షిణమధ్య రైల్వే వారు వివిధ రైళ్లలో జనరల్ కంపార్ట్‌మెంట్లను పెంచాలి. సాధారణ, పేద ప్రయాణికులు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణం చేసే పరిస్థితి ఉండదు. కాబట్టి జనరల్ కంపార్ట్‌మెంట్ల సంఖ్య ఎక్కువగా ఉండాలి. పండుగల సమయాల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు రైళ్లలో ప్రయాణించాలంటే అనేక అవస్తలు పడుతున్నారు. కాబట్టి రైల్వే అధికారులు ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని పండుగల సమయాల్లో జనరల్ బోగీల సంఖ్య పెంచాలి. ప్రయాణికుల అవస్తలు తీర్చాలి.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీకి విశ్వాసరాహిత్యం వెంటాడుతున్నది. అనుభవంలేని రాహుల్ గాంధీ నాయకత్వం, పైనుంచి కింది దాకా అవినీతి కుంభకోణాల్లో మునిగిన నేతల తీరుతో కాంగ్రెస్‌పై ప్రజలకు విశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. ఈ నేపథ్యంలోనే కర్నాటకలో ఓ కాంగ్రెస్ నేత ఇంట్లో ఏడు కోట్ల రూపాయలు దొరికిన ఉదంతం వారి అవినీతికి అద్దం పడుతున్నది. కాంగ్రెస్ నేతల తీరు ఇలా ఉంటే.. వారే, పార్లమెంటులో సభానిర్వహణ జరుగకుండా అడ్డుకుంటూ ప్రజా వ్యతిరేకులుగా చాటుకుంటున్నారు. ఇది తీవ్రంగా ఖండించ దగినది. ఇక గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల కిడ్నాప్ గురించి చెప్పుకోవాలి. అక్కడ వరదలొచ్చి ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా కర్ణాటకలో ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో సేదతీరుతున్నారు. ఇదంతా ఎందుకంటే.., వారిని బీజేపీ వారు కొనుగోలు చేస్తారట! తమ ఎమ్మెల్యేలపైనే విశ్వాసం లేని కాంగ్రెస్ అధినాయకత్వం ప్రజల విశ్వాసాన్ని ఎలా చూరగొంటుంది? ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా తిరస్కరించాలి.

-డాక్టర్ ఆర్.వి.రెడ్డి, సికింద్రాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

గంగాతీర రాజకీయశాస్త్రం

బీహార్, యూపీలలో శూద్రకులాలు 'తమవి' అనుకునే పార్టీలను అధికారంలోకి తేవడం 1967 నుంచి మొదలైంది. తర్వాత 50 ఏండ్లలో అత్యధిక కాలం పాలించింది ఈ పార్టీలే. అయినా శూద్ర జనుల ఓట్లతో వారి నాయకులు లాభపడటం తప్ప, ఆ ప్రజలు బాగుపడే ప్రత్యామ్నాయ పరిపాలనా నమూనాలను అమలుపరుచలేదు. కనుకనే విఫలమై తరచు తమ ప్రత్యర్థులకు అవకాశమిస్తున్నాయి. బీహార్ ప్రస్తుత పరిణామాలను ఈ సుదీర్ఘ వైఫల్యాల నేపథ్యంలో చూడాలి.

భారతదేశంలో రాజకీయాధికారం ప్రజాస్వామిక పద్ధతులలో బడుగువర్గాలకు లభించటం, ఆ వర్గాల ఆర్థిక-రాజకీయ-సామాజికాభివృద్ధి అనే అంశాలను రాజకీయ శాస్త్రవేత్తలు దక్షిణభారతదేశం- ఉత్తర భారతదేశం అనే తారతమ్య దృష్టితో పరిశీలిస్తుంటారు. దక్షిణాదిన ఈ మార్పులు వివిధ పరిస్థితులలో బ్రిటిష్ పరిపాలనా కాలంలోనే మొదలుకాగా, ఉత్తరదేశంలో స్వాతంత్ర్యానంతరం అందుకు ఆరంభం జరిగింది. ఆ విధంగా స్వాతంత్ర్యం 1947లో రాగా యూపీలో కాంగ్రెస్‌కు బదులు భారతీయ క్రాంతిదళ్ (బీకేడీ) ప్రభుత్వం చరణ్‌సింగ్ నాయకత్వాన 1967లో ఏర్పడింది. అదే సంవత్సరం బీహార్‌లో కాంగ్రెస్‌ను పడదోసి జన క్రాంతిదళ్ (జేకేడీ) ప్రభుత్వం మహామాయాప్రసాద్ సిన్హా ఆధ్వర్యాన అధికారానికి వచ్చింది. యూపీలో కాంగ్రెస్ 1989 తర్వాత ఈ 28 సంవత్సరాలలో తిరిగి మెజారిటీ తెచ్చుకోలేకపోయింది. బీహార్‌లో 1990 నుంచి 27 ఏండ్లలో ఇదే పరిస్థితి ఉన్నది. మరొకవైపు చూస్తే కాంగ్రెస్ పతనం దరిమిలా ప్రత్యామ్నాయ జాతీయపార్టీగా ముందుకొచ్చిన బీజేపీ నుంచి యూపీలో ఈమధ్య కాలంలో ఆదిత్యానాథ్‌ను కలుపుకొని ఆరుసార్లు ముఖ్యమంత్రులు కాగలిగారు. అందుకు భిన్నంగా శూద్రకులాల పార్టీల వారు పన్నెండుసార్లు ముఖ్యమంత్రులయ్యారు. బీహార్ పరిస్థితి చూస్తే బీజేపీ ముఖ్యమంత్రి ఎవ్వరూ లేరు. అందరూ శూద్రకులాలకు చెందిన వివిధ పార్టీల వారే.

ఇన్ని లెక్కలలోకి వెళ్లడం ఎందుకంటే, గంగాతీర ప్రాంతంలోని బడుగు వర్గాల ప్రజలు గత యాభై సంవత్సరాలుగా తమకు ఇంత ఘనమైన రీతిన రాజకీయాధికారాన్ని అప్పగించగా, వారి నాయకులు సాధించిన ఘనత ఏమిటో మనకు తెలియవలసి ఉన్నది. ఆ వర్గాల ప్రజల ఆర్థిక-రాజకీయ-సామాజికాభివృద్ధి కోసం వారి ఆకాంక్షలకు, అవసరాలకు తగినట్లు నాయకత్వాలు పరిపాలించి ఉంటే, ఈ యాభై ఏండ్ల సుదీర్ఘ కాలం తర్వాత రాజకీయశాస్త్రవేత్తలు ఇప్పటికీ ఉత్తరదేశం-దక్షిణ దేశం అంటూ తులనాత్మక పరిశీలనలు చేయవలసిన అవసరం ఉండేది కాదు. అంతేకాదు, బడుగులకు స్వాతంత్ర్యానంతరం 70 సంవత్సరాల కాలంలో చేసింది స్వల్పమనే నిందను ఎదుర్కొన్న కాంగ్రెస్ యూపీ, బీహార్ రెండింటిలోనూ 27 ఏళ్ల నుంచి అధికారానికి దూరమైపోగా, స్వభావరీత్యా కాంగ్రెస్ కన్నా హీనమని భావించే బీజేపీ కాంగ్రెస్ కన్నా భిన్నమైన వ్యూహాలతోనైనా సరే యూపీలో అప్పుడప్పుడు అధికారానికి రావటం, బీహార్‌లో మధ్యమధ్య కీలకపాత్ర వహిస్తూ భవిష్యత్తుపై ఆశలుపెట్టుకోవడం వంటివి జరిగేవి కావు.

కనుక వైఫల్యాలు ఎవరివి? యూపీలో చరణ్‌సింగ్, ములాయంసింగ్, మాయావతి, అఖిలేశ్ యాదవ్ తదితరులు, బీహార్‌లో కర్పూరీ ఠాకూర్, లాలూ ప్రసాద్, నితీశ్‌కుమార్ మొదలైన వారిలో, బడుగువర్గాలకు అవసరమైన ఆర్థిక-సామాజిక-రాజకీయ అభివృద్ధి నమూనాలను కాంగ్రెస్, బీజేపీలకు భిన్నమైన విధంగా రూపొందించి, అమలుపరుచటంలో గత ఐదు దశాబ్దాలలో ఎవరి సాఫల్య వైఫల్యాలేమిటి? వీరి మధ్య వ్యక్తిగతంగా కొద్ది తేడాలు ఉండవచ్చు గాక. కానీ ఉమ్మడిగా ఒక సామాజికశక్తిగా వీరంతా కట్టుగట్టుకుని విఫలమయ్యారు. అరమరికలు లేకుండా చెప్పాలంటే నాయకులుగా తాము ఉమ్మడిగా లాభపడి, తమను నమ్మిన ప్రజలను ఉమ్మడిగా విఫలం చేశారు.

సుప్రసిద్ధ ఫ్రెంచి రాజకీయ శాస్త్రజ్ఞుడు క్రిస్టాఫ్ జెఫర్లాట్, 'ఇండియాస్ సైలెంట్ రివల్యూషన్' అనే పుస్తకం రాశాడు. ఉత్తరభారత దేశపు బడుగు కులాల గురించి 14 సంవత్సరాల కిందట చేసిన ఆ పరిశోధన ఇక్కడ చాలా ప్రభావం చూపింది. ఈ వర్గాలకు రాజకీయాధికారం లభించాలని కోరుకునే వారతై దానినొక గొప్ప గ్రంథంగా నేటికీ పరిగణిస్తున్నారు. ఒక పార్శ్వం నుంచి చూసినప్పుడు అది అటువంటి అధ్యయనమే అనటంలో సందేహం లేదు. అందులోని అంశాల తరహాలో రజనీ కొఠారి తదితర భారతీయ మేధావులు కూడా పరిశోధనలు చేసినా ఇది మరింత వివరమైన అధ్యయనమనాలి. అంతవరకు బాగున్నది గాని, ఉపరితల స్థాయిలో ఓట్లు-నాయకుల అధికారాల పరివర్తనకు మించి, వారికి అధికారం అప్పగించిన ప్రజల జీవితాలలో క్షేత్రస్థాయి పరివర్తనలు ఏమిటన్న ప్రశ్నపై మనకు అదే విధమైన పరిశోధనలు కన్పించవు. వారు రూపొందించిన కొత్త నమూనాలు ఏమిటో తెలియవు. 2003 నాటికే రెండు రాష్ట్రాలను చరణ్‌సింగ్, ములాయం, మాయావతి, కర్పూరీ ఠాకూర్, లాలూ వంటి హేమాహేమీలు పాలించారు. తర్వాత మరికొందరు వచ్చారు. కానీ ప్రత్యామ్నాయాల కల్పన ఏ దశలోనూ జరుగలేదు. ఈ కాలాన్నంతా మదింపు చేసి చూసినప్పుడు ఆ రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి సూచికలు, మానవాభివృద్ధి సూచికలు కూడా జాతీయ సగటు కన్న, దక్షిణాది రాష్ట్రాల సగటు కన్నా ఎంతో తక్కువగా ఉన్నాయి. ఈ రెండు సగటులను బడుగులకు హాని చేసిన పార్టీలుగా భావించే కాంగ్రెస్, బీజేపీల కన్నా గణనీయంగా పెంచినప్పుడే బడుగుల పార్టీలకు అధికారం లభించిన దానికి సార్థకత ఉంటుంది. అది దక్షిణాదిన మొదటి నుంచి జరుగుతున్నదనేది పరిశోధనలో తెలుతున్న వాస్తవం. అందుకే పరిశోధకులు, విమర్శకులు కూడా ఉత్తరప్రదేశ్, బీహార్‌లను ఆ కోణం నుంచి పోల్చుతూ, బడుగుల పేరిట అధికారం సంపాదించుకున్న నాయకులు ఆ వర్గాల కోసం చేసిందేమిటని ప్రశ్నిస్తున్నారు.

గంగా నదీతీర రాజకీయశాస్త్రం ఇందులో ఉంది. మొదటి నుంచి ఫ్యూడల్ దోపిడీకి గురైన అక్కడి సామాన్యులకు కనీసం బ్రిటిష్ వలస పాలనా కాలంలో దక్షిణాది బడుగులకు లభించిన వివిధ సంస్కరణలైనా అందుబాటులోకి రాకుండాపోయాయి. పైగా వలస పాలకులకు కూడా అక్కడి ఫ్యూడల్ దోపిడీయే అనుకూలంగా ఉండినందున బడుగులు ఆ చట్రం నుంచి బయటపడలేకపోయారు. అటువంటి సమస్యల కారణంగా స్వాతంత్ర్యోద్యమంపై చాలా ఆశలు కల్పించుకుని ఉద్యమాలు, తిరుగుబాట్లు చాలానే చేశారు. కానీ స్వాతంత్ర్యానంతరం అందుకు తగినట్లు జరిగింది కాంగ్రెస్ హయాంలో స్వల్పం కావడంతో 1957లో రెండవ సార్వత్రిక ఎన్నికల నుంచే మొదలుకొని కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గ సాగాయి. అది గమనించిన నెహ్రూ, కాంగ్రెస్ త్వరగా మేల్కొనకపోతే పీడితవర్గాల చైతన్యం, వారికి లభించిన ఓటుహక్కు కలిసిమనకు పక్కకుతోసివేసి ముందుకు పోగలవని హెచ్చరించాడు. తర్వాత సరిగా పదేండ్లకు 1967 ఎన్నికలతో ఆరంభించి అది నిజమైంది. మరొక 22 ఏండ్ల తర్వాత నుంచి ఇక కాంగ్రెస్ సోదిలో లేకుండాపోయింది.

దీనంతటి నుంచి గ్రహించవలసింది ఏమంటే, ఇటువంటి స్వాతంత్ర్యోద్యమ కాలపు ఆశలు, తదనంతర కాలపు తీవ్రమైన నిరాశల నేపథ్యం నుంచి గంగానదీ పరీవాహక ప్రాంతపు సామాన్యులు సరికొత్త ఆశలతో తమవి అనుకున్న రాజకీయ వేదికలను అధికారంలోకి తెచ్చారు. ఇంకా తెస్తున్నారు. కానీ ఆ వేదికలు వారిని నిరాశపరుస్తున్నాయి. అవి తాము సృష్టించిన వేదికలు అనే ఆత్మగౌరవ భావాన్ని మినహాయిస్తే, అవి తమకోసమే పనిచేస్తున్నాయనే విశ్వాసం వారికి ఈ ఐదు దశాబ్దాలలో ఎంతగా కలిసి స్థిరపడవలసిందో, శత్రుదుర్భేద్యం కావలసిందో, అంతగా ఎంతమాత్రం జరుగటం లేదు. కాంగ్రెస్ పోయినప్పటికీ బీజేపీ ముందుకు రావటం అందువల్లనే. కాంగ్రెస్ సృష్టించిన శూన్యంలోకి తాము ప్రవేశించగా, కాంగ్రెస్‌తో పాటు తాము సృష్టించే శూన్యంలోకి బీజేపీ ప్రవేశించగలుగుతున్నది. ఈ క్రమంలో తమ ఓటర్లు బీజేపీ ఓటర్లుగా మారుతుండటం స్పష్టంగా కనిస్తున్న స్థితి. దాని అర్థం అది వారు కోరుకుంటూ వచ్చిన ప్రత్యామ్నాయమని కాదు. కాని భ్రమాత్మకంగానో, విధిలేని ఒత్తిడులకో, ఎత్తులకు విసుగెత్తో, నైతికతా లేమికి ఆగ్రహించో, అసమర్థ పాలనలకు నిరాశ చెందో ఈ వర్గాల ప్రజలు మరొకవైపు చూడటం నిర్వివాదమైన రీతిలో నాయకత్వాల వైఫల్యమే. ఈ వైఫల్యాలకు కేంద్రస్థానంలో కన్పించేది ప్రజలు కోరుకునే ప్రత్యామ్నాయ నమూనాలను రూపొందించి అమలుపరుచడంలోని కీలకమైన వైఫల్యం. అటువంటప్పుడు పరిణామాలు ఇప్పుడు మనం చూస్తున్న విధంగానే ఉంటాయి.

స్వాతంత్ర్యోద్యమ కాలపు ఆశలు, తదనంతర కాలపు తీవ్రమైన నిరాశల నేపథ్యం నుంచి గంగానదీ పరీవాహక ప్రాంతపు సామాన్యులు సరికొత్త ఆశలతో తమవి అనుకున్న రాజకీయ వేదికలను అధికారంలోకి తెచ్చారు. ఇంకా తెస్తున్నారు. కానీ ఆ వేదికలు వారిని నిరాశపరుస్తున్నాయి. అవి తాము సృష్టించిన వేదికలు అనే ఆత్మగౌరవ భావాన్ని మినహాయిస్తే, అవి తమకోసమే పనిచేస్తున్నాయనే విశ్వాసం వారికి ఈ ఐదు దశాబ్దాలలో ఎంత గా కలిసి స్థిరపడవలసిందో, శత్రుదుర్భేద్యం కావలసిందో, అంతగా ఎంతమాత్రం జరుగటం లేదు

విప్లవాత్మక వ్యవసాయ విధానం

వ్యవసాయం

ఎన్నమనేని వేణు

ఆరు గాలం శ్రమించి మానవాళికి పట్టెడన్నం పెట్టే అన్నదాత సంక్షేమానికి ఎంత చేసినా తక్కువే. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇవ్వనున్న ఎకరాకు నాలుగువేల రూపాయల పథకం ప్రయోజనాలు, రైతాంగంపై చూపే ప్రభావాలు గ్రామీణ సమాజంలో వెలుగులు నింపనున్నాయి.

ఏటా చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ అప్పుల ఊబిలో మునిగిపోయిన రైతులు ఈ సాయంతో ఒక్కసారిగా రుణ చట్రం నుంచి విముక్తులవుతారు. ఈ నగదు సాయంతో భూములను సాగుకు అనుకూలంగా చేసి, సారవంతం చేసే అవకాశమున్నది. 1956-57లో 3.6 హెక్టార్లుగా ఉన్న సగటు కమతం పరిమాణం 2010-11 నాటికి 1.12 హెక్టార్లుగా మారిన దురవస్థకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.

రాష్ట్రంలో కౌలుదారుల సంఖ్య ఎక్కువ. వారికి నూతన పథకం కింద ఎటువంటి సాయం వర్తించదు. భూమి ఉండి సాగుచేయని రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందితే పథక లక్ష్యం నెరవేరదు.తెలంగాణలో వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారిలో 33.6శాతం మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకంతో వ్యవసాయ కూలీలకు, కౌలుదారులకు సహాయం అందకపోయే పరిస్థితి ఉంటే బాధాకరం.

ఈ పథకాన్ని ఐదు ఎకరాలలోపు భూమి విస్తీర్ణం గల రైతులకే వర్తింపచేసి తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు రాబట్టవచ్చు. రాష్ట్రంలో ఐదెకరాలలోపు భూమి గల రైతులు 85.86శాతం మంది ఉన్నారు. నూతన పథకం కింద వారికి అయ్యే ఖర్చు 35,000 కోట్లు. దాదాపుగా పథకం మొత్తం ఖర్చులో సగం ఖర్చుతోనే 85.86శాతం మంది రైతులకు లబ్ధి చేకూర్చవచ్చు. మిగిలిన 14.14శాతం రైతులంతా పెద్ద, మధ్య తరహా రైతులే. వారిలో విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, పారిశ్రామికవేత్తలు, స్థిరాస్తి వ్యాపారులు, భవన నిర్మాణదారులు ఇలా ఆర్థికంగా నిలదొక్కుకున్న వారే ఉన్నారు. వారి కోసం నూతన పథకం కింద చేయదల్చిన ఖర్చు 27,000 కోట్లు. వారికి ఎకరాకి 4000 రూపాయలు సహాయంతో పనిలేదు. వారిలో నిజమైన సాగుదారులు ఉంటే వారికి నగదు సహాయంగా కాకుండా వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీ, రైతుమిత్ర బృందాల ఏర్పాటు, కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల ఏర్పాటు ప్రత్యేక భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటు వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం వంటి ఎన్నో కార్యక్రమాలు ఈ నిధులతో చేపట్టవచ్చు. కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల రూపంలో సన్నకారు, చిన్న రైతులకు కూడా వ్యసాయ యంత్రాలు అందుబాటులో వుంటాయి. తద్వారా మొత్తం సాగు విస్తీర్ణం వ్యవసాయ యాంత్రీకరణ జరిగే అవకాశం ఉంటుంది.

2011 గణాంకాల ప్రకారం 55.49శాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడగా దీనిలో 21.9శాతం జనాభా వ్యవసాయదారులు. మిగిలిన 33.6శాతం వ్యవసాయ కార్మికులే. కాలుదారుల సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నది. మధ్య తరహా, పెద్ద రైతుల భూములన్నీ సాగు చేస్తున్నది వీరే. కౌలుదారుల సంక్షేమం కోసం 'గ్రామరైతు సంఘాలతో' పాటు 'గ్రామ కౌలు రైతు సంఘాలని' ఏర్పాటు చేయాలి.ఈ గ్రామ కౌలు రైతు సంఘంలో భూమి లేకుండా ఇతరుల భూమిని సాగు చేసే వారందర్నీ సభ్యులుగా చేర్చాలి. రెండున్నర ఎకరాలలోపు భూమి గల రైతులకు కూడా కౌలు రైతు సంఘంలో సభ్యత్వం కల్పించాలి. గ్రామ కౌలు రైతు సంఘం పంపించే జాబితా ఆధారంగా ప్రభుత్వం తహసీల్దార్ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులను జారీ చేయాలి. గ్రామ రైతు సంఘాలు గ్రామ కౌలు రైతు సంఘాల సహాయంతో రైతుల్లో అసలు సాగుదారులు ఎవరు, కౌలుదారులు ఎందరనే విషయాన్ని నిగ్గు తేల్చి రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించాలి. దీనికోసం రికార్డుల్లో ఇప్పటికే ఒక ప్రత్యేక 'కాలమ్' ఉంది. కౌలు ఒప్పంద పత్రాలను గ్రామ రైతు సంఘం, గ్రామ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మాత్రమే కుదుర్చుకోవాలనే నిబంధన తీసుకురావాలి. ఇట్టి కౌలు ఒప్పందానికి కనీస కాల పరిమితి మూడేండ్లుగా నిర్ణయించాలి. పంట పండి, కౌలు చెల్లిస్తున్నంత వరకు యజమాని కౌలుదారున్ని బేదఖలు (వెళ్లగొట్టడం) చేయటానికి వీలు లేకుండా చేయాలి. మూడేండ్ల తర్వాత వేరే కౌలుదారుడికి కౌలుకి ఇవ్వవచ్చు లేదా తానే సాగుచేసుకోవచ్చు. ఫలితంగా కౌలుదారునికి రక్షణ కల్పించబడుతుంది.

అంతేకాకుండా కౌలు రైతు సంఘంలో సభ్యత్వం, కౌలు ఒప్పంద పత్రం ఆధారంగా కౌలు రైతుకు రుణ అర్హత కార్డులను జారీ చేయాలి. ఈ రుణ అర్హత కార్డులతో కౌలు రైతులు వ్యవసాయ రుణాలను పొందవచ్చు. రుణాలు పొందే క్రమంలో తమ ఇతర స్థిరాస్తులేవైనా ఉంటే బ్యాంకు అధికారుల వద్ద జతపరుచాలి. వ్యవసాయ రుణం చెల్లించటంలో గానీ, వడ్డీలు చెల్లించ టంలో గానీ విఫలమైతే కౌలురైతుగా గుర్తింపు రద్దు చేయాలి. గ్రామ రైతు సంఘాలకు, కౌలురైతు సంఘాలకు దీనిపై పర్యవేక్షణాధికారం కల్పించాలి.

ప్రస్తుతం ధాన్యం కొనుగోలు అంతా ఐకేపీ కేంద్రాల ద్వారానే జరుగుతున్నది. ప్రైవేటు వ్యక్తులు కొనకుండా కట్టుదిట్టం చేసి ఐకేపీ కేంద్రాలు ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత బ్యాంకులో నగదు జమచేసినప్పుడు కౌలుదారుడి సంబంధిత రుణాన్ని బ్యాంకు అధికారులే తీసుకోవచ్చు. దీనికోసం కౌలుదారుడి దగ్గర నుంచి ముందే అనుమతి పత్రం తీసుకోవాలి. ఫలితంగా కౌలుదారుడికి అందని ద్రాక్షగా ఉన్న వ్యవస్థాగత రుణ సదుపాయాల్ని సులభతరం చేయవచ్చు.

అంతేకాకుండా కనీసం మూడేండ్లు కౌలు ఒప్పంద నియమంతో కౌలుదారుడికి రక్షణ కల్పించాలి. రాష్ట్రంలో వ్యవసాయ రంగం మీద ఆధారపడ్డ 55.49 శాతం జనాభాలో 33.6 శాతం వ్యవసాయకూలీలే. మధ్యతరహా, పెద్ద కమతాలలో ప్రవేశపెట్టదల్చిన వ్యవసాయ యాంత్రీకీకరణ కార్యక్రమంలో ఈ వ్యవసాయ కూలీలను భాగస్వామ్యం చేయాలి. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు చేసి వ్యవసాయ యంత్రాలను వినియోగించటంలో శిక్షణ ఇవ్వాలి. తద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు, రైతు మిత్ర బృందాల ఆధ్వర్యంలో నడిచే యంత్రాల నిర్వాహకులుగా వీరికి ఉపాధి కల్పించవచ్చు.

వ్యవసాయరంగంలో ప్రధాన భూమిక పోషించే వర్గాలైన వ్యవసాయదారులు, కౌలుదారులు, వ్యవసాయ కూలీల సంక్షేమమే వ్యవసాయ రంగ అభివృద్ధికి కొలబద్ద. కౌలుదారులను, వ్యవసాయ కూలీలను మినహాయిస్తే ఈ క్రతువు పూర్తికాదు. కాబట్టి ఐదు ఎకరాలలోపు భూమి గల చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు నాలుగు వేల నగదు సాయం చేస్తూ, కౌలుదారులకు కనీస రక్షణ కల్పించాలి. పెద్ద కమతాల్లో వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టాలి. తద్వారా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించినప్పుడే వ్యవసాయం దండుగ అనే స్థితి నుంచి పండుగ అవుతుంది.

ఐదు ఎకరాల లోపు భూమి గల చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు నాలుగు వేల నగదు సాయం చేస్తూ, కౌలుదారులకు కనీస రక్షణ కల్పించాలి. పెద్ద కమతాలలో వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టాలి. తద్వారా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించినప్పుడే వ్యవసాయం దండుగ అనే స్థితి నుంచి పండుగ అవుతుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కొత్త జిల్లాల్లోనూ శిశు సంరక్షణ కేంద్రాలు

- సీఎం చెంతకు ఫైలు: మంత్రి తుమ్మల
- మంత్రిని కలిసిన కారా చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కొత్త జిల్లాల్లోనూ శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. సంబంధిత ఫైలు ఇప్పటికే సీఎం ఆమోదం కోసం వెళ్లిందని, త్వరలోనే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం మంత్రిని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ (కారా) చైర్మన్ రాంచందర్‌రెడ్డి కలిశారు. పలు అంశాలను మంత్రికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ దరఖాస్తు విధానంలో పిల్లల దత్తత విషయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. నవజాత శిశువుల దత్తత విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులును పరిష్కరిస్తామని చెప్పారు. దత్తతకు సంబంధించి ప్రైవేటు శిశు సంరక్షణ కేంద్రాలు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నాయని, దీని పరిష్కారానికి ఆన్‌లైన్ విధానం అనుసరించాలని మంత్రిని కారా చైర్మన్ కోరారు. శిశువుల దత్తత కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఇరవై వేలవరకు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన మంత్రికి తెలిపారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ తరహాలోనే స్టేట్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సారా)ని ఏర్పాటు చేస్తామని తుమ్మల తెలిపారు. ఇందులో పనిచేసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను నియమించి, చిన్న పిల్లల దత్తత విషయంలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చూస్తామన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో సమావేశమైన సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి

నకిలీ ఎడ్‌సెట్ ర్యాంకు కార్డులతో జాగ్రత్త

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్-2017 పరీక్షకు సంబంధించిన కొన్ని సంస్థలు నకిలీ ర్యాంకులను జారీ చేస్తున్నాయని, అవి చెల్లబోవని ఎడ్‌సెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. అసలైన ర్యాంకు కార్డులను త్వరలోనే జారీచేస్తామని, వీటిని www.edcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో సీట్ల కేటాయింపు

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు రెండో విడుత సీట్ల కేటాయింపు జాబితాను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.pjtsau.ac.in లో పొందుపర్చినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. సీట్లు పొందినవారు ఈ నెల 5లోపు ఆయా పాలిటెక్నిక్ కళాశాలల్లో రిపోర్టు చేయాలని, లేకపోతే వారి సీట్లు రద్దవుతాయని పేర్కొన్నారు.



సీఎంకు స్పీకర్ ఆహ్వానం

రాష్ట్ర శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి బుధవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈనెల 11న జరిగే తన కుమారుడు క్రాంతికుమార్ వివాహానికి ఆహ్వానిస్తూ తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం కేసీఆర్‌కు పత్రికను అందజేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో ఉదయం 11:45 గంటలకు స్పీకర్ మధుసూదనాచారి తనయుడు క్రాంతికుమార్‌కు నవ్యతో వివాహం జరుగనుంది. మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఏపీ శాసనమండలి చైర్మన్ చక్రపాణి, మాజీ సీఎం కే రోశయ్య తదితరుల వద్దకు కూడా స్పీకర్ స్వయంగా వెళ్లి పెండ్లి పత్రికలు అందజేశారు.

- జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



జూలో అరుదైన పాము

హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ సమీపంలోని మసీదులో గత నెల 28న ఓ పాము కనిపించగా ఏనిమల్ కీపర్ ప్రభాకర్ దాన్ని పట్టుకున్నారు. అది కేవలం 46 సెంటిమీటర్ల పొడవు ఉన్నదని, రాష్ట్రంలో అరుదుగా కనిపించే పాముగా గుర్తించినట్టు జూపార్క్ క్యూరేటర్ శివానీడొంగ్రే తెలిపారు. ఎల్లో కాలర్డ్ ఉల్ఫ్ జాతికి చెందిన ఈ పాములు దక్షిణాదిలో అధికంగా కనిపిస్తాయని, విషపూరితం కావని ఆమె చెప్పారు. ప్రస్తుతం జూ పార్క్‌లోని పాముల ఎన్‌క్లోజర్‌లో ఈ పామును వదిలిపెట్టినట్టు తెలిపారు.

- చార్మినార్

గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 12.5 కోట్లు

హైదరాబాద్: గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ స్కీం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.5 కోట్లు మంజూరుచేసింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలను జారీచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని నిధుల నుంచి వీటిని మంజూరుచేశారు. గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ నిధులను వినియోగించాలని కలెక్టర్‌కు సూచించారు. పనులను పూర్తిచేశాక ప్రభుత్వానికి యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను అందజేయాల్సి ఉంటుంది.

సుగంధ ద్రవ్యాల యూనిట్‌కు సీఎఫ్టీఆర్‌ఐ సహకారం

హైదరాబాద్: ఆహార పదార్థాల కల్తీల నివారణ కోసం రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ యూనిట్ నెలకొల్పేందుకు కుత్బుల్లాపూర్ మండలం, దూలపల్లి గ్రామంలోని పట్టుపరిశ్రమ విత్తనఫాంలో 15.56 ఎకరాలు కేటాయించింది. దీనికి సాంకేతిక సహకారం అందించే అంశంపై సీఎఫ్టీఆర్‌ఐ (కేంద్రీయ ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ) డైరెక్టర్ డాక్టర్ రామ్‌రాజశేఖర్‌రెడ్డితో వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి బుధవారం భేటీ అయ్యారు. సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్ డీపీఆర్‌ను నెలరోజుల్లో ఇవ్వాలని పార్థసారథి ఈ సందర్భంగా కోరారు. ఇందుకు సీఎఫ్టీఆర్‌ఐ డైరెక్టర్ అంగీకరించారు.

ఎంపీ కవిత ప్రయత్నానికి ప్రశంస

'గిఫ్ట్ ఏ హెల్మెట్'లో భాగస్వాములవుదామని ఒడిశా సీఎం పిలుపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రహదారి భద్రత విషయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చేపట్టిన ప్రచారానికి జాతీయస్థాయిలో విశేష స్పందన లభిస్తున్నది. రాఖీపండుగ సందర్భంగా రాఖీ కట్టడంతోపాటు సోదరులకు హెల్మెట్ బహుమతిగా ఇవ్వాలని 'గిఫ్ట్ ఏ హెల్మెట్' అనే ప్రచారానికి ఎంపీ కవిత శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలువురు ఎంపీలు ఈ ప్రచారానికి మద్దతు తెలపగా, తాజాగా ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైతం దీనిపై స్పందించారు. ఎంపీ కవిత ప్రయత్నాన్ని ప్రశంసించారు. 'రహదారి భద్రత విషయంలో ఎంపీ కవిత చేసిన ప్రచారం చాలా ఉన్నతమైనది. ఈ గొప్ప ప్రచారంలో అందరూ భాగస్వాములై సమాజంలో అవగాహన కల్పించాలని కోరుతున్నా' అని ట్వీట్ చేశారు. స్పందించిన ఎంపీ కవిత ధన్యవాదాలు చెప్తూ రీట్వీట్ చేశారు. 'మీ ఆశీర్వాదాలు, మద్దతు చాలా సంతోషకరం సర్. ఒడిశాకు చెందిన అనేకమంది అక్కాచెల్లెళ్లు ఈ ఉన్నత కార్యక్రమంలో పాలుపంచుకుంటారని భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

పేద దళితులకు ఉచిత విద్యుత్

50 యూనిట్లలోపు వినియోగానికి బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం

మూడున్నరేండ్లలో 201 కోట్లు చెల్లింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దళితుల సంక్షేమంపట్ల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే దళితుల్లోని పేద కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తూనే అత్యంత పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నది. 50 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే దళిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంలో విద్యుత్ చార్జీలను చెల్లిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి హైదరాబాద్ మినహా పాత జిల్లాలైన మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ పరిధిలో రూ.201.53 కోట్లు ఇందుకోసం ఖర్చుచేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం మిగిల్చిన బకాయి మొత్తంతో కలిపి 2014-15 ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.154.64కోట్ల విద్యుత్ బిల్లులను చెల్లించింది. కాగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో గతనెల చివరి వరకు రూ.7కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి చెల్లించేందుకు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు కృషిచేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద మూడున్నరేండ్లుగా 2.80 లక్షల దళిత కుటుంబాలలకు లబ్ధి చేకూరుతున్నది. అవసరాలు, విద్యుత్ వినియోగం పెరుగుతున్న కారణంగా 50 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే కుటుంబాల సంఖ్య గత రెండేండ్లుగా తగ్గుతున్నది. ఎస్సీ కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందించే ఉద్దేశంతోనే విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నామని ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారులు పేర్కొన్నారు.

మూడున్నరేండ్లలో చెల్లించిన విద్యుత్ బిల్లుల వివరాలు

ఏడాది	లబ్ధిదారుల సంఖ్య	చెల్లించిన మొత్తం రూ.కోట్లల్లో
2014-15	2,56,274	154.64
2015-16	2,78,566	28.44
2016-17	1,54,756	10.95
2017-18	1,50,000	7.50
మొత్తం	8,39,596	201.53

రెడ్ హ్యాట్‌తో టాస్క్ ఒప్పందం

- ఓపెన్‌సోర్స్ ఆపరేటింగ్ సిస్టంపై విద్యార్థులకు శిక్షణ
- రెండేండ్లలో 1500 మందికి అవకాశం



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న రెడ్ హ్యాట్, టాస్క్ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులకు ఓపెన్‌సోర్స్ ఆపరేటింగ్ సిస్టంలో నూతన నైపుణ్యాలు నేర్పించడంలో అంతర్జాతీయంగా టాప్‌లో ఉన్న రెడ్ హ్యాట్ సంస్థతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఒప్పందం కుదుర్చుకున్నది. రాష్ట్రంలోని 1500 విద్యార్థులకు ఈ మేరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఒప్పందం పత్రాలను టాస్క్ కార్యాలయంలో సంస్థ సీఈవో సుజీవ్ నాయర్, రెడ్ హ్యాట్ ఇండియా అండ్ సార్క్ దేశాల మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ రెగే బుధవారం మార్చుకున్నారు. ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లోని విద్యార్థులు, ఫ్యాకల్టీకి శిక్షణ అందించనున్నారు. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, మొబైల్ టెక్నాలజీ రంగంలో ఓపెన్ సోర్స్ ఆపరేటింగ్ సిస్టంను ప్రధానంగా వాడుతారు. రాజేశ్ రెగే మాట్లాడుతూ ఓపెన్‌సోర్స్ రంగంలో ఉన్న విశేష అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ వంటి నూతన రాష్ట్రం తరపున టాస్క్ ముందుకురావడం ప్రశంసనీయమన్నారు. సుజీవ్ నాయర్ మాట్లాడుతూ ఐటీ రంగంలోని నూతన అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్ర విద్యార్థులను తీర్చిదిద్దేందుకు టాస్క్ ముందుకు సాగుతున్నదని, ఈ క్రమంలోనే రెడ్ హ్యాట్ అకాడమీతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. రాబోయే రెండేండ్లలో 1500 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

విజయవాడ పర్మిట్లపై నివేదిక

28 రోజుల విచారణ తర్వాత రిపోర్టు ఇచ్చిన డీటీసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అక్రమ రిజిస్ట్రేషన్ల తీరుపై నివేదిక సిద్ధమయింది. 'తీరుమారని రవాణాశాఖ' శీర్షికన గత జూన్ 26న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం ఆధారంగా విచారణ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం.. విచారణ అధికారి డీటీసీ ప్రవీణ్‌రావు నియమించింది. అక్రమ రిజిస్ట్రేషన్లపై 28 రోజులపాటు విచారణ జరిపిన ప్రవీణ్‌రావు.. బుధవారం విజిలెన్స్ జేటీసీ రమేశ్‌కు నివేదికను అందజేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాల్లో విచారించి రిపోర్ట్ తయారుచేశారు. రిజిస్ట్రేషన్లకు బాధ్యులైన అధికారులు, కార్యాలయాలు, పర్మిట్లు ఇచ్చిన వాహనాల సంఖ్యను పేర్కొంటూ నివేదికను రూపొందించినట్టు ప్రవీణ్‌రావు చెప్పారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు ముఖ్యమంత్రి కార్యాలయమే నేరుగా ఆదేశాలివ్వడంతో రంగంలోకి దిగి విజయవాడతోపాటు అన్ని కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యాలయాలకు రాకుండా పర్మిట్లు ఇచ్చినవారిని విచారించారు. నివేదిక అందిందని, ప్రభుత్వానికి పంపిస్తున్నట్టు విజిలెన్స్ జేటీసీ తెలిపారు. పోలీసు ఇంటెలిజెన్స్ ఇప్పటికే ప్రభుత్వానికి తమ నివేదికను అందజేసినట్టు తెలిసింది.

బోగస్ ఐటీ నోటీసుల కలకలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయం పన్నుశాఖ అధికారులం అని కొందరు నోటీసులు జారీచేస్తూ బేరాలకు దిగుతున్నట్లు తెలుస్తున్నది. ఆ నోటీసులను పరిశీలించిన ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఐటీశాఖకు సంబంధంలేని వ్యక్తులు నోటీసులను పంపి అందులో తమ ఫోన్‌నంబర్లను ఇస్తున్నట్లు ఫిర్యాదు అందినట్లు అధికారులు చెప్తున్నారు. దీంతో ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రకటన జారీచేశారు. నోటీసులలో ప్రైవేట్ వ్యక్తులు ఆదాయం పన్ను చట్టం, బినామీ నిషేధచట్టం నిబంధనలను కూడా పేర్కొంటున్నారని అధికారులు తెలిపారు. ఈ నోటీసులకు స్పందించేముందు వాటి వివరాలను 040-23425200, 8985970011 నంబర్లకు ఫోన్ చేసి తమ ప్రజాసంబంధాల అధికారి బీవీ వినోద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇదీ కాంగ్రెస్ శవరాజకీయం!

పోత్గల్ సంఘటనతో కుట్రలు బహిర్గతం ● కాంగ్రెస్ నాయకుడి ఇసుక లారీ ఢీకొని దళితుడి మృతి

ప్రభుత్వంపై నెట్టేందుకు హస్తం నేతల విఫలయత్నం

లారీ తమ వాడిదని తెలుసుకొని తప్పుకొనే ప్రయత్నం ● కేసు విషయంలో పోలీసులతో మంతనాలు

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

సిరిసిల్ల కేంద్రంగా ఇసుక మాఫియా చెలరేగుతున్నదని, దీని వెనుక ప్రభుత్వ పెద్దలున్నారని, లారీలన్నీ టీఆర్‌ఎస్ నాయకులకు సంబంధించినవి అంటూ కాంగ్రెస్ నేతలు ఇన్నాళ్లు ఊదరగొడుతూ వచ్చారు. ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. కానీ బుధవారం ముస్తాబాద్ మండలం గన్నెవారి పల్లె వద్ద ఇసుక లారీ ఢీకొనడంతో ఓ దళితుడు మృతి చెందాడు. ఈ ఘటనతో కాంగ్రెస్ నాయకుల అసలు బండారం బయటపడింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు నిరసనలు తెలుపడంతోపాటు ఇసుక మాఫియా లారీకి మరొకరు బలి అంటూ పత్రికలకు ప్రకటనలు జారీచేశారు. అంతా అయ్యాక ఢీకొట్టిన లారీ కాంగ్రెస్ నాయకుడిదని తెలుసుకొని.. ఒక్కొక్కరుగా జారుకునే ప్రయత్నం చేశారు. లారీ తమదేనంటూ కాంగ్రెస్ నేతలు పోలీసులతో మంతనాలు జరిపారు.

దళితుడిని బలిగొన్న కాంగ్రెస్ నేత లారీ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో వద్ద బుధవారం ఇసుక లారీ ఢీకొనడంతో గన్నె శంకరయ్య(60) అనే దళితుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లారీ (ఏపీ 31ఎక్స్ 0097) సిరిసిల్ల పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ సమద్‌కు చెందినదిగా గుర్తించారు. ఇసుకను కొద్దిరోజులుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు.



రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇసుక లారీ..

మృతిచెందిన శంకరయ్య

శవరాజకీయం చేసే ప్రయత్నం..

పోత్గల్‌లో ఇసుక లారీ ఢీకొని శంకరయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి అత్యుత్సాహంతో నిమ్స్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఇసుక లారీ ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. అదే సమయంలో ఆ లారీ కాంగ్రెస్ పార్టీ నాయకుడిదని తెలుసుకున్నాక అక్కడి నుంచి జారుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముందుగా నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఇసుక మాఫియాకు మరొకరు బలి: పొన్నం ప్రభాకర్

ఇసుక లారీకి మరొకరు బలియ్యారంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బుధవారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక లారీల కింద పడి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బంద్‌కు పిలుపునివ్వాలంటూ..

ఇదిలావుండగా గురువారం ముస్తాబాద్ బంద్‌కు పిలుపునివ్వాలంటూ కాంగ్రెస్ నేతలు కొందరు ముస్తాబాద్ కాంగ్రెస్ నాయకులకు మెసేజ్‌లు పంపడం వారి శవ రాజకీయాలకు నిదర్శనం. లారీ తమ పార్టీ నాయకులదేనంటూ కొంతమంది ప్రధాన నాయకులకు చెప్పడంతో.. దిక్కుతోచక తోక ముడిచారు. తమ పార్టీ నాయకుడైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరేందుకు కొంతమంది సిద్ధమవుతున్నట్టుగా సమాచారం. ఇదిలావుండగా లారీ తమ పార్టీకి చెందినవారిదేనంటూ ముస్తాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రాములు స్థానిక పోలీసులతో మంతనాలు జరిపారు.



సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్

ఆ లారీ కాంగ్రెస్ నేతదే: డీఎస్పీ

సిరిసిల్ల క్రైం: ముస్తాబాద్ మండల పోత్గల్‌లో బుధవారం ఇసుక లారీ ఢీకొనడంతో గన్నె శంకరయ్య(60) మరణించాడని డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఈ లారీ సిరిసిల్ల వాసి అయిన కాంగ్రెస్ నేత సయ్యద్ సమద్‌కు చెందినదని ఆయన పేర్కొన్నారు. బుధవారం రాత్రి సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సయ్యద్ సమద్ గతంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేశారని, లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఈ లారీకి శ్రీనివాస్ అనే వ్యక్తి డ్రైవర్‌గా ఉన్నాడని తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

హరిత తెలంగాణే లక్ష్యం

ఏటా 40 కోట్ల మొక్కలు నాటడమే ధ్యేయం ● బ్రాహ్మణ పరిషత్ హరితహారంలో మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ కొండాపూర్:

హరిత తెలంగాణను సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారంలో రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా పాలుపంచుకోవడం సంతోషంగా ఉన్నదని అటవీశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. హైదరాబాద్ శివారులోని గోపనపల్లిలోని బ్రాహ్మణ సేవా సదన్ భవనానికి కేటాయించిన ప్రాంతంలో బుధవారం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 'నక్షత్రవనం' పేరిట హరిత హారం కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నక్షత్రవనం అనే భావనే చాలా కొత్తగా ఉన్నదన్నారు. మేషం నుంచి పన్నెండు రాశుల్లోని వ్యక్తులు పూజలు చేసుకునేందుకు వీలుగా ఇక్కడ మొక్కలు నాటుతున్నారని చెప్పారు. మేము సైతం అంటూ బ్రాహ్మణులు కూడా హరితహారంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో మూడో విడుత హరితహారంలో భాగంగా ఇప్పటివరకు 16 కోట్ల 10 లక్షల మొక్కలు నాటామని తెలిపారు. ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్నా అక్కడ మొక్కలు నాటాలని, ముఖ్యంగా ఇండ్ల ముందు, పొలాల గట్లపై, స్కూళ్లు, దవాఖానలు, మందిరాల పరిసరాల్లో ఇలా అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. రాష్ట్రంలో ఏటా 40 కోట్ల మొక్కలు నాటడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణకు ప్రత్యేకంగా గ్రీన్ బ్రిగేడర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి జోగు రామన్న తెలిపారు.

బ్రాహణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కే వీ రమణాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సదనం నిర్మాణం కోసం కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో ప్రత్యేకంగా ఎకరం స్థలంలో మొక్కలు పెంచనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ 27 నక్షత్రాల్లో జన్మించినవారందరూ తమ నక్షత్రాలకు అనుగుణంగా పూజలు చేసుకునేందుకు నక్షత్రాలకు అనుగుణంగా మొక్కలను నాటుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బాలానగర్ కార్పొరేటర్ నరేంద్రాచారి, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సదన్ జనరల్ సెక్రటరీ బోర్‌పట్ల హన్మంతాచారి, చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్, ప్రవీణ్‌స్వామి, బ్రాహ్మణ్ సేవా సదన్ సభ్యులు, నాయకులు పాల్గొని మొక్కలు నాటారు.



గోపనపల్లిలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో మొక్క నాటుతున్న మంత్రి జోగు రామన్న. చిత్రంలో పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్ తదితరులు

బ్రాహ్మణుల పుస్తకాల ముద్రణకు రూ.50వేల ఆర్థికసాయం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: బ్రాహ్మణ రచయితలకు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అపురూప కానుకను ప్రకటించింది. పుస్తకాలను రచించి ముద్రించుకోలేని పరిస్థితిలో ఉన్న బ్రాహ్మణులకు తమ పుస్తకాలను ముద్రించుకునేందుకు వీలుగా రూ. 50వేల వరకు ఆర్థిక సాయం అందించాలని పరిషత్ కార్యవర్గం నిర్ణయించింది. పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం గోపనపల్లిలో హరితహారం కార్యక్రమం నిర్వహించిన అనంతరం అక్కడే కార్యవర్గ సమావేశం జరిగింది. బ్రాహ్మణ రచయితలకు ఆర్థిక సాయం పథకంలో రచయితల ఎంపిక కోసం పరిషత్ సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. అష్టకాల రామ్మోహన్, వీ మృత్యుంజయశర్మ, సుమలతాశర్మ, ఎం వెంకటరమణశర్మ ఈ కమిటీలో ఉంటారు. సామూహిక ఉపనయనాల కార్యక్రమంలో ప్రతి నిరుపేద బ్రాహ్మణ వటువుకు రూ. 11,116 ఆర్థికసాయం అందించాలని పరిషత్ నిర్ణయించింది. టోఫెల్, జీఆర్‌ఈ, ఐఈఎల్‌టీఎస్ వంటి కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్న బ్రాహ్మణ విద్యార్థులకు గరిష్ఠంగా రూ. 30వేల వరకు ఆర్థికసాయం అందించనున్నారు. ఇక, వివేకానంద విదేశీ విద్యాపథకానికి దరఖాస్తుచేసుకున్న వారికి ఈ నెల 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి సారథ్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సముద్రాల వేణుగోపాలచారి, పారిశ్రామికవేత్త సీ ఎల్ రాజం, తెలంగాణ ప్రధాన సంపాదకులు అష్టకాల రామ్మోహన్, ఎం వెంకటరమణశర్మ, సువర్ణసులోచన, సుమలతశర్మ, మృత్యుంజయశర్మ, చకిలం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

జేఎన్‌యూఎఫ్‌ఏలో మన విద్యార్థులకు నష్టం


ఏపీ విద్యార్థులకే 64శాతం సీట్లు

మొత్తం మనకే ఇవ్వాలంటున్న తెలంగాణవాదులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం ఏర్పడి మూడేండ్లవుతున్నా ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్‌లో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతూనే ఉన్నది. హైదరాబాద్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్‌యూఎఫ్‌ఏ) విభజన జరుగకపోవడం సమస్యగా మారింది. 1978 జనాభా దామాషా ప్రకారం అమల్లోకి వచ్చిన ప్రాంతీయ రిజర్వేషన్లతో 371(డీ) ఆర్టికల్ తీసుకొచ్చారు. ఆ వర్సిటీలో ఉన్న మొత్తం సీట్లలో 64శాతం ఏపీ విద్యార్థులతో భర్తీచేస్తున్నారు. ఆ ప్రకారం ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఉన్న జనాభా ప్రాతిపదికన 42శాతం, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ పరిధిలోని జనాభా దామాషా ప్రకారం 22శాతం సీట్లు భర్తీచేస్తున్నారు. మిగిలిన 36శాతం మాత్రమే తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తున్నారు. తెలంగాణలోని వర్సిటీలో ఏపీ విద్యార్థులకు సింహభాగం సీట్లు కేటాయించడం పలువురిని విస్మయానికి గురిచేస్తున్నది.

లోకల్, నాన్‌లోకల్ క్యాటగిరీగా సీట్ల కేటాయింపు!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 42 శాతం తెలంగాణ, 58 శాతం ఏపీ విద్యార్థులతో సీట్ల



భర్తీ ప్రక్రియను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి పదేండ్ల వరకు కొనసాగించాల్సి ఉన్నది. ఆ తర్వాత 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులతో భర్తీ చేయాలి. అయితే విభజన చట్టం సెక్షన్ 75 ప్రకారం ఏ ప్రాంతంలో ఉన్న సంస్థలు ఆయా ప్రాంతానికే చెందుతాయి. ఈ ప్రకారం వంద శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులతో భర్తీచేయాల్సి ఉంటుందని మరో వాదన బలంగా ఉన్నది. ప్రస్తుతం ఇంజినీరింగ్ కాలేజీల్లో లోకల్, నాన్‌లోకల్ కోటా ప్రకారం ఏ విధంగా సీట్లు భర్తీ చేస్తున్నారో ఆ పద్ధతిలోనే జేఎన్‌యూఎఫ్‌ఏలో కూడా సీట్లు భర్తీ చేయాలని తెలంగాణవాదులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర విద్యావిధానంతో తెలంగాణ విద్యార్థులకు నష్టం

విభజన చట్టం షెడ్యూల్ 10లో పేర్కొన్న రాష్ట్రస్థాయి విద్యాసంస్థలలో 371(డీ) ఆర్టికల్‌తో 64 శాతం ఏపీ విద్యార్థులకు, 36 శాతం తెలంగాణ విద్యార్థులకు సీట్లు భర్తీచేస్తున్నారు. జేఎన్‌యూఎఫ్‌ఏ 600 సీట్లలో 64 శాతం 384 సీట్లు ఏపీ విద్యార్థులకు, 36 శాతం 216 సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తున్నారు. వాస్తవానికి 600 సీట్లు తెలంగాణ విద్యార్థులకే కేటాయించాలి. ఇదేకాక నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్), బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ వంటి స్టేట్ మెడికల్ కాలేజీలలో ఈ విధంగా సీట్లు భర్తీచేస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రాధాన్యం ఉన్న రాష్ట్రస్థాయి విద్యా సంస్థలలో ఏపీ విద్యార్థులకు 64 శాతం సీట్లు కేటాయించడంతో ఇక్కడి విద్యార్థులకు నష్టం వాటిల్లుతున్నది. తెలంగాణలోని విద్యాసంస్థలు ప్రతిష్ఠాత్మకమైనవి కావడంతో ఇక్కడ చేరడానికి ఏపీ విద్యార్థులు మొగ్గుచూపిస్తున్నారు. జేఎన్‌యూఎఫ్‌ఏ వర్సిటీ వీసీ, అధ్యాపకులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తున్నది. కానీ ప్రవేశాల్లో మాత్రం ఏపీ విద్యార్థులకు పెద్దపీట వేయడాన్ని తెలంగాణవాదులు తప్పుపడుతున్నారు. ఏపీ పునర్విభజన చట్టంలో 371 (డీ) ఆర్టికల్‌కు పరిష్కారం చూపించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సాధారణ విద్యాసంస్థల మాదిరిగా స్టేట్ వర్సిటీలో ప్రవేశాల విధానం (ప్రాంతీయ రిజర్వేషన్లు) మార్చాల్సి ఉంటుంది. దీనిపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరుపాల్సి ఉన్నది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల అసెంబ్లీలో తీర్మానాలు చేసి, చట్ట సవరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఈ సమస్యను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

చేపపిల్లలు వదిలేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చేపపిల్లలను వదిలే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, జలాశయాల్లో చేపలు వదిలే కార్యక్రమ ఏర్పాట్లు, గొర్రెల పంపిణీ పథకం అమలు తీరుపై కలెక్టర్లు, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులతో బుధవారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ రాజయ్యయాదవ్, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది మొత్తం 70 కోట్ల చేపపిల్లలు విడుదల చేయనున్నట్టు మంత్రి తెలిపారు. చేపపిల్లల వదలడంపై అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. మరోవారంలో సంచార పశువైద్యవాహనాలు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు.

పోస్టల్ ఉద్యోగులపై సీబీఐ కేసు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ముగ్గురు పోస్టల్ ఉద్యోగులతోపాటు మరో ముగ్గురు వ్యాపారులపై సీబీఐ కేసు నమోదుచేసింది. హైదరాబాద్‌లోని హుమాయున్‌నగర్ సబ్ పోస్టాఫీస్‌లో ఫ్రాంకింగ్ మిషన్ పేరుతో పోస్టల్ స్టాంపింగ్ చేసి, వస్తువులను పార్శిల్ చేస్తున్న వ్యవహారంలో అవకతవకలు జరుగుతున్నట్టు సీనియర్ అధికారులు గుర్తించారు. పోస్టాఫీసులో పనిచేస్తున్న ఎన్ కామేశ్వరరావు, పద్మావతి (రిటైర్డ్), ఎస్ వెంకటస్వామి (రిటైర్డ్)తోపాటు ప్రిశా పెరల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శైలేశ్ అగర్వాల్, మేనేజింగ్ డైరెక్టర్ నీలేశ్‌కుమార్ అగర్వాల్, అదే సంస్థకు చెందిన మరికొంతమంది ప్రమేయం ఉందని తేల్చారు. ప్రిశా పెరల్స్ సంస్థ 2013లో ఫ్రాంకింగ్ యంత్రం వినియోగించేందుకు పోస్టల్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ తీసుకుందని, 2015లో లైసెన్స్ రద్దు చేసినా, ఫ్రాంకింగ్ యంత్రం మాదిరిగా కలర్ జిరాక్స్‌తో పోస్టర్ ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. వాటిని తిరస్కరించాల్సిన పోస్టల్ సిబ్బంది స్వీకరించారని, దీంతో పోస్టల్‌శాఖకు రూ.7.66 కోట్ల నష్టం వాటిల్లినట్టు సీనియర్ సూపరింటెండెంట్ హెచ్ ఆర్ చంద్రశేఖర్ ఆచార్య ఫిర్యాదుతో సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు.



ప్రసవం కోసం వచ్చి..

పక్కోడి ప్రాణం పోతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో.. ఓ వైద్యురాలు చేసిన సాహసం చూస్తే మానవత్వం బతికే ఉందనిపిస్తుంది. బిడ్డకు జన్మనిచ్చేందుకు హాస్పిటల్లో చేరిన ఆమె.. తన ప్రసవాన్ని వాయిదా వేసుకుని మరీ, మరో మహిళకు పురుడు పోసింది.

ఆమంద అనే వైద్యురాలు ప్రసవం కోసం అమెరికాలోని ఫ్రాంక్‌ఫోర్ట్ రీజినల్ మెడికల్ సెంటర్‌లో చేరింది. పురుడు పోసేందుకు ఆమెను వార్డుకు తరలించారు. ఇంతలోనే జాన్సన్ అనే నిండు గర్భిణి కూడా పురుటినొప్పులతో అదే హాస్పిటల్లో చేరింది. తల్లిపేగు బిడ్డ మెడకు చుట్టుకోవడంతో కాన్పు కష్టమైంది. ఆమె పరిస్థితిని చూసి చలించిన ఆమంద తన ప్రసవాన్ని వాయిదా వేసుకున్నది. డెలివరీ కోసం ధరించిన గౌనులోనే జాన్సన్‌ను ఉంచిన వార్డుకు వెళ్లింది. పురిటి నొప్పులను పంటి బిగువున భరిస్తూ.. ప్రసవం క్లిష్టంగా మారిన మహిళకు పురుడు పోసింది. ఆ తల్లీబిడ్డలకు పునర్జన్మనిచ్చింది. అనంతరం ఆమందను వార్డుకు తీసుకెళ్లిన వైద్యులు ఆమెకు కూడా డెలివరీ చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

విశ్వాసంతో కూడిన మానవత్వం

మానవత్వానికి మారుపేరుగా నిలువాల్సిన మనుషుల్లో ఇప్పడది మచ్చుకైనా కనిపించని పరిస్థితులు నెలకొన్నాయి. మా గుండెల్లో మాత్రం అది మెండుగా ఉందని నిరూపించాయి పశ్చిమ బెంగాల్‌లోని ఈ వీధి కుక్కలు. ఇంతకీ అవేం చేశాయి?

విశ్వాసమే కాదు, మానవత్వం కూడా మాలో నిండుగా ఉన్నదని నిరూపించాయి పశ్చిమ్‌బెంగాల్‌లో కొన్ని వీధికుక్కలు. హౌరా స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఓ చిన్నారిని పడేసి వెళ్లారు. జనాలంతా పక్కనుంచే వెళ్తున్నారు కానీ ఒంటరిగా ఉన్న శిశువును మాత్రం పట్టించుకోవడం లేదు. ఎక్కడ నుంచి వచ్చాయో కొన్ని కుక్కలు.. ఆ పాపకు చుట్టూ రక్షణ కవచంగా నిలిచాయి. స్టేషన్ సిబ్బంది వచ్చి పాపను తమ చేతుల్లోకి తీసుకునే వరకు కంటికి రెప్పలా కాపాడుకున్నాయి. అక్కడే ఉన్నా పట్టించుకోని జనాలను ఆలోచింపజేశాయి. ఇలాంటి సంఘటన జరుగడం అక్కడ ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందొకసారి కూడా ఓ పసిగుడ్డును కాపాడాయి వీధి కుక్కలు.





మనీ మ్యాటర్స్ for women



సిరులిచ్చే సీజనల్ వ్యాపారం

ఒక్కో పండుగది ఒక్కో ప్రత్యేకత.. వినాయకచవితికి గణేషుడు..
దీపావళికి టపాకాయలు.. రక్షాబంధన్‌కు రకరకాల రాఖీలు.. సంక్రాంతికి పతంగులు..
సీజనల్‌గా వచ్చే ఈ పండుగలకు ఈ ఐటమ్సన్నీ వెరీవెరీ స్పెషల్... స్టాల్స్ ఏర్పాటు చేసుకుని అమ్ముతుంటారు చాలామంది..
వీటిని హోల్ సేల్‌లో తీసుకురావడానికి ఎక్కడెక్కడికో వెళ్తుంటారు..
ఎందుకలా వెళ్లడం.. వీటిని మనమే తయారు చేస్తే ఎలా ఉంటుంది?
ఆలోచన అద్భుతమే! కానీ చేసేదెలా? అది వివరించడానికే ఈ వారం 'మనీమ్యాటర్స్' మీ ముందుకు వచ్చింది.

ప్రతి పండుగకు ఏదో ఒక స్పెషాలిటీ ఉంటుంది. దాన్ని క్యాష్ చేసుకోగలిగితే సీజనల్ వ్యాపారంలో సక్సెస్ అయినట్టే. ఇలాంటి ఆలోచనే చేశారు పెద్దపల్లి జిల్లాకు చెందిన కృష్ణమూర్తి. మొదట్లో రక్షాబంధన్‌కు రాఖీల స్టాల్స్‌ను ఏర్పాటు చేసేవారాయన. అలా మెల్లమెల్లగా సీజనల్ వ్యాపారం మొదలుపెట్టాడు. వినాయక చవితికి వినాయక విగ్రహాలు, హోలీకి రంగులు, సంక్రాంతికి పతంగులు. ఇలా ప్రతి పండుగా ఆయనకు ఆసరాగా నిలిచింది. కాకపోతే ముడిసరుకును ఇతర రాష్ట్రాల నుంచి హోల్‌సేల్‌లో కొనుక్కొచ్చి ఇక్కడ అమ్మడం ఏంటి? మనమే వాటిని తయారు చేస్తే మరికొందరికి ఉపాధి ఇవ్వవచ్చు కదా! అని ఆలోచించాడు కృష్ణమూర్తి. అలా మొదలైందే ఈ రాఖీల తయారీ కేంద్రం. తెలంగాణలోనే తొలి రాఖీల తయారి కేంద్రంగా ఇది గుర్తింపు పొందింది.



ఇంటి పట్టునే చేసుకోవచ్చు

మాకు మొదట రాఖీలు తయారు చేయడం తెలియదు. ఇక్కడ శిక్షణ తీసుకొని రాఖీలు తయారు చేస్తున్నాం. ఇది ఎంతో సులువైన పని. ఔత్సాహిక మహిళలు ఇంటి పట్టునే ఉంటూ చేసుకోదగినది.

-మౌనిక, రాఖీ తయారీదారు, పెద్దపల్లి.

ఇది సీజనల్ వ్యాపారం అని సింపుల్‌గా తీసేయడానికి లేదు. కృష్ణమూర్తి 25 సంవత్సరాలుగా ఇదే వ్యాపారంలో ఉన్నారు. వినాయకచవితికి విగ్రహాల తయారీ, హోలీకి రంగులు, రాఖీ పండుగకు రాఖీల తయారీ.. సంవత్సరాంతం వ్యాపారం కొనసాగేలా చూస్తున్నారు. ఆయన దగ్గర ప్రస్తుతం చాలామంది ఉపాధి పొందుతున్నారు. ముడి సరుకు తీసుకురావడం, తయారుచేసే విధానం తెలిస్తే చాలు ఎవ్వరైనా ఈ వ్యాపారాన్ని ఈజీగా చేసుకోవచ్చు.

వందల మందికి ఉపాధి

పెద్దపల్లి కేంద్రంగా కొనసాగుతున్న ఈ వ్యాపార కేంద్రం నుంచి చుట్టూ ఉన్న నాలుగైదు జిల్లాలకు రాఖీలు సరఫరా అవుతుంటాయి. ప్రోడక్ట్స్‌కు మంచి డిమాండ్ సృష్టించుకోగలిగితే.. మరిన్ని ప్రాంతాల నుంచి ఆర్డర్లు పెరుగవచ్చు. సొంతంగా వాహనాన్ని ఏర్పాటు చేసుకుని సరఫరా చేసుకోవచ్చు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వగైరా బిల్లులోనే కలిపి తీసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల తయారిలోనే కాదు, మార్కెటింగ్‌లోనూ మరెందరికో ఉపాధి అవకాశం కల్పించవచ్చు. కృష్ణమూర్తి దగ్గర వందల మంది ఉపాధి పొందుతున్నారు.

ఖర్చు తక్కువ- ఆదాయం ఎక్కువ

ఈ వ్యాపారంలో ఖర్చు కంటే ఆదాయమే ఎక్కువ ఉంటుందని చెప్పొచ్చు. రాఖీలను హోల్‌సేల్‌గాను, రిటైల్‌గాను అమ్మవచ్చు. హోల్‌సేల్‌గా అమ్మడం వల్ల లాభం కొంత తక్కువ రావచ్చు. రిటైల్‌గా అమ్మడం ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవచ్చు. మనం అమ్మే రేటుకు యాభై శాతం తక్కువ ఖర్చుతోనే తయారీ పూర్తవుతుంది కాబట్టి నష్టం వచ్చే అవకాశం ఉండదు. సరుకు కొంత మిగిలిపోయినా పాడయ్యే అవకాశమూ లేదు. కాబట్టి ఏ రకంగానూ నష్టాన్ని మిగల్చని మంచి వ్యాపారమిది.

మహిళలకూ అనువైనది

ఈ వ్యాపారాన్ని మహిళలూ సులువుగా నిర్వహించుకోవచ్చు. ఇంటిపట్టునే ఉంటూ చిన్నగా ప్రారంభించుకోవచ్చు. ఇంట్లోనే చిన్న గదిని వీటి తయారికి ఉపయోగించుకోవచ్చు. ఎక్కువ సంఖ్యలో తయారు చేసుకోవాలనుకుంటే మాత్రం ప్రత్యేకంగా ఒక గదిని అద్దెకు తీసుకోవచ్చు. ఇంటి పని పూర్తయ్యాక ఖాళీ సమయంలో రాఖీలను తయారు చేసుకోవచ్చు.

వెరైటీస్‌తో ఆకట్టుకోవాలి

రాఖీలను రకరకాల వెరైటీస్‌తో తయారు చేయగలిగితే రిటైల్ షాపుల నుంచి ఆర్డర్లు వెల్లువలా వస్తాయి. దీనికోసం విభిన్నమైన రంగురాళ్లు, మెటీరియల్‌ను ముడిసరుకుగా వాడాల్సి ఉంటుంది. ఈ విషయంలో కృష్ణమూర్తి పక్కాగా ఉంటారు. వివిధ రాష్ట్రాల నుంచి రంగురాళ్లు, మెటీరియల్‌ను ఒకేసారి తీసుకొస్తారు. దీనివల్ల సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయి. తయారి మనదగ్గరే కాబట్టి మార్కెట్ రేటు కన్నా కొంచెం తగ్గించి అమ్మినా ఫర్వాలేదు. అలా చేయడం వల్ల అమ్మకాలు మరింత పెరుగుతాయి.

సులువైన వ్యాపారం



రాఖీలు తయారు చేయడం ఎంతో సులువైన పని. ఈ వ్యాపారం ఇంటి పట్టున ఉండే మహిళలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. అందుకే ఉత్సాహం ఉన్న మహిళలకు ప్రత్యేక శిక్షణ ద్వారా రాఖీ తయారిలో మెళకువలు నేర్పిస్తున్నాం. ప్రస్తుతం 200మంది మహిళలకు నిత్యం పని కల్పిస్తున్నాం. సీజన్‌కు నాలుగు నెలల ముందు నుంచే తయారీ ప్రారంభిస్తాం. తయారు చేసిన రాఖీలను ఇక్కడే హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నాం.

- ఉప్పు కృష్ణమూర్తి, వ్యాపారి.

మీరూ ప్రారంభించొచ్చు..

స్థిర వ్యయాలు..

- ఇంట్లోనే తయారు చేసుకునే ప్రొడక్ట్స్ అయినప్పటికీ, ఎక్కువ సంఖ్యలో తయారు చేయాలనుకుంటే ఒక కార్ఖానా అవసరం.
- రూమ్‌కు అడ్వాన్స్ : రూ. 25,000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- కటింగ్ యంత్రాలు, సామాగ్రి: రూ. 25,000
- ప్రాథమిక + ప్రారంభ వ్యయాలు : రూ. 1,00,000
- మొత్తం : రూ. 1,50,000

నెలవారీ ఖర్చు

- రాఖీలను డజన్‌ను ఒక సెట్‌గా లెక్కిస్తారు.
- ఒక్కరోజులో 100 డజన్ల రాఖీలను తయారు చేయగలరనుకుందాం.
- ఒక డజన్ రాఖీల తయారికి అయ్యే ఖర్చు రూ. 50
- నెలకు 25 రోజులు పనిచేస్తే 2,500 డజన్ల రాఖీలను తయారుచేయవచ్చు.
  అంటే నెలకు 2500x 50= రూ. 1,25,000
- కరెంట్, ఫోన్, ఇతర బిల్లులు: రూ. 5,000
- రూమ్ రెంటు: రూ. 5,000(ఏరియాను బట్టి మారొచ్చు)
- ఇద్దరు పనివాళ్లను పెట్టుకుంటే వేతనాలకు: రూ. 20,000
- మొత్తం : రూ. 1,30,000
- పెట్టుబడి : రూ.2,80,000

ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు 100 డజన్ల రాఖీలను అమ్మగలుగుతాం.
- ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే..
- 100x 300 = 30,000 డజన్ల రాఖీలను అమ్మవచ్చు.
- సగటున ఒక్కో డజన్‌ను హోల్‌సేల్‌గా రూ. 75కి అమ్ముదామనుకుందాం.
- 30,000 x 75= రూ. 22,50,000 ఆదాయం వస్తుంది.

ఏడాదికి అయ్యే ఖర్చు..

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే.. 1,30,000 x 12 = రూ. 16,20,000
- ప్రారంభ వ్యయాలు రూ. 1,50,000
- మొత్తం ఏడాదికి అయ్యే ఖర్చు : రూ. 17,70,000

లాభం అంచనా..

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 22,50,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ.17,70,000
- తీసేస్తే వచ్చే లాభం : రూ.4,80,000
- అంటే నెలకు వచ్చే లాభం : సుమారుగా రూ. 40,000

గమనిక :
ఈ లెక్కలు కేవలం అంచనా ప్రకారం వేసినవే. మరిన్ని వెరైటీస్‌ను తయారు చేయగలిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

బిట్స్ కార్నర్

పెండ్లి డ్రెస్ చూపించరూ!



'ఎన్నాళ్లో వేచి చూశాను. ఊహల్లో తేలియాడి.. కలల్లో మునిగిపోయాను. మధుర జ్ఞాపకాలను నెమరేసుకుంటూ మనువు కోసం ఎదురుచూశాను. అదిప్పడు నిజం కాబోతున్నది. వావ్.. నాకు పెండ్లి కాబోతున్నది. జర ఓ మంచి డ్రెస్ చూసిపెట్టండి నా కోసం' అని ముచ్చట పడుతున్నది 93 ఏండ్ల వృద్ధురాలు.

93 ఏండ్ల సిల్వియా మార్టిన్.. పెండ్లి అనగానే ఎగిరి గంతేసింది. సంబురపడిపోయింది. పెండ్లి అనేసరికి ఈ మాత్రం కుతూహలం సాధారణమే. ఇక పెండ్లి తంతు అంటే మాటలా.. డ్రెస్‌లు తీసుకోవడానికే రెండు మూడు రోజులు పడుతుంది. అంత రిస్క్ ఎందుకనుకుందో లేక.. లేట్ వయసులో మ్యారేజ్ కాబట్టి ఓపిక లేకనో గానీ మ్యాచింగ్ డ్రెస్ సెలెక్ట్ చేయమని ఫేస్‌బుక్ వేదికగా కోరింది. ఇంతకూ ఆమె మనసు దోచిన వ్యక్తి ఎవరంటే 88 ఏండ్ల ఫ్రాంక్. ఆమెకంటే వయసులో చిన్నవాడైన ఫ్రాంక్ ప్రతీరోజూ ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకోవాలనీ.. ఆమె వెంటపడేవాడట. ఇదంతా వాళ్లు యుక్త వయసులో ఉన్నప్పుడు జరిగిన కథ. ఫ్రాంక్ మంచితనం నచ్చడంతో సిల్వియా చివరకు ఓకే చెప్పిందట. కానీ ఎందుకో పెండ్లి మాత్రం జరుగలేదు. చివరగా 20 ఏండ్ల క్రితం వీళ్లు కలుసుకున్నారు. అప్పుడు సిల్వియాకు 73 ఏండ్లు.. ఫ్రాంక్‌కు 68 ఏండ్లు. వయసు దాటిపోవడంతో పెండ్లి గురించి కూడా పెద్దగా ఆలోచించలేదు. కానీ తాజాగా వీళ్ల ప్రేమ మళ్లీ చిగురించింది. తొంబై యేండ్లు వచ్చినా పెండ్లి చేసుకోవాలనే ఆశ మాత్రం చావలేదు. దీంతో పెండ్లికి ముహూర్తం కూడా పెట్టుకున్నారు. ఈ సంబురంలో పడి సిల్వియా నాకో పెండ్లి డ్రెస్ చూడండో అంటూ ఫేస్‌బుక్ వేదికగా ఓ టాస్క్ విధించింది.



- వంటింట్లో దొరికే అద్భుతమైన ఔషధం పసుపు. ముఖానికి మేనిఛాయ తీసుకురావడంతో పాటు అవాంచిత రోమాలను తొలిగిస్తుంది. చర్మాన్ని సున్నితంగా ఉంచుతుంది.
- ముఖంపై మొటిమల్ని తగ్గించడంతో పాటు, వాటివల్ల ఏర్పడే మచ్చల్ని తగ్గిస్తుంది.
- పసుపులో యాంటీబయాటిక్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. దెబ్బ తగిలినవెంటనే గాయంపై పసుపును పూస్తే సెప్టిక్ అవకుండా ఉంటుంది.
- దగ్గును తగ్గించేందుకు పసుపు మంచి ఔషధం.

పాలామృతం పంచుతూ..



అమృతంలాంటి పాలను కన్నబిడ్డలకే కాదు.. ఎవరో తెలియని పిల్లలకు ప్రేమల పందిరిలో పాలిచ్చి కొత్త జీవితాన్నిస్తున్నది ఓ అమ్మ. ఆమె పేరు ఎలిజబెత్ ఆండర్సన్. ఏ సంబంధం లేకపోయినా పాలకేడుస్తున్న పసివాళ్లను చేరదీస్తున్నది ఆ మాతృ హృదయం.

ఆమె పేరు ఆండర్సన్. ఉండేది అమెరికా. ఇద్దరు పిల్లలున్నారు. పెద్దమ్మాయి ఇసాబెల్లాకు రెండేళ్లు. చిన్నమ్మాయి సోఫియాకు ఆర్నెళ్లు. మొదటి బిడ్డ పుట్టినప్పుడు ఆండర్సన్‌కు ఓ సమస్య వచ్చింది. దీన్ని వైద్య పరిభాషలో 'హైపర్ లాక్టేషన్ సిండ్రోమ్' అంటారు. సాధారణ స్థాయికంటే ఎక్కువ చనుబాలు రావడం మొదలయ్యాయి. డాక్టర్లను సంప్రదించినా సమస్యకు పరిష్కారం లభించలేదు. తన బిడ్డకు పాలు పట్టగా మిగిలిన యాభైశాతం నిరుపయోగం అయ్యేవి. చనుబాలు లేక.. తల్లుల్లేక చాలామంది పిల్లలు పాలకేడుస్తున్న విషయాలు ఆమెను ఆలోచింపజేశాయి. దగ్గర్లోని మిల్క్‌బ్యాంక్‌ను సంప్రదించి విషయం చెప్పింది. సొంత బిడ్డలకే పాలివ్వని వాళ్లున్న ఈ రోజుల్లో ఎవరో కూడా తెలియని పసిపిల్లలకు పాలు పడుతానని స్వచ్ఛందంగా ముందుకురావడం పట్ల పాలబ్యాంక్ అధికారులు ఆమెను మెచ్చుకున్నారు. అప్పట్నుంచి రోజూ 6 గ్యాలన్ల చొప్పున పాలు సేకరించి ఇస్తున్నది. ఇంకో ఆశ్చర్యకరవిషయమేంటంటే రోజులో పది గంటల పాటు పసిపిల్లలకు పాలుపట్టే కార్యక్రమానికే ఆండర్సన్ కేటాయిస్తూ మాతృహృదయాన్ని చాటుతున్నది.

మొటిమలతో ఎలా?



అడుగండి చెబుతా

నా వయసు 16 సంవత్సరాలు. ముఖం మీద చాలా మొటిమలు వస్తున్నాయి. మొటిమల కంటే కూడా వాటి వల్ల ఏర్పడుతున్న మచ్చలు, గుంతలు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. మొటిమలకు, మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలు, గుంతలకు ఏదైనా చికిత్స ఉందా? పూర్తి వివరాలు తెలియజేయగలరు.

సంజన, తూప్రాన్

యవ్వనంలో మొటిమలు చాలా సాధారణ సమస్య. చాలామంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. ఇవి అందంగా కనిపించకుండా చేయడమే కాదు. ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తాయి. అయితే దీనికి సరైన చికిత్స తీసుకుంటే మచ్చలు, గుంతలతో సహా పూర్తి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మొటిమల సమస్య తీవ్రతను బట్టి జెల్, క్లెన్సర్లతో పాటు యాంటీబయాటిక్స్ కోర్సు 4-6 నెలల వరకు వాడాల్సి ఉంటుంది. ఇప్పటికే మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలు, గుంతలను పోగొట్టడానికి పీల్స్, డెర్మారోలర్స్, ఫ్రాక్షనల్ కార్బన్ డై యాక్సైడ్ లేజర్స్, మైక్రోనీడిలింగ్ ఆర్ ఎఫ్ వంటి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. దగ్గర్లోని డెర్మటాలజిస్ట్‌ను సంప్రదిస్తే వారు మీకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మీకు వచ్చిన మొటిమలు ఏ రకమైనవో నిర్ధారణ చేసి చికిత్సను సూచిస్తారు.



డాక్టర్ కవిత
డెర్మటాలజిస్ట్
నియోడెర్మా
హైదరాబాద్

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం.నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్)
మా అడ్రస్ : #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news



కేపీహెచ్‌బీలో సిస్టర్ ఫర్ చేంజ్ ర్యాలీ

రాఖీ పండుగ వేడుకల్లో సోదరులకు రాఖీలు కట్టి హెల్మెట్‌ను గిఫ్ట్‌గా ఇవ్వాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం హైదరాబాద్ కేపీహెచ్‌బీకాలనీ మొదటి రోడ్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'సిస్టర్ ఫర్ చేంజ్' అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీలో డీటీవో పుప్పాల శ్రీనివాస్, ఆర్టీవో సుశీల్‌రెడ్డి, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యూత్ కన్వీనర్ కొరబోయిన విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాల్దీవుల్లో ఉద్యోగాలంటూ మోసం

1.81 కోట్లు దండుకున్న ఆర్యన్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ

విజిటింగ్ వీసాలపై తీసుకెళ్లి మాల్దీవుల్లో వదిలేసిన యాజమాన్యం

కళాశాలపై దాడి చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

మలక్‌పేట: మాల్దీవుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ 30 మంది విద్యార్థులను మోసం చేసింది. వారి నుంచి రూ.1.81 కోట్లు వసూలు చేసి విజిటింగ్ వీసాలపై తీసుకెళ్లి వదిలేసి వచ్చింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో బుధవారం కళాశాలపై దాడిచేశారు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, బాధితుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నందురెడ్డి, నారాయణరెడ్డి, శ్రవణ్‌రెడ్డి దిల్‌సుఖ్ నగర్‌లో 'ఆర్యన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్' నిర్వహిస్తున్నారు. నారాయణరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నాడు. 150 మంది విద్యార్థులను కళాశాలలో చేర్చుకున్నారు. అందులో 30 మంది నుంచి కళాశాల ఫీజుకింద (ఏడాదికి రూ.60 వేలు) మూడేండ్లకు రూ.1.8 లక్షలు, ట్రైనింగ్ ప్లస్ ఉద్యోగం కల్పించేందుకు రూ.4.25 లక్షలు వసూలు చేశారు. ఉద్యోగాల్లో చేర్పిస్తామంటూ 40 రోజుల కిందట మాల్దీవులకు తీసుకెళ్లారు. నారాయణరెడ్డి ఐదురోజులు విద్యార్థులతోపాటు అక్కడే ఉండి.. నెలకు రూ.70వేలు జీతం ఇస్తారని, వెంటనే ఉద్యోగాల్లో చేరాలని ఓ సంస్థ పేరు చెప్పి తిరిగివచ్చాడు. విద్యార్థులు నారాయణరెడ్డి చెప్పిన సంస్థకు వెళ్లి సంప్రదించగా.. తమవద్ద ఎలాంటి ఉద్యోగాలు లేవని చెప్పారు. అందరినీ జాబ్ వీసాలు కాకుండా కేవలం విజిటింగ్ వీసాలపై తీసుకొచ్చారని పేర్కొన్నారు. షాక్‌కు గురైన విద్యార్థులు వెంటనే నారాయణరెడ్డికి ఫోన్ చేయగా అతడు ఎత్తలేదు. ఉద్యోగం లేకపోవడం, చేతిలోని డబ్బులు ఖర్చవడంతో 40 రోజులుగా అవస్థలు పడుతున్న విద్యార్థుల్లో 10 మంది పది రోజుల కిందట హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. మిగతా 20 మందిలో 10 మంది బుధవారం బయలుదేరారు. మరో పది మంది అక్కడే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల దిల్‌సుఖ్‌నగర్‌లోని కాలేజీకి వెళ్లి నారాయణరెడ్డిని కలిసి నిలదీశారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని, పిల్లలను భారత్‌కు రప్పించాలని డిమాండ్ చేశారు. రెండురోజుల్లో ఏర్పాటు చేస్తానని తప్పించుకున్న నారాయణరెడ్డి ఆ తర్వాత ముఖం చాటేయంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించి బుధవారం కళాశాలపై దాడిచేశారు. అద్దాలను ధ్వంసం చేశారు. వారికి విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించి కళాశాల ఎదుట ధర్నాచేశాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు నందురెడ్డి, నారాయణరెడ్డి, శ్రవణ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్పొరేటర్ కాలేజీ వద్దకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మాల్దీవుల్లో చిక్కుకున్న విద్యార్థులను రప్పించేందుకు మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.



దిల్‌సుఖ్‌నగర్‌లోని కాలేజీ ఎదుట బాధితుల ఆందోళన



స్పీకర్ మధుసూదనాచారితో ట్రైనీ ఐఏఎస్‌లు

మానవీయకోణంలో విధులు నిర్వహించాలి

శిక్షణ ఐఏఎస్‌లకు స్పీకర్ మధుసూదనాచారి సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాజంలోని పేదవర్గాలను దృష్టిలో పెట్టుకుని మానవీయ కోణంలో విధులు నిర్వహించాలని శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లకు శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సూచించారు. ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చేలా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి, రాష్ర్టానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తెలంగాణ రాష్ర్టానికి కేటాయించిన ఏడుగురు (2016 బ్యాచ్) ఐఏఎస్‌లు హెచ్చార్డీలో శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఐదుగురు తెలుగువారు కాగా, మరో ఇద్దరు ఇతర రాష్ర్టాలకు చెందినవారు. శిక్షణలో భాగంగా వీరు బుధవారం సాయంత్రం అసెంబ్లీని సందర్శించి, శాసనసభ వ్యవహారాలు, సభ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. రాష్ర్టానికి మంచి పేరు తీసుకురావాలని స్పీకర్ సిరికొండ వారికి సూచించారు. అంతకుముందు తెలంగాణ లెజిస్లేటివ్ సచివాలయం కార్యదర్శి డాక్టర్ సదారాం, సంయుక్త కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు ట్రైనీ ఐఏఎస్‌లకు అసెంబ్లీ, కమిటీ హాళ్లను చూపించారు. అసెంబ్లీ నడిచే తీరు, ప్రొసీడింగ్స్‌ను వివరించారు. స్పీకర్‌ను కలిసిన శిక్షణ ఐఏఎస్‌లలో క్రాంతి వల్లూరి, సంతోష్ బధాతి, డాక్టర్ బీ గోపి, డాక్టర్ ప్రియాంక, పీ ఉదయ్‌కుమార్, జితేశ్ వీ పాటిల్, హనుమంత్ కొరినా జొడాంగ్ ఉన్నారు.



యోయో టీవీ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-9లో యోయో టీవీ కార్యాలయాన్ని బుధవారం టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రారంభోత్సవంలో టీ న్యూస్ సీఈవో నారాయణరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ప్రెస్‌క్లబ్!

మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాతబస్తీలో ప్రెస్‌క్లబ్ నిర్వహణకు వీలుగా భవనం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. కులీకుతుబ్‌షా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాతబస్తీ జర్నలిస్టులు బుధవారం అల్లం నారాయణను కలిసి తమకు ప్రత్యేకంగా ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అక్రెడిటేషన్ లేని జర్నలిస్టులకు కూడా హెల్త్‌కార్డులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అల్లం నారాయణను కలిసినవారిలో టీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు మీర్ మెహదీఅలీ, టీఈఎంజేయూ వైస్‌ప్రెసిడెంట్ మహ్మద్ అక్బర్ షరీఫ్ ఇతర జర్నలిస్ట్ నాయకులు ముర్తుజ్, మహ్మద్ సర్వార్ తదితరులు ఉన్నారు.

రెండెకరాలు.. రోజుకు 20 వేలు

- ఆకుకూరల సాగుతో అద్భుత ఆదాయం
- ఆధునిక సాంకేతికత సాయంతో అధిక దిగుబడి
- నీటి వృథాకు అడ్డుకట్ట.. తక్కువ నీటితో సాగు
- 'ఫ్రెస్కోఫీల్డ్స్' సక్సెస్ స్టోరీ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/ మణికొండ, నమస్తే తెలంగాణ:



మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్‌లో 'ఫ్రెస్కోఫీల్డ్స్' సాగు చేసిన ఆకు కూరలు

రెండు ఎకరాల్లో ఆకుకూరల సాగు. 10 మంది కూలీలు. రోజూ రూ.20 వేల సంపాదన. అంటే నెలకు దాదాపు రూ.6 లక్షలు. అన్ని ఖర్చులు పోగా మిగులు రూ.4 లక్షల పైమాటే.. నమ్మశక్యంగా లేకున్నా ఇది నిజం. 'ఫ్రెస్కోఫీల్డ్స్' అనే కంపెనీ సాగులో ఆధునిక పద్ధతులు వినియోగించి ఈ విజయం సాధించింది. నీటి వృథాకు చెక్ పెట్టడంతోపాటు నామమాత్రపు నీటి వనరులతో అధిక దిగుబడిని సాధిస్తున్నది. ఎండాకాలంలోనూ ఆకుకూరల సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొలానికి రూపకల్పన చేసింది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో వినియోగిస్తున్న విధానాలను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన పొలంలో అమలు చేస్తున్నది. ఇక్కడ పాలకూర, తోటకూర, పుంటికూర, పుదీనా, మెంతి, కొత్తిమీర, కరివేపాకు తదితరాలు పండిస్తున్నారు. రోజూ పది మంది కూలీలకు పని. వారు కోసిన ఆకు కూరలను ఎప్పటికప్పుడు రవాణా చేస్తున్నారు. మూడింట ఒక వంతు ఖర్చులు పోగా మిగతాదంతా రైతుకే దక్కుతున్నది.

సాగు పద్ధతి ఇలా..

ఇక్కడ ఆకుకూరలను మడుల్లో కాకుండా బెడ్స్‌పైన పండిస్తున్నారు. దీంతో నీటి వృథాకు చెక్ పడింది. పంటకు నీరందించేందుకు మైక్రో స్ప్రింక్లర్లను అమర్చారు. దీంతో నీటి వినియోగం తగ్గడం.. వేర్లతో పాటు మొక్క పూర్తిగా తడిసి దిగుబడి పెరుగుతుందని ఫ్రెస్కో ఎండీ రవీందర్ చెప్తున్నారు. ముందుగా పొలాన్ని పూర్తిగా చదును చేసుకున్న తర్వాత మడులకు బదులుగా వరుస క్రమంలో బెడ్స్‌ను (బోదెలు) ఏర్పాటు చేసుకోవాలి. కర్బూజ పంటకు చేసినట్టుగానే బెడ్స్ (బోదెలు) వేసుకోవాలి. అయితే ఆకుకూరల సాగుకు బెడ్స్ కాస్త ఎక్కువ వెడల్పుతో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. బెడ్స్ మధ్య నిర్ణీత దూరం ఖాళీ వదులాలి. ఒక్కో బెడ్‌పైన ఒక్కో రోజు విత్తనాలు చల్లాలి. దీంతో రోజుకు ఒక సాలు కోతకు వస్తుంది. ఒక సాలులో పంట కోసిన తర్వాత వెంటనే దాన్ని చదును చేసి విత్తనాలు చల్లాలి. ఆకుకూరలను కోసిన తర్వాత గరిష్ఠంగా మూడు గంటల్లోనే మార్కెట్‌కు పంపేలా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

పెట్టుబడి తక్కువే..

ఈ విధానంలో సాగుకు పెట్టుబడి కూడా పెద్దగా అవసరం లేదు. కొత్తగా స్ప్రింక్లర్లు మినహా పరికరాలు కొనుగోలు చేయాల్సిన పనిలేదు. ఎకరా స్థలంలో వేసిన బెడ్స్‌కు సరిపడా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసేందుకు రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. వీటిని కొనుగోలు చేస్తే దాదాపు ఆరేడు ఏండ్ల వరకు పని చేస్తాయి. కూలీలతో పనులు చేయిస్తూ, తోటను నిరంతరం పర్యవేక్షిస్తుంటే చాలు. శ్రీరాంనగర్‌లో పండించిన ఆకు కూరలను బహుళ జాతి కంపెనీలతోపాటు, అపార్ట్‌మెంట్లు, కాలనీలకు నేరుగా సరఫరా చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఆకుకూరలను బహుళజాతి కంపెనీలకు సరఫరా చేసేటప్పుడు ఆయా కంపెనీలు కోరుకున్న విధంగా కట్టలు కట్టడంతో పాటు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేస్తారు. వాటిని శ్రీరాంనగర్ నుంచి మొయినాబాద్ వరకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి ఆయా కంపెనీ వాహనాలు వచ్చి పంటను తీసుకెళ్తాయి.

రోజువారీ ఉత్పత్తి, ఆదాయం ఇలా.. (సుమారు)

రకం	కట్టలు	కట్ట ధర (రూ.ల్లో)	ఆదాయం (రూ.ల్లో)
పుదీనా	300	1.50	450
మెంతికూర	1000	3.25	3,250
కొత్తిమీర	3,000	3.00	9,000
కరివేపాకు	600	2.50	1,500
పుంటికూర	700	1.50	1,050
తోటకూర	600	1.25	750
పాలకూర	2,000	2.00	4,000
మొత్తం			20,000

విదేశాల్లోని విధానాలనే పాటిస్తున్నాం



మేము న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో వ్యవసాయం చేయిస్తున్నాం. అక్కడ వేల ఎకరాల్లో టమాటను బెడ్స్‌పైనే పండిస్తున్నాం. పంటను సాస్ కంపెనీలకు అమ్ముతున్నాం. అక్కడి విధానాలనే ఇక్కడా అమల్లోకి తీసుకొచ్చాం. మైక్రో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వల్ల వృథాను అరికట్టడంతోపాటు మొక్క పూర్తిగా తడిసి దిగుబడి పెరుగుతుంది. దీంతో వేసవిలోనూ ఆకుకూరలను సాగు చేయొచ్చు. మేం రెండెకరాల్లో ఆకుకూరల సాగుద్వారా ప్రతిరోజూ రూ.20 వేలు సంపాదిస్తున్నాం. మూడింట ఒకవంతు ఖర్చులకు పోతుంది. ఆసక్తిగల వారికి సలహాలు, సూచనలు అందించడానికి మేం సిద్ధం. లేదా www.frescofields.com ను సందర్శించవచ్చు.

– రవీందర్, ఎండీ, ఫ్రెస్కోఫీల్డ్స్

ఈ అల్లం పేస్ట్ తింటే క్యాన్సర్ ఖాయం!

- అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు బూజు పట్టకుండా.. జాంతం గమ్, ఎసిటిక్ యాసిడ్ మిక్సింగ్
- మైలార్‌దేవ్‌పల్లిలో రూ.5 లక్షల విలువైన సరుకు స్వాధీనం



'ఎంకే కిచెన్ మ్యాజిక్' పేస్ట్ ప్యాకెట్.. నిందితుడు ఇస్రానీ అలీ



డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

దనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమ వ్యాపారులు ఆహార పదార్థాలను కల్తీ చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా బుధవారం హైదరాబాద్ నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో ప్రజల ప్రాణానికి హాని కలిగించే రీతిలో అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న గోదాముపై శంషాబాద్ జోన్ ఎస్‌వోటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దాడి చేశారు. ఈ గోదాంలో తయారయ్యే కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు బూజు పట్టకుండా ఉండేందుకు ఏకంగా ఎసిటిక్ యాసిడ్, జాంతం గమ్‌ను ఉపయోగిస్తున్నట్టు తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి బాబుల్‌రెడ్డినగర్‌లో ఇస్రానీ అలీ 'ఎంకే ఫుడ్ ఇండస్ట్రీ'ని నిర్వహిస్తున్నాడు. ఇందులో కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌ను నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం శంషాబాద్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దాడి చేశారు. కల్తీ విషయం బయటపడకుండా, అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు బూజు పట్టినా తెలియకుండా ఉండేలా జాంతం గమ్, ఎసిటిక్ యాసిడ్ కలుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ రసాయనాలతో కూడిన ఆహారం తినడం వల్ల ఏకంగా క్యాన్సర్‌కు దారి తీయడంతోపాటు జీర్ణవ్యవస్థను ధ్వంసం చేస్తుందని పోలీసులు వివరించారు. నిర్వాహకుడు ఇస్రాని అలీ ఈ కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌ను 'ఎంకే కిచెన్ మ్యాజిక్' పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్నాడన్నారు. రూ.5 లక్షల విలువైన పదార్థాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు.

కల్తీపై సమాచారం ఇస్తే రివార్డు: సైబరాబాద్ పోలీసులు

కల్తీని పూర్తిగా నిర్మూలించడానికి సైబరాబాద్ పోలీస్ అధికారులు ప్రజల సహకారాన్ని కోరుతున్నారు. కల్తీ అడ్డాలపై సమాచారం ఇచ్చిన వారికి మంచి బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇస్తున్నారు. కల్తీలపై సైబరాబాద్ ఎస్‌వోటీ అదనపు కమిషనర్-9490617208, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్-9490617462, సైబరాబాద్ వాట్సప్ నంబర్-9490617444, సైబరాబాద్ కంట్రోల్ రూం నం. 9490617100కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

రామానాయుడు స్టూడియోకు విదేశాలనుంచి పార్సిల్

డ్రగ్స్ అంటూ పుకార్లు.. ఎక్సైజ్ అధికారుల తనిఖీ

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఆన్‌లైన్ పార్సిల్ ద్వారా సినీనటుడు రానాకు డ్రగ్స్ పార్సిల్ వచ్చిందంటూ పుకార్లు రావడంతో బుధవారం జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు ఉరుకులుపరుగులు పెట్టారు. ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియోకు ఆన్‌లైన్ ద్వారా ఓ పార్సిల్ వచ్చిందని సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బీ కనకదుర్గ ఆధ్వర్యంలో సిబ్బంది స్టూడియోకు చేరుకున్నారు. ఆ పార్సిల్‌ను తమకు చూపించాల్సిందిగా స్టూడియో సిబ్బందిని కోరారు. విషయం తెలుసుకున్న నిర్మాత సురేశ్‌బాబు అక్కడికి వచ్చి మాట్లాడుతూ రానాకు వెన్నునొప్పి ఉండటంతో ఓ పరికరాన్ని కొనుగోలు చేశామని, దానికి సంబంధించిన పార్సిల్ అని తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో పార్సిల్‌ను తెరిచి చూడగా, ఎక్సర్‌సైజ్‌కు చెందిన పరికరం ఉన్నది. దీంతో ఎక్సైజ్ పోలీసులు వెనుదిరిగారు. ఇటీవల డ్రగ్స్ కేసులో పట్టుపడ్డ నిందితులు కెల్విన్, జీషాన్ తదితరులు ఆన్‌లైన్ పార్సిళ్ల ద్వారా డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్టు వెల్లడించడంతో నగరంలోని కొరియర్ సంస్థలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్రమత్తం చేశారు. ఈ విషయంపై సమావేశం నిర్వహించి ఏవైనా అనుమానాస్పద పార్సిళ్లు వస్తే తమకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రామానాయుడు స్టూడియో అడ్రస్‌తో వచ్చిన పార్సిల్ విషయాన్ని సంబంధిత కొరియర్ సంస్థ ఎక్సైజ్ అధికారులకు తెలియజేయడంతో ఆ విషయాన్ని నిర్ధారించుకున్నారు. డ్రగ్స్ పార్సిల్ అంటూ పుకార్లు రావడంతో పెద్ద సంఖ్యలో మీడియా సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిర్మాత సురేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ తమకు విదేశాలనుంచి పార్సిల్ వచ్చిన మాట వాస్తవమేనని, ఆ పార్సిల్‌లో ఉన్నది రానాకు వెన్నునొప్పి చికిత్స కోసం తెప్పించిన పరికరమని చెప్పారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కనకదుర్గ వచ్చి తనిఖీ చేసి నిర్ధారించుకున్నారని తెలిపారు.

- మానవత్వానికి మచ్చుతునక..



మనం చేసే చిన్న సాయమైనా మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తుందనడానికి నిదర్శనమే ఈ చిత్రం. చేతులు లేకపోవడంతో భిక్షాటన చేసుకొని జీవిస్తున్న ఓ అభాగ్యురాలు దాహంతో అలమటిస్తుండగా.. ఓ దుకాణాదారు స్పందించి గ్లాస్‌తో నీళ్లు తాగించి దాహం తీర్చారు. బుధవారం కోఠిలో కనిపించిందీ దృశ్యం.

రావిర్యాల పార్క్‌లో కొలువుదీరిన మరో సంస్థ

కల్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ పరిధిలోని హార్డ్‌వేర్ పార్క్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువుదీరింది. కల్యాణి గ్రూప్‌నకు చెందిన 'కల్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్' కంపెనీని గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్నట్టు కంపెనీ హెచ్‌ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్‌శాఖల మంత్రి కే తారక రామారావు హాజరవుతారని వివరించారు.

స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఫలితంగా ఉక్కపోతతో జనం ఇబ్బందులకు గురయ్యారు. గాలిలో తేమశాతం తగ్గిపోవడంతో ఈ రకమైన పరిస్థితి ఏర్పడిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి నగరంలోని కొన్ని ప్రాంతా ల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. బుధవారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 33.3 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలుగా నమోదైనట్టు అధికారులు వివరించారు.



హైడ్రోజన్ పబ్‌లో పట్టుబడ్డ యువకులు

హైడ్రోజన్ పబ్‌లో రేవ్‌పార్టీ

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి.. 18 మంది అరెస్ట్

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పబ్‌లో నిర్వహిస్తున్న రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లోని షాంగ్రిల్లా ప్లాజాలో గల హైడ్రోజన్ పబ్‌లో బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కొంతమంది యువకులు రేవ్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ముంబైతోపాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ఏడుగురు యువతులను తీసుకువచ్చి వారితో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పబ్‌పై దాడి చేశారు. ఆ సమయంలో నృత్యాలు చేస్తున్న ఏడుగురు యువతులతో పాటు పార్టీలో పాల్గొన్న 11 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో కొంతమంది వ్యాపారులు, యువకులు ఉన్నారని తెలుస్తున్నది. రేవ్ పార్టీ నిర్వహిస్తున్న హైడ్రోజన్ పబ్ మేనేజర్ పద్మనాభంను కూడా అదుపులోకి తీసుకుని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

మెహిదీపట్నం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును తిరిగి సంబంధీకులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. ఈ ఘటన హైదరాబాద్ లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. బాలానగర్ ఐడీపీఎల్ సమీపంలో కొందరు మహిళలు ఆటో ఎక్కి లంగర్‌హౌస్ పిల్లర్ నంబర్-92 వద్ద దిగిపోయారు. ఈ క్రమంలో సదరు మహిళలు రూ.50 వేలు ఉన్న బ్యాగును ఆటోలో మరిచిపోయారు. కొంత దూరం వెళ్లాక ఆటోడ్రైవర్ బ్యాగును గుర్తించి వెంటనే పిల్లర్ నంబర్-92 వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు బ్యాగు ఇస్తుండగానే బాధితులు కూడా అక్కడికి వచ్చారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్ మహ్మద్‌పాషా చేతుల మీదుగా డబ్బు ఉన్న బ్యాగును బాధితులకు ఇప్పించారు.



లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో బ్యాగును అప్పగిస్తున్న ఆటో డ్రైవర్

విద్యావిధానంపై ముసాయిదా కమిటీ

జాతీయ నూతన విద్యావిధానం తుది ముసాయిదా రూపకల్పనకు ఇస్రో మాజీ చైర్మన్ కే కస్తూరి రంగన్ నేతృత్వంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ జూన్ 26న కమిటీని ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది ప్రముఖులను సభ్యులుగా నియమించింది. నూతన విద్యావిధానం రూపకల్పనకు గాను మానవ వనరుల అభివృద్ధి శాఖ గతంలో దేశవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు కోరింది. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, నిపుణులు, విద్యార్థులు, ఇతర భాగస్వాములు దాదాపు 26 వేల మంది అభిప్రాయాలను పంపారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సంప్రదింపులు కూడా జరిగాయి. ప్రాంతీయస్థాయి సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు అభిప్రాయాలను వెల్లడించాయి. రాజ్యసభలో కూడా దీనిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా 48 మంది ఎంపీలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొందరు లిఖితపూర్వకంగా అందజేశారు. వీటి ఆధారంగా టీఎస్ఆర్ సుబ్రహ్మణియం కమిటీ పూర్తిస్థాయి సమాచారాన్ని అందజేసింది. ఆ సమాచారాన్ని, వివిధ వర్గాల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను కస్తూరిరంగన్ కమిటీ పరిశీలించి తుది ముసాయిదాను రూపొందిస్తుంది.

కమిటీలో సభ్యులు

1. **వసుధ కామత్:** ప్రముఖ విద్యావేత్త. పాఠశాల విద్యారంగానికి విశేష సేవలందించారు. ప్రస్తుతం ముంబైలోని ఎస్ఎన్‌డీటీ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందిస్తున్నారు.
2. **కేజే అల్ఫోన్సె:** పాఠశాల విద్యా సంస్కరణల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులన్నీ వాస్తవంగా తెలిసిన వ్యక్తి. కేరళలోని కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాల్లో 100 శాతం అక్షరాస్యత సాధనలో కీలకపాత్ర పోషించారు.
3. **మంజుల్ భార్గవ:** అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో గణితం ప్రొఫెసర్. గాస్ నంబర్ థియరీకి అందించిన సేవలకుగాను యుక్త వయసులోనే అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు.
4. **రామ్‌శంకర్ కురీల్:** అంబేద్కర్ జన్మస్థలం మహూలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందిస్తున్నారు.
5. **టీవీ కట్టమణి:** మధ్యప్రదేశ్ అమర్‌కంతక్‌లోని గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి.
6. **కృష్ణమోహన్ త్రిపాఠి:** సర్వశిక్ష అభియాన్‌లో విశేష అనుభవం ఉంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ పరీక్షల మండలి అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.
7. **మజర్ ఆసిఫ్:** గువాహటి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఈయన పరిశోధన పర్యవేక్షణలో తొలి పర్షియన్- అస్సామి, ఇంగ్లిష్ నింఘంటువు రూపుదిద్దుకున్నది.
8. **ఎంకే శ్రీధర్:** కర్ణాటక నాలెడ్జి కమిషన్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మాజీ సభ్యకార్యదర్శి. దివ్యాంగ మేధావి. సీఏబీఈ సభ్యుడిగా ఉన్నారు.



ప్రపంచ వారసత్వ నగరం అహ్మదాబాద్

గుజరాత్‌లో 60 ఏండ్ల చరిత్ర కలిగిన అహ్మదాబాద్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తించింది. దీంతో అహ్మదాబాద్.. పారిస్, వియన్నా, కైరో, బ్రసెల్స్, రోమ్ వంటి ప్రఖ్యాత నగరాల సరసన చేరింది. పోలండ్‌లోని క్రాకౌలో జరిగిన ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో ఢిల్లీ, ముంబై నగరాలను వెనక్కినెట్టి అహ్మదాబాద్ ఈ గౌరవాన్ని అందుకుంది. మన దేశంలో ఈ ఘనత దక్కించుకున్న తొలి నగరంగా అహ్మదాబాద్ నిలిచింది. భారత్‌లోని చారిత్రాత్మక అహ్మదాబాద్‌ను ప్రపంచ వారసత్వ నగరంగా ప్రకటిస్తున్నామని యునెస్కో 2017, జూలై 8న తెలిపింది. యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో 1000కి పైగా విశ్వఖ్యాతికి అర్హమైన ప్రాంతాలు ఉన్నాయి. స్మారక ప్రదేశాలు, ప్రకృతిసిద్ధ స్థలాలు, నగరాలు, నిర్మాణాలు, క్షేత్రాలు తదితరాలు ఎన్నో ఇందులో చోటుచేసుకున్నాయి. భారత్‌లోని తాజ్‌మహల్, ఆస్ట్రేలియాలోని గ్రేట్ బేరియర్ రీఫ్, పెట్రా (జోర్డాన్)లోని రాతి కట్టడాల నగరం వంటివి ఉన్నాయి. తాజాగా బ్రిటన్‌లోని లేక్ డిస్ట్రిక్, రియో డీ జెనీరియోలోని వలోంగో నౌకాశ్రయం, పసిఫిక్ మహాసముద్ర దక్షిణ ప్రాంతంలో ముక్కోణాకారంలో కలిసే మూడు ద్వీపాల సమూహం (పొలినేసియన్ ట్రెయాంగిల్)లనూ జాబితాలో చేర్చారు.

గ్రూప్-1 ప్రత్యేకం

యూరోపియన్ కాలనీలు

మూడో కర్ణాటక యుద్ధం (1756-1763)

- మొదటి కర్ణాటక యుద్ధం లాగానే మూడో కర్ణాటక యుద్ధం కూడా ఐరోపాలో జరిగిన సంఘటన వల్ల ఉద్భవించింది. సప్తవర్ష సంగ్రామ ఫలితంగా బ్రిటిష్, ఫ్రెంచ్‌ల వర్తక సంఘాలు యుద్ధానికి తలపడ్డాయి. బ్రిటిష్ వారి అధికారాన్ని నిరోధించటం కోసం ఫ్రెంచ్ ప్రభుత్వం కౌంట్-డీ-లాలీని ఒక నౌకాదళంతో 1757లో ఇండియాకు పంపింది. ఇతను కడలూరును ముట్టడించి, ఫోర్ట్ డేవిడ్‌ను ఆక్రమించాడు. తంజావూరును కూడా ఆక్రమించ ప్రయత్నించాడు. కాని అది వీలుపడలేదు. దీని తర్వాత లాలీ మద్రాసును ఆక్రమించతలిచాడు. అందుకు హైదరాబాద్‌లోని బుస్సీని రమ్మని ఆదేశించాడు. బుస్సీ హైదరాబాద్‌ను వీడగానే అక్కడ ఫ్రెంచి పలుకుబడి క్షీణించింది. బ్రిటిష్‌వారు అదను కనిపెట్టి ఉత్తర సర్కారులను ఆక్రమించుకున్నారు. క్రీ.శ. 1760లో వందవాశి వద్ద జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైన్యాధికారి సర్ ఐర్‌కూట్, ఫ్రెంచి నాయకులైన బుస్సీ, లాలీలను ఓడించాడు. బ్రిటిష్‌వారు పాండిచ్చేరిని ముట్టడించి ఆక్రమించుకున్నారు. మాహె, జింజి స్థావరాలను కూడా ఫ్రెంచివారు కోల్పోయారు. హిందూ దేశంలో ఫ్రెంచి అధికారం పూర్తిగా క్షీణించింది. సప్తవర్ష సంగ్రామం 1763లో పారిస్ సంధితో ముగిసింది. సంధి షరతుల ప్రకారం పాండిచ్చేరి, ఇతర స్థావరాలను ఫ్రెంచివారికి అప్పజెప్పారు. కానీ వాటిని సైనికపరంగా అభివృద్ధి చేయడానికి వీలు లేదు. వర్తకానికి మాత్రం ఉపయోగించుకోవచ్చు. బ్రిటిష్ వారు తమ ప్రత్యర్థులైన ఫ్రెంచి వారి అధికారాన్ని నశింపజేసిన తర్వాత హిందూ దేశ ఆక్రమణకు సంసిద్ధులయ్యారు. అయితే ఫ్రెంచి వారితో వాళ్ల మిత్ర రాజులతో జరిపిన యుద్ధాల్లో ఇంగ్లిష్‌వాళ్లు కొన్ని విలువైన పాఠాలు నేర్చుకున్నారు. దేశంలో జాతీయవాదం పూర్తిగా అదృశ్యమైన పరిస్థితుల్లో స్వదేశీ రాజుల పరస్పర యుద్ధాలను స్వప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకొని తమ రాజకీయ లక్ష్యాన్ని నిరభ్యంతరంగా పూర్తి చేసుకోవచ్చునన్నది ఇంగ్లిష్‌వాళ్లు నేర్చుకున్న మొదటి పాఠం. రెండోది-పాశ్చాత్య పద్ధతుల్లో సుశిక్షతమైన ఐరోపా, భారతీయ కాల్బలం ఆధునిక ఆయుధాలతో శతఘ్నులతో పాత తరహా భారతీయ సైన్యాల్ని సులువుగా ఓడించవచ్చు. మూడోది యూరోపియన్ పద్ధతిలో శిక్షణ, ఆధునిక ఆయుధాలు కలిగిన భారతీయ సైనికుడు యూరోపియన్ సైనికుడితో సమ ఉజ్జీ కాగలడని రుజువైంది.

ఫ్రెంచివారి పతనానికి గల కారణాలు

- ఫ్రెంచి వర్తక కంపెనీ ప్రభుత్వ సంస్థ. ఏ చిన్న సమస్య వచ్చినా ఫ్రాన్స్ రాజు అనుమతి పొంది సమస్యను పరిష్కరించుకోవాలి. కానీ ఆంగ్లేయ కంపెనీ స్వతంత్ర వాణిజ్య వ్యవస్థ కాబట్టి ఆ కంపెనీ తక్షణమే అన్ని సమస్యలను పరిష్కరించుకొని ఆర్థిక వనరులను పెంచుకోవడంతో ఫ్రెంచి వారి మీద విజయం సాధించగలిగింది.
- ఫ్రెంచి కంపెనీకి తగిన నౌకాబలం లేదు. సైనిక వ్యవస్థ పటిష్ఠంగా లేదు.
- ఆంగ్లేయులకు తగిన నౌకాబలం పటిష్ఠంగా ఉంది. సుశిక్షితులైన సైనికులు ఉన్నారు. కాబట్టి వారు ఫ్రెంచివారిని సునాయాసంగా ఓడించగలిగారు.
- ఆంగ్లేయులకు మంచి రాజకీయ, సైనిక నాయకత్వం లభించింది. రాబర్ట్ క్లైవ్, వారెన్స్, సాండర్స్ గొప్ప సామర్థ్యం కలిగిన సైనికాధిపతులు. ఫ్రెంచి వారికి కూడా బుస్సీ, డూప్లే వంటి సమర్థవంతమైన అధికారులు ఉన్నారు. కానీ వారి కింది ఉద్యోగులు అసమర్థులు కావడంతో వారి ప్రతిభ రాణించలేదు. కాబట్టి ఫ్రెంచివారు ఓడిపోయారు.
- ఫ్రాన్స్.. యూరప్‌లో అనేక యుద్ధాల్లో తలదూర్చడంతో వనరులన్నీ అంతరించిపోయాయి. దీంతో ఫ్రాన్స్ యూరప్‌లో ఏమీ సాధించలేకపోగా, వలసల్లో సైతం ప్రఖ్యాతిని కోల్పోయింది. ఇంగ్లండ్ యూరప్ ఖండంలో సంభవించిన యుద్ధాల్లో చాలావరకు తలదూర్చలేదు. వలసల్లో సంపదను పెంచుకొంది కాబట్టి ఇంగ్లండ్ ఫ్రెంచివారిని ఓడించగలిగింది.
- ఫ్రాన్స్‌లో నిరంకుశ రాజరిక విధానం రాజ్యమేలింది. పద్నాలుగో లూయీ అనేక యుద్ధాలు చేయడంతో ఫ్రెంచి ఖజానా వట్టిపోయింది. పద్నాలుగో లూయీ అనంతరం వచ్చిన రాజులు అసమర్థులు కావడంతో ఫ్రెంచివారి శక్తి నశించింది. ఇంగ్లండ్ రాజ్యాంగబద్ధమైన రాజరికంవైపు పురోగమించి తన శక్తిని పెంచుకొంది. కాబట్టి ఫ్రెంచివారు ఓడిపోయారు. ఆంగ్లేయులు విజయం సాధించారు.



బ్రిటిష్‌వారి బెంగాల్ ఆక్రమణ

- దేశంలో బ్రిటిష్ రాజకీయాధిపత్యానికి 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం నాందిపలికింది. ఆ యుద్ధంలో ఇంగ్లిష్ తూర్పుఇండియా బలాలు బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాని ఓడించాయి.
- దేశంలోని రాష్ట్రాల్లో బెంగాల్ మహా సస్యశ్యామలమైన సంపన్న రాష్ట్రం. బెంగాల్‌లో పరిశ్రమలు, వాణిజ్యం ఉచ్ఛస్థితిలో ఉన్నాయి. తూర్పు ఇండియా కంపెనీకిగాని, కంపెనీ ఉద్యోగులకుగాని ఆ రాష్ట్రంలో అత్యంత లాభదాయకమైన వ్యాపార ప్రయోజనాలున్నాయి.
- 1717లో మొఘల్ చక్రవర్తి ప్రసాదించిన ఫర్మానా పుణ్యమా అని ఇంగ్లిష్‌వాళ్లకి బెంగాల్‌లో ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు సమకూరాయి. వ్యాపార సుంకాలు కట్టకుండానే బ్రిటిష్ ఎగుమతి, దిగుమతుల స్వేచ్ఛ అక్కడ ఉంది.
- ఎగుమతి, దిగుమతి సరకుల రవాణాకు పాసులు (దస్తక్‌లు) జారీచేసే హక్కు ఇంగ్లిష్‌వాళ్లకి ఆ ఫర్మానా ద్వారా దక్కింది. కంపెనీ ఉద్యోగులకు ప్రైవేటు వ్యాపారం చేసుకునే హక్కు ఉండేదిగాని ఈ మొఘల్ ఫర్మానా వాళ్లకి వర్తించదు.
- భారతీయ వర్తకుల మాదిరిగా కంపెనీ ఉద్యోగులు సైతం తమ ప్రైవేటు వ్యాపార కార్యకలాపాల్లో సుంకాలు చెల్లించాలి. కంపెనీకి, బెంగాల్ నవాబులకు మధ్య ఆరని చిచ్చు రగిల్చిన ఘనత ఆ ఫర్మానాదే.
- ఆ ఫర్మానా మూలంగా బెంగాల్ ప్రభుత్వం చాలా ఆదాయాన్ని నష్టపోయింది. కంపెనీ సరుకుల రాకపోకలకు సంబంధించి దస్తక్‌లు జారీచేసే హక్కు ఇంగ్లిష్ వాళ్లకు ఉండటం చేత కంపెనీ ఉద్యోగులు ఆ హక్కుని దుర్వినియోగపర్చడానికి అలవాటుపడి పన్ను ఎగవేసేవాళ్లు. ముర్షిద్ కులీఖాన్ మొదలుకొని అలీవర్దీఖాన్ దాకా బెంగాల్‌ను ఏలిన నవాబులెవరూ.. 1717 నాటి మొఘల్ ఫర్మానాకు ఇంగ్లిష్ వాళ్లు ఇచ్చిన అర్థ వివరణతో ఏకీభవించలేదు. వాళ్లు ఇంగ్లిష్‌వాళ్ల చేత ఏటా ఒక మొత్తంగా డబ్బు కట్టించుకున్నారు. దస్తక్‌లు జారీచేసే హక్కును దుర్వినియోగపర్చకుండా కట్టడి చేశారు. అయితే కంపెనీ ఉద్యోగులు మాత్రం తమ ప్రైవేటు వ్యాపారానికి సంబంధించి అవకాశం దొరికితే చాలు పన్నులు ఎగవేసి నవాబుల అధికారాన్ని ఎదిరించారు.
- అయితే 1756లో సిరాజ్ ఉద్దౌలా తన తాతగారైన అలీవర్దీఖాన్ అనంతరం రాజ్యానికి రాగానే వ్యవహారాలు ఒక కొలిక్కి వచ్చాయి. సిరాజ్ యువకుడు. అతనికి ముక్కుమీద కోపం. ముర్షిద్ కులీ ఖాన్ కాలంలో ఇంగ్లిష్‌వాళ్లు ఏ ప్రాతిపదిక మీద వ్యాపారం చేసుకున్నారో, అదే ఇప్పుడూ కొనసాగాలని సిరాజ్ స్పష్టంచేశాడు. దక్షిణాదిన ఫ్రెంచి వాళ్లమీద దిగ్విజయాలు సాధించిన ఇంగ్లిష్‌వాళ్లు సిరాజ్ ఉద్దౌలా విధించిన నిర్బంధాలను ఎదిరించారు. స్వదేశీ రాజుల రాజకీయ, సైనిక బలహీనత వాళ్లకిప్పుడు బాగా తెలుసు. అందుకే తమ సరుకుల మీద నవాబుకు సుంకాలు చెల్లించడానికి నిరాకరించడమేగాక, తమ ఆధీనంలోని కలకత్తా రేవులో ప్రవేశించే భారతీయ వర్తకుల సరుకుల మీద కంపెనీ వ్యాపార సుంకాలు పెంచింది. సహజంగానే యువ నవాబు మండిపడ్డాడు. బెంగాల్ సింహాసనం మీద తన ప్రత్యర్థులను ఎక్కించాలనే దురుద్దేశంతో కంపెనీ తన మీద కత్తికట్టిందని సిరాజ్‌కు మొదటి నుంచి అనుమానం.
- చంద్రనాగూర్‌లో బలంగా ఉన్న ఫ్రెంచివారికి వ్యతిరేకంగా ఇంగ్లిష్‌వాళ్లు బెంగాల్ అనుమతి లేకుండా కలకత్తాలో రక్షణ ఏర్పాట్లు చేసుకోవడంతో సిరాజ్ సహించలేకపోయాడు. దీన్ని తమ సార్వభౌమాధికారం మీద దాడిగా భావించాడు. ఐరోపా ప్రత్యర్థులను తన గడ్డమీద తగవులాడుకోనిస్తే కర్ణాటక నవాబుకు పట్టిన గతి తనకు పడుతుందని భావించాడు. యుద్ధ సన్నాహాలను ఆపమని ఉత్తర్వులు జారీచేశాడు. కానీ ఇంగ్లిష్‌వాళ్లు నిరాకరించారు. 'మొక్కై వంగనిది మానై వంగదు' కాబట్టి.. ఇంగ్లిష్ వాళ్లని ఈ దేశపు చట్టాలకు బద్ధులై ఉండేలా ఆదిలోనే వాళ్ల మెడలు వంచాలని సిరాజ్ నిర్ణయించాడు.
- కానీ అనవసర తొందరపాటుతో తగిన సన్నాహాలు చేసుకోకుండా ఖాసీంబజార్‌ను సిరాజ్ ఉద్దౌలా ముట్టడించి 1756 జూన్‌లో కలకత్తాలో ప్రవేశించాడు. కలకత్తాను ఆక్రమించుకుని అక్కడ ఖైదీలుగా దొరికిన బ్రిటిష్ వారిలో దాదాపు 146 మందిని జూన్ 20న ఒక చిన్నగదిలో బంధించాడు. మిగిలిన ఇంగ్లిష్‌వాళ్లు నౌకలు ఎక్కి పారిపోతుంటే చూసి ఊరుకొని, వాళ్ల మీద తేలిగ్గా సాధించిన విజయానికి ఉబ్బిపోయి సిరాజ్ కలకత్తా నుంచి నిష్క్రమించాడు. ఇది ఆయన చేసిన అతి పెద్ద తప్పిదం. శత్రువు బలాన్ని తక్కువగా అంచనా వేశాడు. సముద్రానికి సమీపంలో 'పుల్టాలో' ఇంగ్లిష్ అధికారులు తలదాచుకొని మద్రాస్ నుంచి సహాయం అందే వరకు నిరీక్షిస్తూ కూర్చున్నారు.
- కలకత్తా చీకటిగది ఉదంతం: 1756 జూన్ 20న కలకత్తాలో యుద్ధ ఖైదీలుగా దొరికిన బ్రిటిష్ వారు 146 మందిని సిరాజ్ ఒక చిన్నగదిలో బంధించాడు. గాలి వెలుతురు లేని ఆ చీకటి గదిలో వేసవి రాత్రి వేడికి భరించలేక అనేక మంది ఖైదీలు మృతి చెందారు. ఈ కలకత్తా చీకటి గది ఉదంతం బ్రిటిష్ అధికారులకు భయాందోళనలు కలిగించడమే కాక, ప్రతీకార చర్యకు పురికొల్పి, భారతదేశ ఆక్రమణకు దారి తీసిందని చెప్పవచ్చు. కానీ, కొద్ది మంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం కలకత్తా చీకటి గది ఉదంతం బందీల్లో ఒక్కడైన 'వెల్' సృష్టించిన కథనం మాత్రమేనని, 146 మంది ఖైదీలను అతడు అన్నట్లు 18 అడుగుల చిన్నగదిలో బంధించడం అసాధ్యమని, ఇది పూర్తిగా అభూతకల్పన అని భావించారు.

ప్లాసీ యుద్ధం (క్రీ.శ. 1757 జూన్ 23న)

- సిరాజుద్దౌలా దర్బార్‌లోని ప్రముఖులతో మంతనాలు జరిపి ఇంగ్లిషు వారు ఒక విద్రోహ ముఠాను తయారు చేసి ఉంచారు. మీర్‌బక్షీగా మీర్ జాఫర్, కలకత్తా అధికారి మాణిక్‌చంద్, ధనవంతుడు బమినాంద్, బెంగాల్‌లో పేరుమోసిన బ్యాంకర్ జగల్ సేత్, నవాబు సైన్యాధికారి ఖాదీంఖాన్ ఇంగిష్ వాళ్లతో చేరి కుట్రదారుల ముఠాగా తయారయ్యారు. అడ్మిరల్ వాట్సన్, కల్నల్ క్లైవ్‌ల ఆధ్వర్యంలో మద్రాస్ నుంచి భారీ సైనిక బలగాలు కలకత్తా చేరాయి. 1757 ప్రారంభంలో క్లైవ్ కలకత్తాను తిరిగి స్వాధీనం చేసుకొని, ఇంగ్లిష్ వాళ్ల కోర్కెలన్నింటికి నవాబు మెడలు వంచి ఒప్పించాడు. అయినా ఇంగ్లిష్ వాళ్లు సంతృప్తి చెందక వాళ్లు చెప్పినట్లే వినే ఒక కీలుబొమ్మను సిరాజ్ ఉద్దౌలా స్థానంలో నిలుపాలని నిశ్చయించుకున్నారు. నవాబు శత్రువులంతా కలిసి పన్నిన కుట్రతో ఇంగ్లిష్ వాళ్లు ఏకమై మీర్‌జాఫర్‌ను బెంగాల్ సింహాసనం ఎక్కించటానికి పూనుకున్నారు. క్రీ.శ. 1757 జూన్ 23న ముర్షిదాబాద్‌కు 20 మైళ్ల దూరంలో ప్లాసీ రణక్షేత్రంలో జరిగిన యుద్ధంలో సిరాజ్ ఉద్దౌలా ఓడిపోయి వధించబడ్డాడు. నవాబు సైన్యాన్ని నడిపిన కుట్రదార్లు, మీర్‌జాఫర్, రాయ్‌దుర్లబ్‌లు యుద్ధంలో పాల్గొనలేదు. మీర్ మదన్ మోహన్‌లాల్ అనే ఇద్దరు విశ్వాసపాత్రులైన యోధుల నాయకత్వంలో కొద్దిమంది నవాబు సైనికులు ధైర్య సాహసాలతో పోరాడారు. ప్లాసీయుద్ధం ముగియడంతో 'భారత దేశానికి అంతమెరుగని విషాద కాళరాత్రి దాపురించింది' అని బెంగాలీ కవి నబీన్ చంద్రసేన్ వర్ణించాడు. ఇంగ్లిషు వాళ్లు మీర్‌జాఫర్‌ను బెంగాల్ నవాబుగా ప్రకటించి, తమకు కట్నాలు, కానుకల కోసం ఎగబడ్డారు.

సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006



ఎండికోలు శాసనాలు

- చరిత్రను శోధిస్తే గొప్ప చారిత్రక సంపద మన తెలంగాణది. పౌరాణికపరంగా, చరిత్రపరంగా మెదక్ జిల్లా (నేటి సంగారెడ్డి జిల్లా) అందోల్ తాలూఖాలోని వెండికోలు గ్రామం చరిత్రలో చెప్పుకోదగినది. శాతవాహనుల కాలంలోనే కుండినాపురం, కొండాపురం (కుండలీపురం) వలె వెండికోలు సైతం పట్టణంగా విలసిల్లినది. ఇక్కడ ప్రాచీన శాసనాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖవారు 3, 4 శాసనాలను ముద్రించినారు. అయితే చరిత్రపరంగా ప్రాచీన శివాలయం (సిద్దేశ్వరాలయం) ఇక్కడ ఉన్నది. స్వయంభూః అని చరిత్ర సాక్ష్యం. ఈ ప్రాంతంలో విష్ణుకుండిన రాజులు, కళ్యాణి చాళుక్య రాజులు వేసిన శిలాశాసనాలు ఉన్నాయి. పౌరాణికపరంగా సుదర్శన దీక్షితులవారు కూడా దర్శించినారని చరిత్ర. 1. వెండికోలు, 2. కంకోలు, 3. రంజోలు, 4. యాజోలు ఇలా దాదాపు 16 (షోడశ) నామాలు కలిగిన గ్రామాలు కూడా ఉన్నట్లు చరిత్ర. ఇక్కడి వెండికోలు నందు మరో ప్రాచీన త్రికూటాలయం కూడా ఉన్నది. కన్నడ, తెలుగు, సంస్కృత శిలాశాసనాలు, ఒక తాళపత్ర గ్రంథము ఉన్నాయి. ఇక్కడి దాన శాసనాల్లో దేవాలయ మాణ్యం వసుంధరాం (భూమి) దానంగా ఇచ్చినట్టు చరిత్ర తెలుపుతున్నది. ఒకప్పుడు ఇక్కడ సంస్కృత పండితుల కుటుంబాలు ఉన్నట్టు చరిత్ర. కాలక్రమేణ ఆ కుటుంబాలు వలస వెళ్లినాయి. 879 శకనామ సంవత్సర ప్రభవ విశాఖ-సోమవారం 15 ఏప్రిల్ 967 ఏడీ శాసనం మన కన్నులకు స్పష్టంగా కనబడుతున్నది. పూర్తి శాసనచరిత్ర విపులంగా త్వరలో రానున్నది. విగ్రహాలు, కాలభైరవ స్థూపం అక్కడి దేవాలయ ప్రాచీన గోడలలో నిక్షిప్తమై ఉన్నాయి.

1వ శాసనం


1. స్వస్తి శకనృప కాళాతీత సంవత్సర గళెణ్డు
2. ....నెయప్రభవ సంవత్సర ప్రవర్త్తి
3. సెత ద్వరి షా భ్యన్తరద వైశాఖ సుద్ధత
4. దిగె సుక్ర వార దొళు కాసుగుళ
5. బిజ్జరస రెణ్డి కొలద ఆదిత్య దేవగ్గెఘడు
6. వాళ బిబ్బయ్య ఆయ్చణ గావుణ్డ రేవణ
7. గావుణ్డం బంక రేవణ గావుణ్డ బ్రభుం-----
8. బిబ్బయ్య ఇంతి అయ్వరుం ప్రాత్థి సిదె -----
9. దిం--- ఆదిత్య దేవగ్గె బిజ్జయర
10. స కొట్ట కరియ కెయ్నేల మ
11. త్త పన్నెరడు అదక్కె సిద్ధాయ ధర
12. ణిం కెయ్యూదొళ్---- బణ్ణి య భతి
13. ర రి ళ్ల బణరసి ప్రయాగె

2వ శాసనం

1. స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ
2. ప్రిథ్వీ వల్లభ మహారాజాధి రాజ ప
3. రమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయ
4. కుళతిళక న(0) కళ క చరితశ్రీమ
5. ది తివ బెడె(0) గె దేవర రావుల కొ
6. ళె బిడినోళ్ రాజ్యం గెయ్యుత్తిరె స్వ
7. స్తి సమధిగత ప(0) - మహా శ
8. బ్ద మహాసామస్త నభినవ కణ్న
9. నహతన వజ్ర సుభట రాది
10. త్యం శ్రీమత్ గ(0) గయ్య రసర్
11. శకవష 3........ నె(య) పరాభవ
12. సంవత్సరద ఆశ్వయుజ శు
13. ద్ధ బిదిగె బృహస్పతి వార
14. దందు థుళాసంక్రాన్తి యోళ్ చె
15. శ్వ జేల తీత్థ ధీ రామేశ్వర
16. దేవర వున్దె సోమ జినాల

రెండో వైపు

17. య దోళ్ శ్రీ బాళ చన్ద్ర
18. పణ్డిత భట్టక్కె వి
19. న కాల(0) కళ్చి ధా
20. రా పూవ్వక సోమ
21. య్య రసగె ధమ్మ
22. భి వృద్ధి యాగె వె
23. ణ్డ కొళద ఎళవ
24. లళకెయ్య యోళ్
25. ద్ధ మ కొట్టర్ సామ
26. న్యాయం ధమ్మ సేతు
27. నృపాణాం కాళేకాళే
28. పాళనీయో భవద్భి
29. సవ్వా నేతాన్భావి నత్వా
30. త్థి వేన్ద్రా న్భూ యో భూ
31. యో యాచతే రామ
32. చంద్ర





3వ శాసనం

1. స్వస్తి సమస్త భువవాశ్రయ శ్రీ
2. పృత్వీ వల్లభమహారాజాధిరాజప
3. (ర)మేశ్వర పరమ భట్టారక సత్యాశ్రయ
4. కుళ తిళక వకళంక చరితశ్రీమ
5. దిటివ బెడెంగె దేవరరావుళ కొ(ళె)
6. నె(లి) వీడినోళ్ రాజ్యం గెయ్యుత్తిరె స్వ
7. స్తి సమధి గత పఞ్చ మహాశ
8. బ్ద మహాసామన్త నభినవ కణ్ణ
9. నహితన వజ్ర సుభటరాది
10. త్యశ్రీమత్ గ(0) గయ్యరసర్
11. శకవష..... 3...... నె(య) పరాభవ
12. సంవత్సరద ఆశ్వయుజ శు
13. ద్ధ బిదెగె బృ హస్పతివార
14. దందు తుళాసంక్రాన్తి యోళ్ వె
15. లూటెల తీర్థద రామేశ్వర
16. దేవర వుణ్డె సోమజినాల
17. యద విమళ చన్ద్ర
18. పణ్డిత బట్టా(ర)క
19. రకాలం కచ్చి ధా
20. రా పూవ్వకం సోమ
21. య్యరసంగె ధమా ()
22. భివృద్ధి యాగె ఎ
23. ణ్డికోళద ఎళెవ
24. లద కెయ్యల అ
25. ద్ధ మ కోట్టర్ సామా
26. న్యాయం ధమ్మ సేతూ
27. నృపాళం కాళే కాళే
28. పాళనీయో భవద్భిః
29. సవ్వానేతా న్భావిన ఞ్పా
30. త్థివేన్ద్రా న్భూ యోభూ
31. యో యాచతే రామ
32. చంద్ర

4వ శాసనం

1. స్వస్తి సమస్త భువ
2. నాశ్రయ శ్రీ పృధ్వీవ
3. ల్లభ మహా రాజాధి
4. రాజ పరమేశ్వర
5. పరమ భట్టారకం
6. సత్యాశ్రయ కుళ
7. తిళక నకళంక
8. చరిత శ్రీమది
9. టివ బెడెంగ దే
10. వర సుఖ సన్త
11. థా వినోదది రాజ్యం
12. గెయ్యుత్తిరెడి బై
13. నూఱ ఇప్ప త్తోంబ
14. త్త నెయ ప్లవంగ
15. సంవచ్చరద మా
16. ఘ మాసద సుద్ధ
17. పక్షద పఞ్చ
18. మియు బృ(హ)స్పతి
19. వారం కోలాణ్డి
20. నక్షత్ర దన్దు ఎ
21. ణ్డి కోళద

రెండోవైపు

22. నామయ్య సెట్టియ
23. బసదిగె నారాయ
24. ణ్ణను అతన పె
25. ణ్ణతి ఇరుగల్లె
26. యు అరసరపు
27. రవరి యోళగె
28. నూఱ ఇప్పత్తు
29. .... మత్తకెయ్య
30. బన్దమతి కన్ది
31. యర కాలం కచ్చి
32. కోట్ట సామాన్యా
33. యం ధమ్మ సేతు
34. నృపాణాం కాళే

మూడోవైపు

35. కాళే పాళనీయో
36. భవద్భిః సవ్వా నే
37. తాన్భవిన ఞ్పా
38. త్థి। వేన్ద్రా న్భూయో
39. భూయో యాచ
40. తె రామభద్రః

5వ శాసనం

1. స్వస్తి సమస్త (భు)
2. వ నాశ్రయశ్రీ
3. ప్రి ధ్వీ వల్లభ మ
4. హ రాజాధి రాజ
5. పరమేశ్వర పర
6. మ భట్టారక (0) సత్యా
7. శ్రయ కుళతి (ళ)
8. క నకళంక చ
9. రిత శ్రీమది
10. టివ బెతుంగ దే
11. వర రావుళ కొ
12. ళ బిడినూళ్ స
13. నగెయ్యు రాజ్యం
14. గెయ్యుత్తి రె
15. స్వస్తి సమధిగత
16. పంచ మహాశబ్ద
17. మహా సామన్త (మ)
18. హా మణ్డ (ళి)క(సు)భ(ట)
19. వైరి నారాయణ (0)
20. పతి హితా చరిత - - - -
21. గో మాళవ ధూ

రెండోవైపు

22. మకేత శ్రీమతు బిజ్జ
23. య్య సరసర్ శక వ
24. ష నెయ పరాభవ
25. సంవత్సరద పుష్యమా
26. సద సుద్ధ బిదిగెయు మ(౦)
27. గాళవార నుత్తరాయణ
28. ద సంక్రాన్తి యోళెణ్డి కొళ
29. ద మన్నెరస గెయ్యళుగె
30. సోమ జినాలయక్కె వి
31. మళ చన్ద్ర ఫణ్డతర
32. కాలం కచ్చి రాజమాన
33. మత్తం గెయ్య ధారా పూర్వ
34. కం కొట్టర్ ......

మూడో వైపు

35. ---------
36. సామాన్యోయ ధ
37. మ్మ సేతు న్నృ పాణా(0)
38. కాళే కాళే పాళ
39. నీయో భవద్భిః
40. సవ్వా నేతాన్భా
41. విన ఞ్పాత్థి వేం
42. ద్రా న్భూయో భూ
43. యో యాచతే
44. రామ చంద్ర

ముత్తాయి కోట శాసనం

- ముత్తాయి కోట సిద్దేశ్వరాలయానికి కొంత భూమిని (మాణ్యాన్ని) సుగుణమ్మ అనే భక్తురాలు దానంగా ఇచ్చిన చిన్న శిలాశాసనం. స్వస్తిశ్రీ హేవలంబి నామ సం।। (18వ శతాబ్దం)లో సుగుణమ్మ అనే భక్తురాలు శంకరంపేట నందు ఈ దేవాలయం సముదాయానికి కొంత వసుంధరాంను (భూమిని సర్వే నం 332తో) ఇచ్చినట్టుగా దాన శాసనం తెలుపుతున్నది. భూమిలో పండే ధాన్యాన్ని పూజారులు (సిద్దేశ్వరునికు ప్రతిరోజు ధూప, దీప, నైవేద్యాలను సమర్పిస్తూ) శాశ్వతంగా అనుభవించాల్సిందిగా ఈ శాసనం తెలియజేసింది.

భారత్ భాషాభూషణ్, విద్వాన్‌మణి
డా. కావూరి శ్రీనివాస్
కవి, చరిత్ర పరిశోధకుడు
తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ
హైదరాబాద్
9849 776 157



దర్శకుడికి తొలి ప్రేక్షకుడిని నేనే -చిరంజీవి


థామస్‌రెడ్డి, అశోక్, సుకుమార్, చిరంజీవి, హరి ప్రసాద్, విజయ్‌కుమార్

ప్రముఖ దర్శకుడు సుకుమార్ సినిమాల్లో అడుగుపెట్టకముందు చిరంజీవి సినిమా మొదటిరోజు తొలి ఆట టికెట్ కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. తాజాగా ఆయన నిర్మించిన 'దర్శకుడు' చిత్రానికి చిరంజీవి తొలి ప్రేక్షకుడిగా మారారు. సుకుమార్ రైటింగ్స్ పతాకంపై బీఎన్‌సీఎస్‌పీ విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి, ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలిసి సుకుమార్ నిర్మిస్తున్న చిత్రం 'దర్శకుడు'. అశోక్, ఇషా జంటగా నటిస్తున్నారు. హరి ప్రసాద్ జక్కా దర్శకుడు. ఈ నెల 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర తొలి టికెట్‌ను చిరంజీవి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడిగా సుకుమార్ ఉన్నత స్థానంలో ఉన్నారు. తనకున్న సమయాన్ని మంచి కథల కోసం ఉపయోగిస్తూ కమర్షియల్‌గా పేరును, డబ్బును సంపాదించుకోవచ్చు. తన స్వార్థం చూసుకోకుండా ఇండస్ట్రీకి నేనేం చేయాలి అనే కోణం నుంచి ఆలోచిస్తూ ప్రతిభావంతులైన నవతరం దర్శకులు, నటీనటులకు అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించే ఉద్దేశ్యంతో సుకుమార్ రైటింగ్స్ సంస్థను స్థాపించడం అభినందనీయం. తెరవెనుక దర్శకుడు ఏం చేస్తాడు? అతడిలో ఎన్ని కోణాలు ఉంటాయి? దర్శకుడిలో ఉండే వైవిధ్యాలు, భావోద్వేగాలను సినిమాలో హరి ప్రసాద్ చక్కగా చూపించారని అనుకుంటున్నాను. హరిప్రసాద్ చెప్పిన కథను నమ్మి అతడికి పూర్తిస్వేచ్ఛనిస్తూ సుకుమార్ ఈ సినిమాను చేయించుకున్నారు. ప్రేమకథలతో సినిమాలు చేయడమే కాదు దర్శకుల జీవితాల్లో కూడా ప్రేమ ఉంటుందని నిరూపించే చిత్రమిది. ఇందులో సుకుమార్ జీవితానికి సంబంధించిన అంశమేదో కనెక్ట్ అయివుంటుంది. అందుకే ఈ సినిమాను బాగా తీర్చిదిద్దారని అనుకుంటున్నాను. ఈ సినిమాకు తొలి ప్రేక్షకుడిని నేనే కావడం కొత్తగా, ఆనందంగా ఉన్నది. 'కుమారి 21ఎఫ్' కంటే ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు,మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

ఘనంగా ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్‌మోహన్‌రావు కుమార్తె వివాహం

తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) చైర్మన్ పుస్కూర్ రామ్‌మోహన్‌రావు-రేణుకరావుల కుమార్తె దేదీప్య వివాహం విష్ణుచరణ్‌తో బుధవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్‌రావు, రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, కే.కేశవరావు, జి.వివేక్, వినోద్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, యాదవరెడ్డి సినీ ప్రముఖులు కృష్ణ, సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, నితిన్, అల్లు అరవింద్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కె. మురళీమోహన్ రావు, బీవీఎస్‌ఎన్ ప్రసాద్, సి.కల్యాణ్, ఆర్.నారాయణమూర్తి, వి.వి. వినాయక్, జెమిని కిరణ్, సానాయాదిరెడ్డి, బెల్లంకొండ సురేష్‌తో పాటు పలువురు సినీ రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



సూర్య మొదలుపెట్టాడు!


అల్లు అర్జున్

'డీజే దువ్వాడ జగన్నాథం' విజయంతో దిగ్విజీకృత ఉత్సాహంతో ఉన్న అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని మొదలుపెట్టారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా, శ్రీధర్ నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకుడు. నాగబాబు సమర్పకుడు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'బన్నీ ఎనర్జీకి తగ్గ కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. ఇందులో ఆయన మిలటరీ అధికారిగా కనిపించబోతున్నారు. నటుడిగా ఆయన్ని కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది. వాణిజ్య హంగులకు సందేశాన్ని మేళవిస్తూ దర్శకుడు వక్కంతం వంశీ చక్కటి కథను సిద్ధం చేశారు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2018 ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. అర్జున్, శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, సమర్పణ: నాగబాబు, సహనిర్మాత: బన్నీవాసు.

ఉయ్యాలవాడలో అమితాబ్?



స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కనున్నది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మించనున్నారు. ఈ చిత్రంలో ని కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ నటించనున్నట్లు తెలిసింది. ఇటీవలే ఆయన్ని చిత్రబృందం కలిసి కథ వినిపించినట్లు సమాచారం. కథ, పాత్ర చిత్రణ నచ్చడంతో ఆయన ఈ సినిమాలో నటించడానికి సముఖతను వ్యక్తం చేసినట్లు తెలిసింది. నయనతారను కథానాయికగా నటించనున్నట్లు సమాచారం. ఈ నెలలోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ సినిమాకు 'మహావీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.









అనుబంధాన్ని కలిపిన 'ఆధార్'

3 మానసిక వికలాంగుడిని కుటుంబం చెంతకు చేర్చిన వైనం



న్యూఢిల్లీ, ఆగస్టు 2: భారత విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్) ఓ మానసిక వికలాంగుడిని తన కుటుంబసభ్యులతో కలిపేందుకు సాయపడింది. రెండేండ్ల కింద కనిపించకుండా పోయిన కుమారుడి ఆచూకీ తెలియడంతో ఆ కుటుంబసభ్యులు తెగ సంబరపడిపోతున్నారు. హర్యానాలోని పానిపట్‌కు చెందిన గౌరవ్ ఏడేండ్ల వయస్సు ఉన్నప్పుడు ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయాడు. ఢిల్లీలోని సలామ్ బాలక్ శిశు సంరక్షణ కేంద్రం అతనికి ఆశ్రయం కల్పించింది. ఇటీవల ఆ కేంద్రంలో ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టారు. అయితే గౌరవ్ వేలిముద్రలు ఆధార్‌లో ఎంతకూ నమోదుకాలేదు. ఇదివరకే రిజిస్టర్ చేసుకున్నాడని సమాచారం వచ్చింది. దీంతో అతడి బయోమెట్రిక్ వివరాలను పరిశీలించగా హర్యానాలోని పానిపట్‌లోని అతని తల్లిదండ్రులతో సరిపోయాయి. దీంతో వారిని సోమవారం ఢిల్లీకి పిలిపించి గౌరవ్‌ను అప్పగించారు. రెండేండ్ల తర్వాత తమ పెద్ద కొడుకు ఆచూకీ లభించడంపై తండ్రి వికాస్ ఆనందం వ్యక్తంచేశారు. 2015లో పానిపట్‌లోని ఇంటి సమీపంలో గౌరవ్ కనిపించకుండాపోయాడని ఆయన తెలిపారు. పరిసరాల్లో వెతికి.. చివరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. టీవీలో, పేపర్లలో ప్రకటనలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. కానీ తమ కొడుకు ఆచూకీ లభిస్తుందని విశ్వసించామని, ఆధార్ తమను ఒక్కటి చేసిందని ఆయన ఆనందంగా చెప్పారు.

నో డిటెన్షన్ విధానం రద్దు

3 ఎన్ఆర్ఐల పరోక్ష ఓటింగ్‌కు ఆమోదం 3 కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: పాఠశాలల్లో 8వ తరగతి వరకు ప్రస్తుతమున్న నో-డిటెన్షన్ విధానం రద్దుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో 20 ప్రపంచస్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనుమతి మంజూరు చేసింది. అలాగే విదేశాల్లోని భారతీయులకు ప్రాక్సీ ఓటింగ్‌కు అనుమతించాలన్న ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు జరిగాయి. నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయడం వల్ల ఇక మీదట 5, 8వ తరగతుల విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయితే వారిని ఆ పై తరగతికి ప్రమోట్ చేయరు. అయితే ఆ విద్యార్థులకు మరోసారి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు సవరణ బిల్లులో ఒక నిబంధనను చేర్చనున్నారు. ఈ బిల్లును ఆమోదం కోసం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులను డిటెన్షన్ లేకుండా 8వ తరగతి వరకు ఆటోమేటిక్‌గా ప్రమోట్ అవుతారు. 2010లో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టంలోని కీలక అంశాలలో ఇది ఒకటి. ఇదిలా ఉండగా, ఎన్నికల చట్టాలను సవరించడం ద్వారా విదేశాల్లో ఉన్న భారతీయులకు ప్రాక్సీ ఓటింగ్(తమ ప్రతినిధి ద్వారా ఓటు వేయడం) అనుమతించాలన్న ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన ప్రకారం ఎన్ఆర్ఐలు లేదా విదేశాల్లో ఉన్న భారతీయులు తాము రిజిస్టర్ చేసుకున్న నియోజకవర్గాల్లో ఓటు వేయవచ్చు. అలాగే తమ ప్రతినిధి ద్వారా కూడా ఓటు వేసే అవకాశం వారికి కల్పించనున్నారు. ఈ సదుపాయం ప్రస్తుతం సైనిక సిబ్బందికి మాత్రమే ఉన్నది.



త్వరలో పదవీ విరమణ చేయనున్న ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ గౌరవార్థం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ బుధవారం విందు ఇచ్చారు. ఈ సందర్భంగా అన్సారీ దంపతులకు ఒక చిత్రాన్ని బహుకరించారు. విందుకు ప్రధాని మోదీ కూడా హాజరయ్యారు.

పార్లమెంట్‌కో బాక్స్



రాజ్యసభలో వెల్‌లోకి వచ్చి ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

ఐటీ దాడులపై కాంగ్రెస్ ధ్వజం

3 రాజ్యసభ వాయిదా.. లోక్‌సభలో కాంగ్రెస్ వాకౌట్

3 ఎమ్మెల్యేలను భయపెట్టేందుకే కేంద్రబలగాలను పంపారన్న కాంగ్రెస్


3 ఎన్నికలకు, ఐటీ దాడులకు సంబంధం లేదన్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 2: కర్ణాటక మంత్రి ఇంటి మీద ఆదాయపన్నుశాఖ దాడులు జరుపడంపై ప్రతిపక్షం ఆందోళనకు దిగడంతో బుధవారం పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి. రాజ్యసభ నాలుగుసార్లు వాయిదా పడగా, లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. రాజకీయ కుట్రతోనే తమ పార్టీకి చెందిన మంత్రి ఇంటిపై దాడులు జరిపారని కాంగ్రెస్ ఆరోపించగా, అటువంటిదేమీ లేదని అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. కర్ణాటకలో ఉన్న 44 మంది గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అవసరమైన ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న మంత్రి ఇంటిపై ఐటీ దాడులు జరుగడం యాదృచ్ఛికం కాదని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్‌శర్మ ధ్వజమెత్తారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటువేసేలా ప్రలోభపెడుతున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ తమ పార్టీకి చెందిన 44 మంది ఎమ్మెల్యేలను బెంగళూరులోని ఒక రిసార్ట్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. వారికి ఇన్‌చార్జిగా కర్ణాటక విద్యుత్ శాఖ మంత్రి డీకే శివకుమార్‌ను నియమించారు. అయితే బుధవారం ఉదయం శివకుమార్‌కు చెందిన ఇండ్లు, ఆస్తులపై ఐటీదాడులు జరిగాయి. దీనిపై కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో ధ్వజమెత్తుతూ తమ పార్టీని, నాయకులను లక్ష్యంగా చేసుకొనేందుకు ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు. ఈ దాడుల్లో రాజకీయ దురుద్దేశమేదీ లేదని కేంద్ర మంత్రి జైట్లీ ఉభయ సభల్లోనూ పేర్కొన్నారు. శివకుమార్ ఆస్తుల నుంచి ఐటీ అధికారులు రూ.10 కోట్లు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీలు ఈ వివరణలేవీ పట్టించుకోలేదు. మంత్రి లక్ష్యంగా దాడులు జరిపిన ఐటీ అధికారులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉంచిన రిసార్ట్ వద్దకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. దీనికి జైట్లీ సమాధానమిస్తూ 'మీ ఎమ్మెల్యేలను ఉంచిన రిసార్ట్‌కు సదరు మంత్రి వెళ్లారు. తాము రికవరీ చేసిన దానిని ఆయనకు చూపించేందుకు ఐటీ అధికారులు అక్కడికి వెళ్లారు. ఆ మంత్రి కొన్ని కాగితాలను చించివేశారు. మేము ఆ కాగితాలను సేకరించి పంచనామా జరిపించాం. అక్కడున్న మీ ఎమ్మెల్యేలనెవరినీ తనిఖీ చేయలేదు. ఆ తరువాత మంత్రి శివకుమార్‌ను రిసార్ట్ నుంచి ఆయన ఇంటికి తీసుకెళ్లారు' అని చెప్పారు.

సర్కారుది నియంతృత్వ ధోరణి

ప్రశ్నోత్తరాల సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కపిల్ సిబల్ మాట్లాడుతూ, ప్రభుత్వం నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తున్నదని అన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు ఎమ్మెల్యేలు నివాసం ఉన్న ప్రదేశానికి వెళ్లి వారిని భయపెట్టడం ఇంతకుముందెన్నడూ జరుగలేదని చెప్పారు. లోక్‌సభలో కర్ణాటక అంశాన్ని కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేవనెత్తారు. ఎమ్మెల్యేలను భయపెట్టి, బెదిరించరాదని ప్రభుత్వానికి ఖర్గే విజ్ఞప్తి చేశారు. రేపు ఇదే పరిస్థితిని మీరు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

త్వరలో శరద్‌యాదవ్ కొత్త పార్టీ!



న్యూఢిల్లీ/ పాట్నా, ఆగస్టు 2: జేడీయూ నాయకుడు శరద్‌యాదవ్ కొత్త పార్టీ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల బీహార్‌లో సీఎం నితీశ్‌కుమార్ ఆధ్వర్యంలోని జేడీయూ మహాకూటమి నుంచి విడిపోయి బీజేపీతో జతకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న జేడీయూ నేత శరద్‌యాదవ్ బుధవారం పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. పార్టీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. నితీశ్‌కుమార్ వ్యవహరించిన తీరు సరిగా లేదని శరద్‌యాదవ్ పేర్కొన్నట్లు తెలిసింది. కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో శరద్‌యాదవ్ ఉన్నారని ఆయన సన్నిహితుడొకరు తెలిపారు. త్వరలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు ముగియగానే శరద్‌యాదవ్ బీహార్‌కు వెళ్తారని, పలువురితో సమావేశమైన తర్వాత ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తారని పేర్కొన్నారు.

ప్రగతికి అవరోధం అవినీతి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: రాజ్యవ్యవస్థలోని కీలక రంగాల్లోకి అవినీతి రెక్కలు విస్తరిస్తున్నాయని, ఇది దేశ ప్రగతికి అవరోధంగా మారుతుందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అధికార యంత్రాంగాన్ని అవినీతి బలహీనపరుస్తుందని పేర్కొన్నది. రెండు దశాబ్దాల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వద్ద భూ కేటాయింపుల కుంభకోణం కేసు విచారణపై జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్ బానుమతి సారథ్యంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అవినీతిని నిరోధించేందుకు శాసన సంస్కరణలు, కఠినమైన చట్టపరమైన చర్యలు చేపట్టడంతోనే సరిపోదని, ప్రభుత్వాలు నిరంతరం చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

కర్ణాటక మంత్రి ఆస్తులపై ఐటీ పంజా

- ఢిల్లీ, కర్ణాటకలోని 64 ప్రాంతాల్లో మంత్రి శివకుమార్ ఆస్తులపై దాడులు

3 రూ.11 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం

3 ఇది రాజకీయ కుట్ర: కాంగ్రెస్

3 ఆదాయం పన్ను వ్యవహారమే: ఐటీ అధికారులు

న్యూఢిల్లీ/బెంగళూరు, ఆగస్టు 2: కర్ణాటక విద్యుత్‌శాఖ మంత్రి డీకే శివకుమార్‌కు చెందిన ఆస్తులపై ఆదాయం పన్ను విభాగం విరుచుకుపడింది. ఢిల్లీ, కర్ణాటకలోని 64 ప్రాంతాల్లో ఆయనకు, ఆయన బంధుమిత్రులకు సంబంధించిన ఇండ్లలో ఐటీ అధికారులు బుధవారం మూకుమ్మడిగా తనిఖీలు చేసి దాదాపు రూ.11 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని ఈగల్టన్ రిసార్టులో ఉన్న ఆయనను ఈ కేసులో విచారణ కోసం తమతోపాటు వెంటనే బెంగళూరులోని ఆయన నివాసానికి తీసుకువెళ్లారు. 120 మంది అధికారులు సీఆర్పీఎఫ్ బలగాలను వెంటతీసుకుని ఆ రిసార్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఈగిల్టన్ గోల్ఫ్ రిసార్టులో మకాం చేసిన 44 మంది గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల శిబిరం నిర్వహణను పార్టీ అధిష్ఠానం శివకుమార్‌కు అప్పగించింది. గుజరాత్ ఎమ్మెల్యేలతోపాటు శివకుమార్ అక్కడే ఉన్నారు. ఈ తరుణంలో ఆయన ఆస్తులపై ఐటీ దాడులు జరుగడం, ఆయనను ఐటీ అధికారులు తీసుకువెళ్లడంతో రాజకీయంగా దుమారం చెలరేగింది. తమ దాడుల వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని ఐటీశాఖ స్పష్టం చేసింది. ఆదాయంపన్ను ఎగవేత కేసుకు సంబంధించి ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఐటీ అధికారులు తెలిపారు. ఇది ఇదివరకే నిర్ణయించుకున్న కార్యక్రమమని, తమ దాడులకు, కాంగ్రెస్ ఎమ్మెల్యే శిబిరానికి ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. ఐటీ దాడుల్లో భాగంగా బెంగళూరులోని ఒక కాలేజీలో ఉన్న ఒక అధ్యాపకుని లాకర్ నుంచి పెద్ద మొత్తంలో ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంత్రి శివకుమార్ బంధువు పేరున ఆ లాకర్ ఉన్నట్లు ఐటీ అధికారులు పేర్కొన్నారు. శివకుమార్‌కు సంబంధించి బుధవారం ఢిల్లీలో రూ.7.9 కోట్లు, కర్ణాటకలో రూ.2.23 కోట్ల నగదు దొరికింది. ఈ నోట్లను లెక్కించడానికి ఢిల్లీ, మైసూరుల నుంచి ఆరు నోట్ల లెక్కింపు యంత్రాలను తెప్పించారు. శివకుమార్‌కు భారీగా ఆస్తులున్నాయని, రియల్ ఎస్టేట్ రంగంలో ఆయన బినామీ పెట్టుబడులు పెట్టి, ఆ లెక్కలు చూపకుండా ఆదాయం పన్ను ఎగవేసినట్లు ఐటీ అధికారులు తెలిపారు. సింగపూర్ తదితర దేశాల్లో కూడా ఆయనకు పెట్టుబడులున్నాయన్న విషయం పరిశీలిస్తున్నామన్నారు. మంగళవారం రాత్రి శివకుమార్ ఢిల్లీ నుంచి కర్ణాటక రిసార్టుకు వచ్చారు. బుధవారం ఉదయం ఆయనను ఐటీ అధికారులు బెంగళూరుకు తీసుకువెళ్లారు. సీనియర్ కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలే ఓట్లు వేయనున్నారు. ఈ సమయంలో పార్టీ నుంచి మరిన్ని ఫిరాయింపులు జరుగకుండా నిరోధించడానికి కాంగ్రెస్ అధిష్ఠానం 44 మంది ఎమ్మెల్యేలను కర్ణాటకలోని ఈగల్టన్ రిసార్టుకు తరలించింది. కాంగ్రెస్‌లో ఎలాంటి సంక్షోభం వచ్చినా పరిష్కరిస్తారన్న పేరున్న కర్ణాటక మంత్రి శివకుమార్‌కు ఆ శిబిర నిర్వహణ బాధ్యతను అప్పగించింది.





బెంగళూరులోని తన ఇంటిముందు నిలుచున్న కర్ణాటక మంత్రి శివకుమార్
నోట్ల లెక్కింపు యంత్రంతో ఢిల్లీలోని శివకుమార్ ఇంట్లోకి వెళుతున్న ఐటీ అధికారులు

ఇది బీజేపీ కుట్ర: అహ్మద్ పటేల్

గుజరాత్ నుంచి రాజ్యసభలో ఉన్న మూడు సీట్లను తానే గెలుచుకోవాలన్న ఉద్దేశంతో బీజేపీ తమ ఎమ్మెల్యేల వెంటపడిందని అహ్మద్ పటేల్ ఆరోపించారు. తమ పార్టీ వారిని ఇబ్బందుల పాలు చేయడానికే వివిధ విభాగాల అధికార యంత్రాంగాన్ని బీజేపీ వినియోగించుకుంటున్నదని, అందులో భాగంగానే ఇప్పుడు శివకుమార్‌పై ఐటీ దాడులు చేయించిందని ఆయన ట్వీట్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కుట్రల కోసం ఐటీ విభాగాన్ని కూడా వినియోగించుకుంటున్నదని కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆరోపించారు.

శివకుమార్‌కు 250 కోట్ల ఆస్తులు!

బెంగళూరు, ఆగస్టు 2: కర్ణాటక విద్యుత్‌శాఖ మంత్రి డీకే శివకుమార్(55) దేశంలోని బాగా ధనవంతులైన మంత్రుల్లో ఒకరు. ఆయనకు దాదాపు రూ.250 కోట్ల ఆస్తులున్నట్లు అంచనా. బెంగళూరులో ఆయనకు రాజభవనం వంటి పెద్ద బంగళా ఉంది. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఇటీవల బెంగళూరు వచ్చినపుడు ఆ భవనం చూసి ఆశ్చర్యపోయారు. కర్ణాటకలో కాంగ్రెస్‌పార్టీకి కావలసిన నిధులను ఆయన సమకూర్చుతారన్న ప్రచారం ఉంది. కర్ణాటకలో బలమైన ఒక్కళిగ వర్గానికి చెందిన శివకుమార్ రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన నేత. కనకపుర ఎమ్మెల్యేగా ఉన్నారు. డీకేఎస్ అని, డీకేశి అని ఆయనను పిలుస్తారు. ఇటీవల ఆయనకు ప్రమోషన్ ఇచ్చి హోంశాఖను అప్పగించనున్నారన్న చర్చ జరిగింది. అంతకుముందు సీఎం పదవికి కూడా ఆయన పేరు పరిశీలనకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. రెండు నెలల క్రితం కర్ణాటక పీసీసీ పదవికి శివకుమార్ పోటీ పడ్డారు. ఆయన మద్దతుతో సినీనటి రమ్య లోక్‌సభ ఉప ఎన్నికలో గెలిచారు.

బేషరతుగా ఉపసంహరించుకోండి

3 చైనా-భూటాన్ సరిహద్దు అంశంలో భారత్ జోక్యం అవసరం లేదు

3 దోవల్, యాంగ్‌జీచీ భేటీ వివరాలను వెల్లడించిన చైనా

బీజింగ్, ఆగస్టు 2: సిక్కింలోని డోక్లాం ప్రాంతంలో మోహరించిన భారత బలగాలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని చైనా పేర్కొంది. నిర్మాణాత్మక చర్యలతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. గతనెల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా భద్రతా సలహాదారు యాంగ్ జీచీ మధ్య జరిగిన భేటీ అంశాలను చైనా విదేశీ మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. బ్రిక్స్ సహకారం, ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై ఇరుదేశాల అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారని పేర్కొన్నది. భారత బలగాల చొరబాటుపై చైనా కోపంగా ఉన్నదని యాంగ్ పేర్కొన్నట్టు తెలిపింది.



డోక్లాంలో భారత సైనికులు (ఫైల్)

సరిహద్దు చొరబాట్ల విషయంలో జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని స్పష్టంచేసింది. చైనా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను, సంబంధాలను గౌరవించి చొరబాటుకు పాల్పడ్డ బలగాలను, ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే భారత్ వెనుకకు తీసుకెళ్లాలని యాంగ్ కోరినట్టు వివరించింది. డోక్లాం ప్రతిష్టంభనపై జూన్‌నుంచి ఇప్పటివరకు నెలకొన్న అంశాలకు సంబంధించిన మ్యాప్‌లను, ఇతర వివరాలను జోడించి తయారుచేసిన 15 పేజీల వాస్తవ నివేదికను చైనా విదేశీ మంత్రిత్వశాఖ వెల్లడించింది. డోక్లాం ప్రాంతంలో భారత బలగాలు సరిహద్దును దాటి లోపలికి ప్రవేశించడం అనేది తీవ్రమైన ఘటన అని, ఇలాంటి వాటిని చైనా అంగీకరించదని స్పష్టంచేసింది. చైనా-భూటాన్ సరిహద్దు అంశం తమ రెండు దేశాలకు సంబంధించినదని, ఇందులో భారత్ చేసేందుకు ఏమీలేదని తెలిపింది.

డోక్లాంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు: భారత్

సిక్కింలోని డోక్లాం ప్రాంతంలో మోహరించిన సైనిక బలగాలను తగ్గించలేదని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని భారత్ స్పష్టంచేసింది. దోవల్, యాంగ్ జీచీ భేటీ వివరాలతో చైనా విదేశీమంత్రిత్వశాఖ నివేదిక విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు ఈమేరకు స్పందించారు. డోక్లాం ప్రాంతంలో 400మందికిపైగా సైనికులను మోహరించినట్టు తెలిపారు. సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులుంటేనే ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు ముందుకెళతాయని స్పష్టం చేశారు.

'జలయుద్ధం'లో పాక్‌పై విజయం

3 జీలం, చీనాబ్ నదులపై జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించేందుకు భారత్‌కు అనుమతి

3 ముగిసిన మొదటిదశ భారత్-పాక్ చర్చలు

వాషింగ్టన్, ఆగస్టు 2: సింధూ నదికి ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై తలపెట్టిన కిషన్‌గంగ, రాట్లె జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్‌కు అనుమతి లభించినట్లు ప్రపంచబ్యాంకు ప్రకటించింది. సింధు జలాల ఒప్పందం-1960కి లోబడి నిర్మాణాలు చేపట్టడానికి భారత్, పాక్ అంగీకరించాయని ఇరుదేశాల మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన ప్రపంచబ్యాంకు తెలిపింది. దీంతోపాటు సెప్టెంబర్‌లో అమెరికాలోని వాషింగ్టన్‌లో మరోసారి సమావేశమై చర్చలు జరుపాలని ఇరుదేశాలు నిర్ణయించినట్లు వెల్లడించింది. భారత్-పాక్ మొదటి దఫా కార్యదర్శి స్థాయి చర్చలు ముగిసిన నేపథ్యంలో చర్చల సారాంశంపై ప్రపంచబ్యాంకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సింధూ జలాల వివాదంపై భారత్-పాక్ దేశాల మధ్య 1960లో సింధూ జలాల ఒప్పందం కుదిరింది. అప్పట్లో దీనికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వం వహించింది. ప్రస్తుతం కూడా ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. వాస్తవానికి భారత్ నిర్మించ తలపెట్టిన కిషన్‌గంగ (330 మెగావాట్లు), రాట్లె (850 మెగావాట్లు) ప్రాజెక్టులను పాకిస్థాన్ వ్యతిరేకిస్తున్నది. ఈ రెండు ప్రాజెక్టుల సాంకేతిక డిజైన్ల విషయంలో ఇరుదేశాల మధ్య ప్రతిష్ఠంభన నెలకొన్నది. సింధూ జల ఒప్పందం ప్రకారం పశ్చిమ దిశగా ప్రవహించే ఈ నదుల్లో జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే హక్కు తమకే ఉన్నదని పాక్ వాదిస్తున్నది. కాగా ఇతర ఉపయోగాల్లో భాగంగా జల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించేందుకు చర్చల ద్వారా భారత్‌కు అనుమతి లభించినట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది.

ఎంపీలూ మద్దతివ్వండి



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: మరో మూడు రోజుల్లో ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎలక్టోరల్ కాలేజీలో ఓటర్లుగా ఉన్న ఎంపీలందరూ తనకు మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేస్తూ ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడు ఎంపీలకు లేఖలు రాశారు. ప్రస్తుతం దేశం ఉగ్రవాదం, పేదరికం, వాతావరణ అసమతుల్యత, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వాటిని అధిగమించడానికి ఎంపీలందరూ సమిష్టి సహకారాన్ని అందించాలని, నవభారత్ నిర్మాణం దిశగా భుజం భుజం కలిపి నడువాలని కోరారు. ఉపరాష్ట్రపతిగా తాను ఎన్నికయితే ఆ పదవికి న్యాయం చేస్తానని, హుందాతనాన్ని కొనసాగిస్తానని, రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తానని తెలిపారు. సహకార సమాఖ్య స్ఫూర్తిపై తనకు ప్రగాఢమైన విశ్వాసం ఉన్నదని, పెద్దల సభకు చైర్మన్‌గా సభా కార్యక్రమాలను సజావుగా నడిపిస్తానన్నారు.

యూపీ మాజీ సీఎస్‌కు రెండేండ్ల జైలు



లక్నో, ఆగస్టు 2: నోయిడా భూ కేటాయింపు కేసులో ఉత్తరప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరాయాదవ్‌కు సుప్రీంకోర్టు రెండేండ్ల జైలు శిక్ష విధించింది. అలాగే మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్‌కుమార్‌కు కూడా రెండేండ్ల జైలు శిక్ష విధించింది. 1994-1995 మధ్య నోయిడాలో ప్లాట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారని పేర్కొంటూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అప్పట్లో నోయిడా అథారిటీకి సీఈవోగా పనిచేసిన నీరాయాదవ్, డిప్యూటీ సీఈవో రాజీవ్‌కుమార్ అక్రమాలకు పాల్పడ్డారని పిటిషన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదే కేసులో ఘజియాబాద్ సీబీఐ కోర్టు నిందితులకు మూడేండ్ల జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. దీంతో సుప్రీంకోర్టు నీరాయాదవ్, రాజీవ్‌కుమార్‌లకు రెండేండ్ల చొప్పున జైలుశిక్ష విధించింది.

రష్యాపై ఆంక్షల అమలుకు ఓకే

3 బిల్లుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం

వాషింగ్టన్, ఆగస్టు 2: రష్యాపై ఆంక్షలు విధిస్తూ కాంగ్రెస్, సెనేట్ ఆమోదించిన బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం సంతకం చేశారు. గత ఏడాది జరిగిన తమ దేశాధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్నదన్న ఆరోపణలతోపాటు ఉక్రెయిన్‌లోని క్రిమియా ద్వీపకల్పాన్ని ఆక్రమించిన నేపథ్యంలో రష్యాపై అమెరికా కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తున్నది. మీడియాకు దూరంగా అత్యంత రహస్యంగా బిల్లుపై ట్రంప్ సంతకం చేశారని వైట్‌హౌస్ వర్గాల కథనం.

ప్రేమ మత్తు.. ఉగ్రవాదులు చిత్తు

3 కశ్మీర్ ఉగ్రవాదులకు వ్యసనంగా ప్రేమాయణం

3 ప్రియురాళ్లను కలువడానికి వచ్చి హతమవుతున్న ముష్కరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: పాకిస్థాన్‌లోని పంజాబ్‌కు చెందిన పేద యువకులు ఉగ్రవాదులుగా మారడం.. అక్రమంగా కశ్మీర్‌లోకి ప్రవేశించడం.. అక్కడి యువతులను వలలో వేసుకోవడం.. అనంతరం తరుచుగా రాకపోకలు సాగిస్తూ భద్రతాబలగాల చేతుల్లో హతమవ్వడం.. పలువురు ఉగ్రవాదుల జీవితాలు ఈ విధంగా అంతమవుతున్నాయి. ముఖ్యంగా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 25 ఏండ్లలోపు వారే ఉండటంతో కశ్మీర్ యువతులతో ప్రేమాయణం సాగిస్తున్నారు. కొంత మంది ఉగ్రవాదులు ఒక్కొక్కరు నలుగురు, ఐదుగురు ప్రియురాళ్లను కలిగి ఉంటున్నారు. దీని ద్వారా కశ్మీర్ లోయలో ఉగ్రవాదులకు సులువుగా ఓ అడ్డా దొరుకుతుంది. దీనిని ఆసరాగా చేసుకొని ఉగ్రదాడులకు వ్యూహం పన్నుతున్నారు. ఇలాంటి కేసులు చాలానే ఉన్నాయి. మంగళవారం హతమైన లష్కరే తాయిబా అగ్రనేత అబు దునాజా కేసును పరిశీలిస్తే అతడు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి. అక్రమంగా కశ్మీర్‌లోకి ప్రవేశించి ఇక్కడి యువతిని పెండ్లి చేసుకున్నాడు. చాలామంది యువతులతో ప్రేమాయణం నడుపుతున్నాడు. అబు దుజానా తన భార్యను కలుసుకోవడానికి వస్తున్నట్లు గుర్తించిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారాన్ని భద్రతా బలగాలకు చేరవేశాయి. దీంతో భద్రతాబలగాలు దునాజాను హతమార్చాయి. ఇలా చాలామంది ఉగ్రవాదులు కశ్మీర్ యువతులను వలలో వేసుకుంటూ ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతూ హతమవుతున్నారు.

అబూ తాలా.. అబ్దుల్లా ఉని కూడా ఇలాగే హతం

1999లో లష్కరే తాయిబా ఉగ్రవాది అబూ తాలాని కూడా భద్రతాబలగాలు ఈ విధంగానే హతమార్చాయి. అతడు ఓ ప్రభుత్వ ఉద్యోగి కుమార్తె ప్రేమలో పడ్డాడు. తరుచుగా అ అమ్మాయి కుటుంబసభ్యులను బెదిరించేవాడు. దీంతో అ అమ్మాయి తండ్రి విషయాన్ని ఇంటెలిజెన్స్ వర్గాల దృష్టికి తీసుకెళ్లారు. అబూ తాలా కదలికలపై నిఘా ఉంచిన భద్రతాబలగాలు అతడిని హతమార్చాయి. అలాగే 2012లో ఉగ్రవాది అబ్దుల్లా ఉని కూడా ఇలాగే హతమయ్యాడు. అతడికి ఐదుగురు ప్రియురాళ్లు ఉండేవారు. తరుచుగా వారిని కలుసుకునేవాడు. అతడిపై నిఘా వేసిన భద్రతాబలగాలు ప్రియురాలిని కలిసినట్లు సమాచారం తెలియగానే చుట్టుముట్టి హతమార్చాయి. తరుచుగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండటంపై పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ, ఉగ్రవాదులు తమ గర్ల్‌ఫ్రెండ్స్‌ను కలువడానికి తరుచుగా కశ్మీర్‌లోకి ప్రవేశిస్తుడంతో భద్రతా పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కశ్మీర్ యువతులను మాయమాటలతో లొంగదీసుకోవడమే కాకుండా ఉగ్రకార్యకలాపాల విస్తరణకు వ్యూహం పన్నుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి కదలికలపై నిఘా ఉంచి హతమార్చుతున్నామని పేర్కొన్నారు. ఒక విధంగా చెప్పాలంటే వారి బలహీనతే వారి ప్రాణం మీదకు వస్తున్నదని వివరించారు.



ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదులు (ఫైల్)

పైన ఓ వేగం.. లోపల మరో వేగం!

- సూర్యుడి భ్రమణంపై సౌరపవనాల ప్రభావం
- ఉపరితలం కన్నా నాలుగు రెట్ల వేగంతో తిరుగుతున్న కోర్ భాగం

లాస్‌ఏంజెల్స్, ఆగస్ట్ 2: సూర్యుడి ఉపరితలంతో పోల్చితే కోర్ భాగం అధిక వేగంతో తిరుగుతున్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో సూర్యుడు పుట్టినప్పుడు ఎలాంటి పరిస్థితిలో ఉండేదో.. ఇప్పుడున్న రూపానికి మారడానికి గల కారణాల అన్వేషణలో శాస్త్రవేత్తలు కీలక విజయం సాధించారు. సూర్యుడిలో రెండు రకాల పదార్థాలు ఉంటాయి. పై భాగాన్ని ఉపరితలం అని, అంతర్గతంగా ఉండే భాగాన్ని కోర్ అని పిలుస్తారు. భూమిలాగే సూర్యుడూ తన చుట్టూ తాను తిరుగుతుంటాడు. ఇన్నాళ్లూ ఉపరితలం, కోర్ రెండూ ఒకే వేగంతో తిరిగేవని శాస్త్రవేత్తలు భావించారు. అయితే తాజా పరిశోధనల ప్రకారం కోర్ భాగం ఉపరితలం కన్నా నాలుగురెట్ల వేగంతో తిరుగుతున్నదని తేల్చారు. నాసా, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ సంయుక్తంగా అంతరిక్షంలోకి పంపిన 'సోలార్ అండ్ హీలియోస్పెరిక్ అబ్జర్వేటరీ' నౌకలోని గోల్ఫ్ అనే పరికరం సాయంతో సూర్యుడిని 16 ఏండ్లపాటు పరిశీలించి సూర్యుడికి సంబంధించిన ఆసక్తికర విషయాలు కనుగొన్నారు. 460 కోట్ల ఏండ్ల కిందట సూర్యుడు ఉద్భవించినప్పుడు మొత్తం ఒకే భాగంగా, ఒకే వేగంతో భ్రమణం ఉండేదని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ రోజర్ ఉల్రిచ్ పేర్కొన్నారు. సూర్యుడి నుండి వెలువడే 'సౌర పవనాలు' ఉపరితల భాగం భ్రమణ వేగాన్ని క్రమంగా తగ్గించాయన్నారు. దీంతో ఉపరితల వేగం మందగించిందని వివరించారు. సూర్యుడి వాతావరణంలోని ధ్వని తరంగాలను అధ్యయనం చేసినప్పుడు ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.



సూర్యుని కోర్ భాగం ఊహాచిత్రం

అంతా నాటకమే

50 లక్షలకు ఒప్పందం..కాల్పులు జరిపించుకున్న విక్రమ్‌గౌడ్

ప్రజల్లో సానుభూతితో ఎమ్మెల్యేగా గెలిచేందుకు డ్రామా

అప్పుల నుంచి తప్పించుకోవడం, గన్‌లైసెన్స్ కోసం మస్కా.. ఏడుగురితో ముఠా.. ఐదుగురు అరెస్టు.. ఇద్దరు పరారీ

డిశ్చార్జి అయ్యాక విక్రమ్‌ను అరెస్టు చేస్తాం: సీపీ మహేందర్‌రెడ్డి



నిందితులు రహీస్, నందకుమార్, గోవిందరెడ్డి, బాబూ జాన్, షేక్ అహ్మద్



విక్రమ్‌గౌడ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రజల్లో సానుభూతి పొందాలి! ఇచ్చిన అప్పులు తిరిగి రావాలి.. తీసుకున్న అప్పులను ఎవరూ అడుగొద్దు! గన్ లైసెన్స్ కావాలి.. వీటన్నింటికీ తనపైకి తుపాకీ కాల్పులనే మార్గంగా ఎంచుకొని ప్రాణాలతో చెలగాటమాడాడు కాంగ్రెస్ నేత మాజీ మంత్రి మూల ముఖేశ్‌గౌడ్ కొడుకు విక్రమ్‌గౌడ్. కాల్పులు జరిపించుకునేందుకు రూ.50 లక్షలకు అంతరాష్ట్ర ముఠాతో ఒప్పందం చేసుకొని, కథ అడ్డం తిరుగడంతో ఇప్పుడు దవాఖాన నుంచి జైలుకు వెళ్లనున్నాడు. గత నెల 28న తెల్లవారుజామున హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన విక్రమ్‌గౌడ్‌పై కాల్పుల ఘటన కట్టుకథేనని పోలీసులు తేల్చారు. ఈ ఘటనలో విక్రమ్‌తో కలిపి ఎనిమిది మంది పాత్ర ఉండగా ఐదుగురిని అరెస్టు చేసి మిస్టరీని ఛేదించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. బుధవారం ఈ ఘటన వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. క్లాప్‌షాట్ ప్రొడక్షన్ సంస్థ ద్వారా విక్రమ్‌గౌడ్ ఇష్క్, గుండె జారి గల్లంతయ్యింది సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. ఈ సంస్థలో ఏపీలోని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ప్రసాద్ పనిచేస్తున్నాడు. అతని ద్వారా గోవిందరెడ్డి వచ్చి విక్రమ్‌గౌడ్‌ను కలిసి సినిమా చాన్స్ అడుగగా భవిష్యత్‌లో తీసుకుంటానని హామీఇచ్చాడు. ప్రతిఫలంగా తనకో పనిచేసి పెట్టాలని నాలుగు నెలల కిందట ప్లాన్ చెప్పాడు. వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలంటే, ప్రజల్లో సానుభూతి వచ్చేందుకు ప్రాణానికి ప్రమాదం జరుగకుండా తనపై కాల్పులు జరుపాలి.. రాజకీయ శత్రువుల పనిగా ప్రచారం జరిగి మేలు చేస్తుందని వివరించి రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. పాత నేరస్తులైన అనంతపురం జిల్లా కదిరికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి నందకుమార్‌కు ప్లాన్ వివరించిన గోవిందరెడ్డి అడ్వాన్స్‌గా రూ.3.5 లక్షలు అందజేశాడు. ఈ ఏడాది మే నెలలో విక్రమ్‌కు నందకుమార్‌ను పరిచయం చేశాక ప్లాన్ అమలుచేస్తే రూ.50 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. నందకుమార్ కదిరికి చెందిన బాబూజాన్, షేక్ అహ్మద్‌ను కలిసి కాల్పులు జరిపితే రూ.5 లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. కదిరి నివాసి తాహెర్ సాయంతో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు వెళ్లి రహీస్‌ఖాన్‌ను కలిసి గన్ ఇప్పించాలని కోరారు. వీరికి బాబూజాన్ స్నేహితుడు వెంకటరమణ అలియాస్ చిన్నా జతకలిశాడు. నందకుమార్ నుంచి రూ.1.9 లక్షలు తీసుకొని జూలై 6న షేక్ అహ్మద్, బాబుజాన్, చిన్నా హైదరాబాద్ నుంచి ఫ్లైట్‌లో ఇండోర్ వెళ్లి రహీస్‌కు రూ.30 వేలు ఇచ్చి గన్, మూడు రౌండ్ల బుల్లెట్లు తీసుకొచ్చారు. 8న హైదరాబాద్‌లోని బాలానగర్‌లో నందకుమార్‌కు గన్ ఇవ్వగా, విక్రమ్‌గౌడ్‌కు అందజేశాడు. గన్‌ను ఇంట్లో దాచిపెట్టిన విక్రమ్, ప్లాన్ ఎప్పుడు అమలుచేస్తావని నందకుమార్‌పై ఒత్తిడి పెంచాడు. తన మామ పుట్టపర్తి సత్యసాయి దవాఖానలో చికిత్స పొందుతున్నాడని చెప్పగా, జూలై 17న పుట్టపర్తికి వెళ్లి కొంత డబ్బుఇచ్చి పనిపూర్తయ్యేలా చూడాలని చెప్పాడు.

26 ప్లాన్ విఫలం.. తేజ నివాస్‌లో మకాం

కాల్పులు జరిపాక పరారయ్యేందుకు గోవిందరెడ్డి రూ.30 వేలతో పల్సర్ బైక్ కొనుగోలు చేసి షేక్ అహ్మద్‌తో హైదరాబాద్‌కు పంపించాడు. చాంద్రాయణగుట్టలో బైక్ ఇంజిన్, చాసిస్ నంబర్లను చెడిపేశారు. 26న తెల్లవారుజామున ప్లాన్ అమలుచేసేందుకు అమీర్‌పేట్ నుంచి నందకుమార్, సికింద్రాబాద్ నుంచి బాబూజాన్ అతని స్నేహితుడు గౌస్, చిన్నాలు విక్రమ్ ఇంటికి వెళ్లారు. ప్లాన్ ప్రకారం విక్రమ్‌గౌడ్ హాల్లో ఉండగా గౌస్, చిన్నా కాల్పులు జరిపి బైక్‌తో ఉన్న షేక్ అహ్మద్‌తో కలిసి పారిపోవాలి. కొద్దిదూరంలో కారులో ఉండి బాబూజాన్, నందకుమార్ పరిస్థితిని గమనిస్తారు. షేక్ అహ్మద్ బైక్‌తో రాలేకపోవడంతో ప్లాన్ వాయిదాపడింది. 27న విక్రమ్ ఇంట్లోనే బైక్ నంబర్‌ప్లేట్‌ను మార్చేశారు. అపోలో దవాఖాన దగ్గర తేజ నివాస్‌లో గెస్ట్‌హౌస్‌ను విక్రమ్ బుక్‌చేయగా వీరంతా బసచేశారు. గోవిందరెడ్డి కూడా జతకలిశాడు. కాల్పులు జరిపేందుకు ఇండోర్ నుంచి రహీస్‌ను పిలిపించారు. గోవిందరెడ్డి, నందకుమార్, బాబూజాన్‌లు కదిరికి వెళ్లిపోగా, రహీస్ ఎర్రగడ్డలోని సన్మాన్ హోటల్‌లో బస చేశారు. నందకుమార్ స్కార్పియోతో నగరానికి చేరుకున్నాడు.

కాల్పులు జరిపి చెరువులో గన్‌పడేశారు

శుక్రవారం(28న) తెల్లవారుజామున 1.45 నిమిషాల ప్రాంతంలో నందకుమార్, షేక్ అహ్మద్, రహీస్‌ఖాన్‌ను విక్రమ్ కారులో కూర్చొబెట్టుకొని కాల్పులు తర్వాత పారిపోయే మార్గాన్ని చూపించాడు. ఫిలింనగర్ సమీపంలోని హకీంపేట చెరువులో గన్ పడేసి, బైక్ వదిలి ముగ్గురు మూడుదార్లలో వెళ్లిపోవాలని సూచించాడు. తెల్లవారుజామున 2.30 గంటలకు విక్రమ్‌గౌడ్ ఇంటికి వెళ్లి గేటు వేయవద్దని, స్నేహితులు వస్తారని వాచ్‌మన్‌కు చెప్పాడు. 15 నిమిషాల తర్వాత ముగ్గురూ లోపలికి వెళ్లారు.. గన్, రూ.2 లక్షలు రహీస్‌కు, రూ.4 లక్షలు నందుకు, షేక్ అహ్మద్‌కు రూ.2 లక్షలు ఇచ్చాడు. ఎడమ చేతి భుజం, కుడి చేయి, కడుపు పక్క నుంచి లక్కీనంబర్ 3 ప్రకారం మూడుసార్లు కాల్చాలని విక్రమ్ సూచించాడు. రహీస్ మొదటి రౌండ్ కాల్పులు జరుపగానే నొప్పితో రెండో చేతిని పైకి లేపలేకపోవడంతో బుల్లెట్ చేతికి తాకి శరీరంలోకి చొచ్చుకుపోయింది. మూడో రౌండ్‌కు ప్రయత్నిస్తుండగా గన్ స్టక్ అవడంతో రహీస్, షేక్ అహ్మద్ బైక్‌పై పరారై గన్‌ను చెరువులో పడేసి పారిపోయారు.

కాలిదాటాకే చిక్కిన నిందితులు

దర్గాలో అన్నదానం చేసేందుకు సిద్ధమవుతుండగా కింది అంతస్తులో ఉన్న విక్రమ్‌కు కాల్పులు జరిగాయన్న అతని భార్య శిపాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు జరిపారు. విక్రమ్‌గౌడ్ కాల్‌డేటా, సీసీ కెమెరాలు, శాస్త్రీయమైన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. పది బృందాలను రంగంలోకి దింపి నందకుమార్, షేక్‌అహ్మద్ బాబూజాన్, గోవిందరెడ్డి, రహీస్‌ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు చిన్నా, గౌస్ పరారీలో ఉన్నారు. భారీ ఆయస్కాంతాన్ని ఉపయోగించి హకీంపేట చెరువులో పడేసిన గన్‌ను తీశారు. కాల్పుల ప్లాన్ తదితరాలను విచారణలో విక్రమ్ కూడా ఒప్పుకున్నాడు. డిశ్చార్జి కాగానే అతడిని అరెస్టు చేస్తామని సీపీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. 2019 ఎన్నికల్లో సానుభూతితో ఎమ్మెల్యేగా గెలువడం, ఒడిశాలో మైనింగ్ వ్యాపారంలో సాంబశివరావు అనే వ్యక్తి వద్ద పెట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం, అప్పులు తీర్చకుండా తప్పించుకునేందుకు, గన్ లైసెన్స్ పొందేందుకు సుపారి ఇచ్చి విక్రమ్‌గౌడ్ కాల్పులు జరిపించుకున్నాడని సీపీ వెల్లడించారు. కేసు మిస్టరీని ఛేదించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

తదుపరి ఆదేశాల వరకు విలీన ప్రక్రియ ఆపండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అబ్సార్‌ప్షన్‌పై విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం
నాలుగు వారాలకు విచారణ వాయిదా
ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురికావద్దనే ప్రగతిశీల నిర్ణయం
ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తిచెప్పే ఉద్దేశంతో ప్రభుత్వం
అడ్వకేట్ జనరల్ వాదనలు

రాష్ట్రంలోని విద్యుత్ యుటిలిటీ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ (పొరుగు సేవల) ఉద్యోగులను తాము తదుపరి ఆదేశాలు జారీచేసేవరకు విలీనం (అబ్సార్ప్షన్) చేయవద్దని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యుత్ సంస్థలకు బుధవారం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా నిర్ధారిత ఏకమొత్తంలో నెలవారీ జీతాలు చెల్లించి, వారి సేవల్ని వినియోగించుకోవచ్చని విద్యుత్ సంస్థలకు తెలిపింది. వారిని ఉద్యోగం నుంచి తీసివేయాలని తాము చెప్పడం లేదని పేర్కొంది. అయితే.. ఉద్యోగుల్ని కొనసాగించవచ్చని తాము పేర్కొనడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక హక్కులు వచ్చినట్టు కాదని స్పష్టంచేసింది. విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విలీన ప్రక్రియను సవాల్‌చేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన శ్రవణ్‌కుమార్ అనే నిరుద్యోగి దాఖలు చేసిన వ్యాజ్యంతోపాటు మరిన్ని వ్యాజ్యాలపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టి, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది.

శ్రమదోపిడీ నివారణకు ప్రగతిశీల నిర్ణయమే

విద్యుత్ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు శ్రమదోపిడీకి గురికావద్దనే ఉద్దేశంతోనే విలీన ప్రక్రియ అనే ప్రగతిశీల నిర్ణయం తీసుకున్నట్టు విద్యుత్ సంస్థలు, ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. సుమారు ఎనిమిది గంటలకుపైగా, నిర్ణీత పనివేళలు కూడా లేకుండా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేయాలని విద్యుత్ సంస్థలు నిర్ణయించుకున్నాయని తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్వహణను గతంలోనే కాంట్రాక్టర్లకు అప్పగించారని, అయితే కాంట్రాక్టర్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇష్టానుసారంగా చాలీచాలని జీతాలు ఇస్తూ పనిచేయించుకుంటున్నారని వివరించారు. ఈ విధానాన్ని తీసివేసి, నేరుగా ఉద్యోగులకు అవకాశం కల్పించాలనే భావనతోనే తీసుకున్న నిర్ణయమని ఏజీ వివరించారు. స్తంభాలు ఎక్కడం, తదితర పనుల వంటివి సంవత్సరాల తరబడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ధర్మాసనం స్పందిస్తూ.. కటాఫ్ తేదీని డిసెంబర్ 4గా ప్రకటించడానికి కారణాలేంటని ఏజీని ప్రశ్నించింది. ఎంతమంది ఉద్యోగులు.. ఎన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అడిగింది. కనీసం పది సంవత్సరాలు చేసినవారికి అబ్సార్‌ప్షన్ నిబంధన పెట్టిఉండాల్సిందని వ్యాఖ్యానించింది. ఈ వివరాలను మధ్యాహ్నం లోగా తమకు అందించాలని ఏజీకి స్పష్టంచేసింది. తదుపరి విచారణను మధ్యాహ్నం మూడున్నర గంటలకు వాయిదా వేసింది.

బ్యాక్‌డోర్ నియామకాలతో నిరుద్యోగులపై ప్రభావం

అబ్సార్‌ప్షన్ పేరిట సుమారు 21 వేల ఉద్యోగులను విలీనం చేసుకునేందుకు విద్యుత్ యుటిలిటీ సంస్థలు జారీచేసిన ఉత్తర్వులు నిరుద్యోగులపై ప్రభావం చూపుతాయని పిటిషనర్ తరఫు న్యాయవాది సరసాని సత్యంరెడ్డి వాదనలుచేశారు. బ్యాక్‌డోర్ ద్వారా చేపడుతున్న విలీన ప్రక్రియతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. 2016 డిసెంబర్ 4ను కటాఫ్ తేదీగా పెట్టి, అంతకుముందు ఉద్యోగులందరినీ విలీనంచేస్తున్నట్టు పేర్కొన్నారని వివరించారు. ఆరునెలలకు ముందు చేరిన ఉద్యోగుల్ని సైతం విలీనం చేసుకునే ప్రయత్నాలను చేపట్టారని పేర్కొన్నారు. ఆయన వాదనలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని, విద్యుత్ సంస్థలను ధర్మాసనం కోరింది.

2016లో 1145 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సంవత్సరాలవారీగా పేర్కొనే పత్రాన్ని వాయిదా అనంతర విచారణ సమయంలో ధర్మాసనానికి ఏజీ ప్రకాశ్‌రెడ్డి నివేదించారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం 2006 వరకు వందల సంఖ్యలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుంటే, ఆ తర్వాత వేల సంఖ్యలో కొత్త నియామకాలు ఉన్నాయని పేర్కొంది. 2016లో కేవలం 1145 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసుకున్నారని, అందులో అక్టోబర్, నవంబర్ నెలల్లో తీసుకున్నది 240 మంది మాత్రమేనని ఏజీ వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం మూడు వేల మంది కొత్త ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాత్రమే ఉన్నారని వివరించారు. వీరికి జీతాలను గ్రేడ్లవారీగా సుమారుగా రూ.21,700, రూ.17,560, రూ.14,453, రూ.12,149 ఇస్తున్నారని వివరించారు. ప్రస్తుతం ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేసుకున్న తర్వాత ఔట్‌సోర్సింగ్ అనే విధానమే లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని వివరించారు. విద్యుత్ సంస్థల్లో ఎంతోకాలం నుంచి పనిచేస్తున్నవారు శ్రమదోపిడీకి గురికావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రగతిశీల నిర్ణయం తీసుకున్నదని వివరించారు.

నిరుద్యోగులపై ప్రభావం ఉంటుందన్న పిటిషనర్ తరఫు న్యాయవాది

ఈ వాదనలపై పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. సుమారు 21వేల మంది ఉద్యోగుల అబ్సార్ప్షన్‌తో నిరుద్యోగులపై ప్రభావం పడుతుందని వివరించారు. కనీసం ఔట్‌సోర్సింగ్ విధానంలో చేరడానికి కూడా అవకాశం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విలీన ప్రక్రియను అడ్డుకోవాలని, వారికి పేస్కేళ్ల ప్రకారం జీతాలు ఇవ్వడానికి వీల్లేదని, వీరిని యథాతథంగా కొనసాగిస్తే కొత్తవారు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేయడానికి అవకాశాలు లేకుండా పోతున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది సత్యంరెడ్డి వాదనలుచేశారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు విలీన ప్రక్రియ చేపట్టవద్దంటూ విద్యుత్ యుటిలిటీ సంస్థలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ వినియోగ సంస్థలను వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

నిజామాబాద్‌లో స్పైస్ పార్కు

మొదటిపేజీ తరువాయి...

తగిన స్థలాన్ని చూపి నిధులను సమకూర్చితే కేంద్రం తరఫున స్పైస్‌పార్కుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసే స్పైస్‌బోర్డు ద్వారా పసుపు ఉత్పత్తి, మార్కెటింగ్, నాణ్యత, ఎగుమతి తదితర అంశాల్లో రైతులకు మేలు జరుగుతుందని, పరిశోధనలు కూడా నిర్వహించవచ్చునన్నారు. ఈ బోర్డు ఏర్పాటుతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల మధ్య సమన్వయం నెలకొంటుందన్నారు. కేవలం పసుపుపైనే కాకుండా మిర్చి పంటపై కూడా బోర్డు దృష్టి సారిస్తుందని తెలిపారు. పసుపు, మిర్చి రైతులకు సహాయం చేసేందుకు కేంద్రం పలు పథకాలను అమలుచేస్తున్నదని, ఉత్పత్తి పెంపు, మద్దతుధర కల్పించడానికి చొరవ తీసుకుంటున్నదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. పంటలను వివిధ రకాలుగా వినియోగించుకోవడానికిగాను ప్రాసెసింగ్ ప్రక్రియలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంట నాణ్యతపై విశ్లేషణతో సమయానుకూలంగా చర్యలు తీసుకోవడానికి ప్రయోగశాలలను నెలకొల్పడం, ఎగుమతులకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటించడం తదితర అంశాలపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. పసుపు, మిర్చి ఎగుమతుల పెంపు లక్ష్యంగా కేంద్ర స్పైసెస్ బోర్డు ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నదని, ఇందుకోసం ప్రత్యేకంగా సుగంధ ద్రవ్యాల ఎగుమతి అభివృద్ధి, ప్రోత్సాహక పథకాన్ని అమలుచేస్తున్నదని సీతారామన్ తెలిపారు. స్పైస్‌పార్కుల్లో మౌలిక సౌకర్యాల కల్పన, ప్రాసెసింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు, నాణ్యమైన పంటల కోసం రైతులకు శిక్షణను స్పైసెస్‌బోర్డు అందిస్తుందని వివరించారు.

నారాయణ, శ్రీచైతన్య కాలేజీల కోత

మొదటిపేజీ తరువాయి...

పెరుగుతుందని బోర్డు సెక్రటరీ అశోక్ చెప్పారు. ప్రవేశాలకు ఈ నెల 10 వరకు గడువు ఉందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కేజీ టు పీజీలో భాగంగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉచిత ప్రవేశాలు, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కొనసాగుతున్నదని తెలిపారు. త్వరలోనే జూనియర్ కాలేజీల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని వెల్లడించారు. అవసరమైన చోట కాలేజీలకు పక్కా భవనాలు, అదనపు గదుల నిర్మాణాలు, అన్ని రకాల ల్యాబ్ సదుపాయాలు ఏర్పాటుచేయడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతకోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కాలేజీలలో సదుపాయాలు, నిర్మాణాలకోసం రూ.260 కోట్ల వరకు నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు ప్రభుత్వ విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 65%, ద్వితీయ సంవత్సరంలో 75% ఉత్తీర్ణత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు.

త్వరలో డిజిటల్ క్లాస్ రూమ్స్...

అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఆగస్టు నెలలోనే డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలు, ఆన్‌లైన్ అఫిలియేషన్లు, ఉన్నత విద్యాభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలేజీ యాజమాన్యాలు అఫిలియేషన్ల పేరుతో బోర్డు కార్యాలయానికి వచ్చే అవసరం లేదని, అంతా ఆన్‌లైన్‌లోనే కొనసాగించాలని ఆయన కాలేజీ యాజమాన్యాలకు సూచించారు.

గురుకుల ఖాళీల భర్తీ ఇక వేగవంతం

మొదటిపేజీ తరువాయి...

పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో పనిచేసే బోధన, బోధనేతర పోస్టులను కేవలం మహిళలకు రిజర్వ్‌చేస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ గతేడాది జూన్ 4న 1274 నంబరు జీవోను జారీచేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, మహిళా విద్యాసంస్థల్లో పోస్టులను మహిళలకే రిజర్వ్ చేయడాన్ని సవాల్‌చేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన కే సత్యనారాయణతోపాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పిటిషనర్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని భర్తీ ప్రక్రియను నిలిపివేస్తూ జూలై 19న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తదితరులు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

ఒకరిద్దరి కోసం భర్తీ ప్రక్రియ ఆగదు

మహిళల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పోస్టులను మహిళలకే కేటాయించినట్టు ప్రభుత్వం తరఫున అడ్వకేట్ (ఏజీ) జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఏజీ వాదనలపై ప్రతివాది తరఫు న్యాయవాది సత్యంరెడ్డి అభ్యంతరాలు వ్యక్తంచేశారు. తమ వాదనలు వినిపించేందుకు గడువు కోరుతూ అప్పటివరకు యథాతథ స్థితిని కొనసాగించి విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించారు. అయితే ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. ఒకరిద్దరి కోసం భర్తీ ప్రక్రియను నిలిపివేయడం సరికాదని పేర్కొంది. పిటిషనర్ అభ్యంతరాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. పోస్టుల భర్తీ ప్రక్రియను కొనసాగించడానికి అనుమతిస్తున్నామని తెలిపింది. అయితే తమ ఆదేశాలకు లోబడి నియామక ప్రక్రియ ఉంటుందని పేర్కొంటూ, తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

పరీక్షల రీ షెడ్యూల్‌కు టీఎస్‌పీఎస్సీ కసరత్తు

గురుకులాల్లో బోధన, బోధనేతర కొలువుల భర్తీ ప్రక్రియను కొనసాగించవచ్చునన్న హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తగు చర్యలు తీసుకునేందుకు టీఎస్‌పీఎస్సీ సమాయత్తమవుతున్నది. గతంలో వాయిదా పడిన పరీక్షలను వీలైనంత త్వరగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నది. ఇంకా నిర్వహించాల్సిన పరీక్షలు, హాజరయ్యే అభ్యర్థులు, పరీక్ష నిర్వహించేందుకు కావాల్సిన సమయం, ఇతరత్రా ఉద్యోగ పరీక్షలు ఉన్న తేదీలు తదితరాలపై టీఎస్‌పీఎస్సీ వర్గాలు సమీక్షిస్తున్నట్టు సమాచారం. త్వరలోనే కమిషన్ చైర్మన్ సహా సభ్యులు, కార్యదర్శి సమావేశమై తేదీలు ఖరారు చేస్తారని తెలుస్తున్నది. గతంలో పరీక్ష కోసం ఏర్పాట్లు చేసిన కాలేజీలు, పాఠశాలల్లోనే తిరిగి నిర్వహించే అవకాశం ఉందా? అనేది కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. గత నెల 21వ జరుగాల్సిన టీజీటీ సోషల్, ఫిజికల్ సైన్సెస్ మెయిన్స్, 22వ తేదీన టీజీటీ సైన్స్, 30వ తేదీన జరుగాల్సిన డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు, జూనియర్ కాలేజీలకు సంబంధించిన ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లతోసహా, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు, గురుకులాల్లో లైబ్రేరియన్లు, స్టాఫ్ నర్సులు, పీఈటీల పరీక్షలు కోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన వాటిలో ఉన్నాయి.

కొత్త జిల్లాలకు కామన్ ఎగ్జామినేషన్ బోర్డులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పాత 10 జిల్లాల్లో కొనసాగుతున్న జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి (డీసీఈబీ)లను కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాలకు కూడా విస్తరిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ జీ కిషన్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిపై తగిన చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాధికారులకు సూచించారు. జిల్లాలవారీగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పరీక్షలను నిర్వహించే బాధ్యతను డీసీఈబీ చూస్తుంది. జిల్లా విద్యాధికారుల ఆధ్వర్యంలో ఈ బోర్డు పనిచేస్తుంది. అవసరమైన నిధులను ఈ బోర్డు ఆధ్వర్యంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. డీసీఈబీ చైర్మన్‌గా జిల్లా విద్యాధికారి, వైస్ చైర్మన్‌గా సీనియర్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, సెక్రటరీగా అనుభవం ఉన్న హెడ్‌మాస్టర్, అసిస్టెంట్ సెక్రటరీగా స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేజీబీవీలు, గురుకులాలు వంటి పాఠశాల యాజమాన్యాల నుంచి 11 మంది సభ్యులను ఎంపిక చేయాలి. ఈ సభ్యుల కాలపరిమితి మూడేండ్లు ఉంటుంది. పైన పేర్కొన్న విధంగా బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు.

సెన్సెక్స్
32,477
98

నిఫ్టీ
10,081
33

బంగారం ధరలు
ముంబై

24 క్యారెట్లు	28,580
22 క్యారెట్లు	28,430
వెండి (కిలో)	37,910

ముడి చమురు (బ్రెంట్)
52.16

మూడేండ్లలో 50 సెజ్‌ల ఏర్పాటు

■ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, ఆగస్టు 2: గడిచిన మూడేండ్లకాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా 50 ప్రత్యేక ఆర్థిక మండళ్లను(సెజ్) ఏర్పాటు చేసినట్లు రాజ్యసభకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సెజ్‌ల ఎగుమతి ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.5.23 లక్షల కోట్లకు చేరుకున్నట్లు మంత్రి చెప్పారు. తాజా పండ్లు, కూరగాయలపై యూరోపియన్ యూనియన్ నుంచి 36 హెచ్చరికలు వచ్చాయని, అలాగే అమెరికా 41 ఎగుమతులను తిరస్కరించిన విషయాన్ని మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఎగుమతులకు సంబంధించి ఆయా దేశాలు నూతన మార్గదర్శకాలను పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరిగిందని, దీంతో ఎగుమతిదారులను, రైతులకు అవగాహన కల్పించడానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

టెలికం రంగంలోకి 65 వేల కోట్ల ఎఫ్‌డీఐ

గడిచిన మూడేండ్లలో టెలికం రంగంలోకి 979 కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) వచ్చాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. మన కరెన్సీలో రూ.65 వేల కోట్లకు పైమాటే. 2014-15 నుంచి 2016-17 మధ్యకాలంతోపాటు ఈ ఏడాది తొలి రెండు నెలలు(ఏప్రిల్-మే) టెలికం రంగంలోకి 9,790.40 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయన్నారు. పెద్ద నోట్లను రద్దుచేసిన నాటి నుంచి డిజిటల్ చెల్లింపుల లావాదేవీలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొందని మంత్రి పేర్కొన్నారు. మే నెలలో దేశీయంగా 111.45 కోట్ల స్థాయిలో డిజిటల్ చెల్లింపులు జరిపినట్లు మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. గతేడాది అక్టోబర్‌లో 71.27 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.35	67.66
ఆస్ట్రేలియా డాలర్	46.40	53.67
బహ్రెయిన్ దినార్	158.11	181.08
యూరో	68.89	79.08
జపాన్ యెన్/100	52.70	61.20
కువైట్ దినార్	175.29	218.85
ఒమన్ రియాల్	154.71	177.04
సౌదీ రియాల్	15.52	18.39
సింగపూర్ డాలర్	42.88	50.80
స్టెర్లింగ్ పౌండ్	76.98	89.32
యూఏఈ దిర్హామ్	15.88	18.56

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	310-00	310-00
రంగారెడ్డి	310-00	310-00
మెదక్	310-00	310-00
కరీంనగర్	312-00	---
వరంగల్	312-00	---
రిటైల్ ప్రైస్	3-70	3-70

చికెన్ ధరలు

ఫారం ధర	67.00
రిటైల్ లైవ్	81.00
డ్రెస్డ్	113.00
స్కిన్‌లెస్	134.00

పటేల్ పావు పటాకా!

రెపో రేటు 0.25% తగ్గింపు.. 6 శాతానికి చేరిక
ద్వైమాసిక పరపతి సమీక్షలో రిజర్వు బ్యాంక్ ప్రకటన
గృహ, వాహన రుణాల వడ్డీరేట్లు మరింత తగ్గే అవకాశం

ముంబై, ఆగస్టు 2:

గడిచిన పదినెలల్లో జరిగిన నాలుగు ద్రవ్యపరపతి సమీక్షల్లో రెపోరేటును యథాతథంగా కొనసాగించిన రిజర్వుబ్యాంక్ ఈ సారి కాస్త కరుణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో రెపోరేట్లను తక్షణమే అమలులోకి వచ్చేలా 0.25 శాతం తగ్గించింది. దాంతో రెపోరేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గగా.. రివర్స్ రెపో 6 శాతం నుంచి 5.75 శాతానికి తగ్గింది. తదనుగుణంగా మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ(ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 6.25 శాతానికి దిగివచ్చాయి. రెపోరేటుకిది దాదాపు ఏడేండ్ల కనిష్ఠ స్థాయి. తాజా పరిణామంతో బ్యాంకులు ముున్ముందు గృహ, వాహన, కార్పొరేట్ రుణాలపై వడ్డీరేట్లను మరింత తగ్గించే అవకాశం ఉంది. గత ఏడాది అక్టోబర్‌లో ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరిగిన తొలి ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లను 0.25 శాతం తగ్గించారు. తొలిసారిగా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ద్వారా వడ్డీరేట్లను నిర్ణయించింది కూడా ఆ సమావేశంలోనే. ఆ తర్వాత వరుసగా నాలుగు సమీక్షల్లో ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించింది. 'వృద్ధికి మద్దతిస్తూనే వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణాన్ని మధ్యకాలిక లక్ష్యమైన 4 శాతానికి కట్టడి చేయాలన్న తటస్థ వైఖరికి అనుగుణంగా తాజా సమీక్షలో ఎంపీసీ కమిటీ నిర్ణయం తీసుకుంది' అని ఉర్జిత్ పటేల్ అన్నారు.



ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను వెల్లడించేందుకు ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి వచ్చేస్తున్న ఆర్బీ ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్. చిత్రంలో డిప్యూటీ గవర్నర్లు బీపీ కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్, విరల్ ఆచార్య కూడా ఉన్నారు



మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగానే ఆర్బీ ఐ వడ్డీరేట్లను తగ్గించింది. ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనున్నది. జీఎస్టీ పారదర్శకంగా అమలు చేయడంలో సెంట్రల్ బ్యాంక్ కీలక పాత్ర పోషించింది.
- దీపక్ పరేఖ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చైర్మన్



వడ్డీరేట్ల తగ్గింపు మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరుచనున్నది. దీంతో రుణ వితరణ మరింత పెరుగనున్నది.
-అరుంధతీ భట్టాచార్య, ఎస్‌బీఐ చైర్‌పర్సన్



మన మార్కెట్‌పై అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరుగడానికి ఈ నిర్ణయం దోహదపడనున్నది. రుణాలు తీసుకునేవారి సంఖ్య పెరుగనున్నది.
- చందాకొచ్చర్, ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో



ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో తగ్గడంతో ఆర్బీ ఐ వడ్డీరేట్లను తగ్గించింది. వచ్చే కొన్ని నెలల్లో మరో 50-75 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి వీలున్నది.
- రాణా కపూర్, యెస్ బ్యాంక్ సీఈవో



ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి ద్రవ్యోల్బణం జారుకోవడంతో సెంట్రల్ బ్యాంక్‌కు వడ్డీల్లో కోత విధించడానికి వీలు పడింది.
- అశ్వనీ కుమార్, దేనా బ్యాంక్ సీఎండీ

పబ్లిక్ క్రెడిట్ రిజిస్ట్రీ ఏర్పాటు కోసం కమిటీ

జాతీయ రుణ పరపతి సమాచార డాటాబేస్ 'పబ్లిక్ క్రెడిట్ రిజిస్ట్రీ' ఏర్పాటు కోసం రోడ్‌మ్యాప్‌ను నిర్దేశించేందుకు త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్బీఐ తెలిపింది. 'పరపతి మార్కెట్లో పారదర్శకత పెంచడంతోపాటు రుణాల జారీకి అవసరమైన సమాచారం కోసం ఆధారపడగలిగే వ్యవస్థ ఏర్పాటుకు మార్గదర్శకాలు నిర్దేశించేందుకోసం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నాం. ఆ కమిటీలో నిపుణులతోపాటు సంబంధిత వర్గా లు సభ్యులుగా ఉండనున్నారు' అని ఆర్బీఐ డిప్యూ టీ గవర్నర్ విరల్ ఆచార్య తెలిపారు.

ఈ ఏడాదికింతే!

ఈ సారి సమీక్షలో పావు శాతం వడ్డీరేట్ల తగ్గింపు ముందుగా అంచనా వేసిందేనని రేటింగ్ ఏజెన్సీలు, విదేశీ బ్రోకరేజీ సంస్థల్లోని విశ్లేషకులు అన్నారు. ఇక ఈ ఏడాది చివరివరకు రెపోరేట్లు తగ్గించే అవకాశాలు లేవని వారంటున్నారు. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 1.4 శాతానికి తగ్గినప్పటికీ ముున్ముందు నెలల్లో మళ్లీ పుంజుకోవచ్చని ఆర్థికవేత్తలంటున్నారు. ద్రవ్యపరపతి సమీక్షలో ఎంపీసీ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి అర్ధభాగానికి (ఏప్రిల్-సెప్టెంబర్) రిటైల్ ద్రవ్యోల్బణం 2-3.5 శాతంగా ఉండవచ్చని, రెండో అర్ధభాగంలో (అక్టోబర్ 2017-మార్చి 2018) 3.5-4.5 శాతానికి పెరుగవచ్చని నివేదికలో అంచనా వేసింది.

ప్రైవేట్ పెట్టుబడులకు ప్రోత్సాహం: పటేల్

దాదాపు ఏడేండ్ల కనిష్ఠానికి తగ్గిన కీలక వడ్డీరేట్లతో ప్రైవేట్ రంగ పెట్టుబడులకు ప్రోత్సాహం లభించడంతోపాటు ఆందోనకర స్థాయికి చేరుకున్న మొండిబకాయిల పరిష్కారానికి దోహదపడనుందని ఉర్జిత్ పటేల్ అన్నారు. ద్రవ్యలోటు నియంత్రణ లక్ష్యాలకు కట్టుబడి ఉంటూనే ప్రభుత్వ రంగ బ్యాంకులకు తగినన్ని మూలధన నిధులు కేటాయించడంతోపాటు కార్పొరేట్ సంస్థల నుంచి పెద్ద మొత్తాల్లో రావాల్సి ఉన్న రుణ బకాయిలను పరిష్కరించే విషయంలో కేంద్రం, ఆర్‌బీఐ కలిసి కృషి చేయనున్నాయని అన్నారు.

ఎంపీసీలో భిన్నాభిప్రాయం!
ఎంపీసీలోని ఆరుగురు సభ్యుల్లో నలుగురు (ఉర్జిత్ పటేల్, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య, చేతన్ ఘాటే, పమీ దువా) రెపో రేట్ల పావు తగ్గింపు నిర్ణయానికి అనుకూలంగా ఓటేశారు. కమిటీలోని ప్రభుత్వ తరపు సభ్యులు రవీంద్ర హెచ్ ధోలాఖియా రెపోరేటును 0.50 శాతం తగ్గించాలని ఓటేశారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైకేల్ దేవవ్రత పాత్ర మాత్రం యథాతథంగా కొనసాగించాలన్నారు.

ఎంసీఎల్ఆర్ విధానంపై ఆర్బీఐ అసంతృప్తి

రెపోరేట్ల తగ్గింపు ప్రయోజనాలను బ్యాంకులు పూర్తి స్థాయిలో కస్టమర్లకు అందించకపోవడాన్ని ఆర్బీఐ తప్పుబట్టింది. రుణరేట్లను మరింత తగ్గించేందుకు ఇంకా వెసులుబాటు ఉన్నందున రెపోరేట్ల తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు పూర్తిగా బదిలీ చేయాలని ఉర్జిత్ పటేల్ బ్యాంకులకు ఉద్బోధించారు. జనవరి 2015 నుంచి ఇప్పటి వరకు రెపోరేటు 2 శాతం తగ్గింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్) ఆధారంగా బ్యాంకులు రుణాల వడ్డీరేట్లను నిర్ణయించడంపై ఆర్బీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. రెపో రేట్ల తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు చేరవేసేందుకు మరింత మెరుగైన విధానాన్ని ప్రవేశపెట్టాలనుకుంటున్నట్లు, ఇందుకోసం అంతర్గత అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య తెలిపారు. వచ్చేనెల 24కల్లా కమిటీ రిపోర్టు సమర్పించనుందన్నారు. ఎంసీఎల్ఆర్ విధానాన్ని గత ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు.

స్వాగతించిన ఆర్థిక శాఖ
పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్ల తగ్గింపును కేంద్ర ఆర్థిక శాఖ స్వాగతించింది. ఆర్బీఐ నిర్ణయాన్ని ప్రశంసించిన ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్.. 'నిలకడైన వృద్ధి సాధిస్తూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంలో ఇది కీలక అడుగు' అని అన్నారు.

'అందుబాటు' గృహాలకు సింగిల్ విండో క్లియరెన్సుల విధానం
అందుబాటు ధరల్లో లభించే గృహాల ప్రాజెక్టులకు సకాలంలో, త్వరితగతిన అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో క్లియరెన్సుల విధానం ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలని సెంట్రల్ బ్యాంక్ కోరింది. ఈ ప్రాజెక్టులకు అనుమతుల్లో జాప్యం వృద్ధికి అడ్డుగా మారుతున్నదని ఆర్బీఐ పేర్కొంది. 2020కల్లా దేశంలో అన్ని కుటుంబాలు సొంతిల్లు కలిగి ఉండాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం.. వృద్ధిరేటు వేగంగా పుంజుకునేందుకు దోహదపడగలదని పటేల్ అన్నారు.

పండుగ సీజన్‌లో గృహ విక్రయాలకు ఊతం
వడ్డీరేట్ల తగ్గింపుపై ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో చౌక ధరకే గృహ రుణాలు లభించనుండటంతో వచ్చే పండుగ సీజన్‌లో రియల్ ఎస్టేట్ అమ్మకాలు భారీగా పుంజుకునే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం మెరుగైన వృద్ధికి బాట పడనున్నదని పేర్కొన్నారు. వచ్చే పండుగ సీజన్‌లో గృహాల విక్రయాలు పుంజుకోవడానికి ఆర్బీఐ బీజం వేసిందన్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న రియల్ ఎస్టేట్‌పై పెద్ద నోట్ల రద్దు దెబ్బ మరింత కుంగదీసిందని, ఈ నేపథ్యంలో వడ్డీరేట్లను తగ్గించడం ఈ రంగానికి శుభసూచికమని పేర్కొన్నారు. జీఎస్టీ, రెరా నిబంధనలు అమలులోకి రావడం కూడా ఈ ప్రభావం చూపింది.

మరింత తగ్గించాల్సింది: ఇండస్ట్రీ వర్గాలు

రెపోరేట్ల పావు శాతం తగ్గింపు పారిశ్రామిక వర్గాలను మాత్రం సంతృప్తి పర్చలేకపోయింది. పెట్టుబడులు, వృద్ధికి ఊతమిచ్చేందుకు కీలక వడ్డీరేట్లను మరింత తగ్గించి ఉంటే బాగుండేదని ఇండస్ట్రీ వర్గాలన్నాయి. ఆర్బీఐ ద్రవ్యపరపతి సమీక్షపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) స్పందిస్తూ.. ' ప్రైవేట్ పెట్టుబడులు నిరుత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో వడ్డీరేట్ల తగ్గించడం వృద్ధికి ఊతమివ్వనుంది. అయితే, రెపోరేటును మరింత తగ్గించి ఉంటే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉండేది' అన్నారు. మరో పారిశ్రామిక మండలి ఫిక్కీ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవస్థలో పరిస్థితుల దృష్ట్యా 0.50 శాతం తగ్గించాల్సింది అని పేర్కొంది. పావు శాతం తగ్గింపుతో రుణగ్రహీతలకు, ముఖ్యంగా దీర్ఘకాల కార్పొరేట్ రుణగ్రస్తులకు పెద్దగా ప్రయోజనం కలుగదని అసోచామ్ అభిప్రాయపడింది. వడ్డీరేట్ల తగ్గింపు ప్రభావం చాలా స్వల్పంగా ఉండనుందని, ఇంకాస్త తగ్గిస్తే బాగుండేదని జేకే పేపర్ సీఎండీ హర్ష్ పతి సింఘానియా అన్నారు. అయితే, తాజా నిర్ణయంతో ఆటోమొబైల్, ఇతర వైట్‌గూడ్స్‌కు డిమాండ్ పెరుగవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు.

ఆర్బీఐ మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష ముఖ్యాంశాలు

- రెపో, రివర్స్ రెపో రేటు పావు శాతం తగ్గింపు
- 6 శాతానికి రెపో.. 5.75 శాతానికి రివర్స్ రెపో
- రిటైల్ ధరల ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యం 4%
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనా 7.3%
- ప్రైవేట్ రంగంలో పెట్టుబడులకు ఉత్తేజం కల్పించడం, మౌలిక సదుపాయాల అవరోధాలను తొలగించడంతోపాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు ఊతమిచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది
- గతనెల 28నాటికి 39,290 కోట్ల డాలర్లకు విదేశీ మారక నిల్వలు
- రెపో 0.25% తగ్గింపునకు ఎంపీసీలోని నలుగురు సభ్యుల మద్దతు
- రాష్ట్రాల పంట రుణాల మాఫీతో ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలకు గండి. ప్రభుత్వ పెట్టుబడులు బలహీనపడే అవకాశం
- మొండిబకాయిల పరిష్కారంతోపాటు ప్రభుత్వ బ్యాంకుల మూలధన పునర్వ్యవస్థీకరణకు కేంద్రం, ఆర్బీ ఐ కృషి
- ఇటు బ్యాంకులు, అటు కార్పొరేట్ సంస్థల ఆస్తుల నాణ్యత భారీగా తగ్గడం పెట్టుబడులకు అవరోధం
- ఈనెల 16న ఎంపీసీ భేటీ మినిట్స్ విడుదల
- ఎంపీసీ తదుపరి భేటీ అక్టోబర్ 3,4 తేదీల్లో

ఆదుకోని ఆర్బీఐ నిర్ణయం

■ 98 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్

ముంబై, ఆగస్టు 2: రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గించినప్పటికీ స్టాక్ మార్కెట్లకు ఎలాంటి ఉత్సాహనివ్వలేదు. ప్రారంభంలో మరో శిఖరాగ్రానికి చేరుకున్న సూచీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించిన మరుక్షణమే మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో ప్రారంభంలో 32,653 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ ఆ తర్వాత ఇంతటి స్థాయి లాభాలను నిలుపుకోలేకపోయింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 98,43 పాయింట్లు (0.30 శాతం) పతనం చెంది 32,476.74 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 33.15 పాయింట్లు తగ్గి 10,081.50 వద్దకు జారుకుంది. ద్రవ్యోల్బణం చారిత్రక కనిష్ఠ స్థాయికి చేరుకోవడం, పారిశ్రామిక



వృద్ధిరేటు మందగించిన నేపథ్యంలో ఈసారి సమీక్షలో వడ్డీరేట్ల తగ్గింపు ఉంటుందని అంచనాతో మదుపర్లు ఎలాంటి కొనుగోళ్లకు మొగ్గుచూపలేదని ట్రేడర్ వెల్లడించారు.

తగ్గిన బ్యాంక్, రియల్టీ, ఆటో షేర్లు
వడ్డీరేట్లకు సంబంధించిన బ్యాంకింగ్, రియల్టీ, ఆటో రంగాలకు చెందిన షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించడంతో ఈ రంగ షేర్లు నాలుగు శాతం వరకు పతనం చెందాయి. కొటక్ మహీంద్రా బ్యాంక్ 1.39 శాతం తగ్గింది. ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల షేర్లు ఒక శాతం వరకు తగ్గాయి. ఆటో రంగానికి చెందిన షేర్లలో అశోక్ లేలాండ్ 1.71 శాతం పతనమవగా, టాటా మోటార్స్ 1.66 శాతం, టీవీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి, బజాజ్ ఆటోలు తగ్గాయి. రియల్టీ రంగానికి చెందిన షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. యునిటెక్ అత్యధికంగా 4.31 శాతం పతనం చెందింది. శోభ, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఒబెరాయ్ రియల్టీ, డీఎల్ఎఫ్ షేర్లు తగ్గాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, రెడ్డీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, ఓఎన్‌జీసీ, ఎల్ అండ్ టీ, ఐటీసీ, కోల్ ఇండియా, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు కూడా పతనం చెందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో ఎన్‌టీపీసీ షేరు ధర 4.06 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. హీరో, అదానీపోర్ట్స్, లుపిన్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, విప్రో షేర్లు లాభాల్లో ముగిశాయి.

పీఎన్‌బీ లాభం 343 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వానికి చెందిన రెండో అతిపెద్ద ఆర్థిక సేవల సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) .. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం 12.09 శాతం పెరిగి రూ.343.40 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. ఎన్‌పీఏలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో వృద్ధి నమోదైందని బ్యాంక్ వెల్లడించాయి. ఆదాయం 7.36 శాతం పెరిగి రూ. 14,468.14 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

హైదరాబాద్‌లోని డాటావిండ్ ప్లాంట్లో సగానికి తగ్గిన ఉత్పత్తి

హైదరాబాద్, ఆగస్టు 2: చౌక ట్యాబ్లెట్ల తయారీ సంస్థ డాటావిండ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని సగానికి తగ్గించుకున్నది. దీంతో ఈ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. ఉపాధి కోల్పోయిన కార్మికులు తమకు న్యాయం చేయాలని పిటిషన్‌ను దాఖలు చేసినట్లు తెలంగాణ జాయింట్ కమిషనర్(కార్మిక) ఆర్ చంద్ర శేఖరం తెలిపారు. కార్మికులు పిటిషన్‌ను దాఖలు చేసినప్పటికీ, ఇంకా సంస్థ నుంచి ఎలాంటి సమాచారం లేదని, త్వరలో కంపెనీ ఉన్నతాధికారులతో సమావేశమవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తి తగ్గించుకునేదానిపై కంపెనీ ప్రతినిధి స్పందిస్తూ.. సికింద్రాబాద్‌లో మరో యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం..శంషాబాద్ యూనిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని ఈ యూనిట్‌కు తరలించాలనుకుంటున్నట్లు ఉద్యోగులకు సంస్థ సూచించింది.









ఉత్సాహంగా హరితహారం

మూడో విడుత హరితహారం ఊరూరా ఉత్సాహంగా సాగుతున్న ది. మంత్రులు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ మొక్కలు నాటుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లచైర్మన్లు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు హరిత ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. -నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్

1. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో మొక్క నాటుతున్న మంత్రి కేటీఆర్
2. నిజామాబాద్ బైపాస్ రోడ్డులో మొక్క నాటుతున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
3. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం నాగసాలలో మొక్కనాటుతున్న మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి
4. వికారాబాద్ జిల్లా తాండూరులో మొక్క నాటుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి



'విశ్వంభరుడు' ఆవిష్కరణ

సుప్రసిద్ధ కవి, రచయిత, దివంగత సినారెకు నివాళులు అర్పిస్తూ పలువురు కవులు, రచయితలు అక్షర నివాళిగా సృజించిన కవితలు, వ్యాసాలు, జ్ఞాపకాలతో అడుగు జాడలు పబ్లికేషన్స్ 'విశ్వంభరుడు' సంకలనాన్ని ప్రచురించింది. ఈ సంకలనాన్ని బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు జూలూరు గౌరీశంకర్, తెలంగాణ స్టేట్ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ దిలీప్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు.



మంగళవారం నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ జలాశయం వద్ద హెలీపాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

ఎస్సారెస్పీకి పునర్జీవం.. మరో చరిత్ర

కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టిన పథకమిది: మంత్రి హరీశ్‌రావు

కమ్మర్‌పల్లి నమస్తే తెలంగాణ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు పునర్జీవ పథకం మరో చరిత్ర అని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రూ.1,050 కోట్లతో చేపట్టనున్న పునర్జీవ పథకం పనులకు ఈనెల 10న ఎస్సారెస్పీ వద్ద సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం ఇక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. సీమాంధ్ర పాలకుల వివక్షతో వట్టిపోయిన ఎస్సారెస్పీకి పునర్జీవం పోయాలన్న ఆలోచన కేసీఆర్ ఆలోచనల నుంచి పుట్టిందన్నారు. 1964లో ఎస్సారెస్పీ నిర్మాణం ఒక చరిత్ర అయితే, కేసీఆర్ పునర్జీవ పథకం ద్వారా మరోచరిత్ర సృష్టిస్తున్నారని తెలిపారు. దీంతో కాకతీయ కాలువ, వరద కాలువ నిర్మాణంలో నష్టపోయిన రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. కాకతీయ, వరద కాలువల మధ్యలో కొత్తగా 80వేల ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందిస్తామని ప్రకటించారు. స్టేజ్-1 కింద 9.60 లక్షలు, స్టేజ్-2 కింద 4 లక్షల ఎకరాలు రెండు పంటలకు నీరంది ఎస్సారెస్పీ ఆయకట్టు సస్యశామలం కావడం ఖాయమన్నారు. ఈ పథకం ఫలితంగా 100 కిలోమీటర్ల వరద కాలువ ఒకటిన్నర టీఎంసీ నీటితో మూడు కాలాలపాటు మరో రిజర్వాయర్‌గా మారుతుందన్నారు. సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి పాల్గొన్నారు.

ట్వీట్‌కు స్పందించిన మంత్రి కేటీఆర్

పాఠశాలలో విద్యావలంటీర్ల నియామకం

మిడ్జిల్: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వల్లభురావుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య ఉందని గ్రామానికి చెందిన యువకుడు ఖాజా ట్విట్టర్‌లో పోస్ట్‌చేయగా మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలో ఉపాధ్యాయులు లేక చదువులు ముందుకుసాగడం లేదు. ఈ విషయాన్ని స్థానికులు డీఈవో, ఎంఈవోలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సదరు యువకుడు మంత్రికి ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. స్పందించిన మంత్రి కేటీఆర్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించగా, కలెక్టర్ ఎంఈవో ద్వారా ఇద్దరు విద్యావలంటీర్లను నియమించారు. మంత్రి చొరవను పలువురు అభినందించారు.

కన్న తల్లులను కాటికి పంపిన కొడుకులు

మద్యానికి బానిసై ఘాతుకానికి పాల్పడిన వైనం

కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఘటనలు



జాల చంద్రమ్మ (ఫైల్)

కరీంనగర్ క్రైం/ తిరుమలాయపాలెం: వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో కొడుకులు కన్న తల్లులను కాటికి పంపారు. మద్యానికి బానిసలుగా మారి తమ తల్లులను అత్యంత దారుణంగా హతమార్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడులో ఈ ఘటనలు బుధవారం చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్‌కు చెందిన మొగిలి పోచమ్మ(60) రోడ్లపై ఇనుము, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి కుటుంబాన్ని పోషిస్తున్నది. ఈమె కొడుకు ఎల్లయ్య తాగుడుకు బానిస కావడంతో కట్టుకున్న భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఏ పనీ చేయకుండా తల్లిమీదే ఆధారపడి బతుకుతున్నాడు. మద్యానికి డబ్బులు కావాలని బుధవారం తల్లిపై ఒత్తిడి చేశాడు. డబ్బులు లేవని చెప్పడంతో తల్లిని దారుణంగా కత్తితో నరికి చంపాడు.

తెట్టెలపాడులో..

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడుకు చెందిన జాల చంద్రమ్మ(70)కు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు. అందరి పెండ్లిండ్లు అయ్యాయి. మద్యానికి బానిసైన వీరన్న గత మూడు నెలలుగా మతిస్థిమితం కోల్పోయాడు. రాత్రి వేళ నిద్రించే సమయంలో అరుపులు, కేకలు పెడుతూ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేసేవాడు. మంగళవారం రాత్రి భార్య మహేశ్వరి, తల్లి చంద్రమ్మను కొట్టాడు. దీంతో చంద్రమ్మ అదే గ్రామంలోని కూతురు వెంకటమ్మ ఇంటికి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున అక్కడికి వెళ్లిన వీరన్న.. వెనుక గదిలో నిద్రిస్తున్న తల్లి గొంతు నొక్కి, గొడ్డలితో నరికి తీవ్రంగా గాయపర్చాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. డీఎస్పీ సురేశ్‌కుమార్, కూసుమంచి సీఐ కిరణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని సందర్శించి, నిందితుడు వీరన్నను అదుపులోకి తీసుకున్నారు.

ప్రజలే మా ప్రభువులు

- అభివృద్ధిపై న్యాయ నిర్ణేతలు వారే
- 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత తెలంగాణదే
- వచ్చే జూన్ నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి
- మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు

- వచ్చే జూన్ నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి
- మంత్రి కే తారకరామారావు



బుధవారం సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'ప్రజలే మా ప్రభువులు.. అభివృద్ధిపై న్యాయ నిర్ణేతలు వారే' అని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో గ్రామపంచాయతీ భవనానికి మిషన్ కాకతీయ ఫేజ్-3 కింద రూ.46.66 లక్షలతో చేపట్టిన వెంకటరాయని చెరువు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో మంత్రి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. భవిష్యత్తులో కరెంటు కష్టాలు, నీళ్లగోస ప్రజలకు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని కేటీఆర్ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు రాత్రనక పగలనక కరెంటు కోసం పంట చేల వద్ద పడిగాపులు కాసేవారన్నారు. అధికారుల కాళ్లు మొక్కినా.. పంటలు ఎండి నా కరెంటు ఇవ్వకుండా నానా తిప్పలు పెట్టారని గుర్తుచేశారు. స్వరాష్ట్రం సాధించుకున్న తరువాత 24గంటలపాటు కరెంటు ఇస్తామన్నా కొందరు రైతులు వద్దంటున్నారని ఇదీ బంగారు తెలంగాణలో వచ్చిన మార్పు అన్నారు. వచ్చే జూన్ నాటికి కాళేశ్వరం పనులు పూర్తవుతాయని చెప్పారు. ఇంటింటికీ నీరందించి గోదావరి జలాలతో ఆడపడుచుల కాళ్లు కడుగుతానన్న సీఎం హామీ త్వరలో నెరవేరుతుందన్నారు. మధ్య మానేరు ఎత్తిపోతల పథకంతో మల్కపేట చెరువుతోపాటు ఎగువ మానేరును నింపి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల బోర్లున్నాయన్నారు. అన్ని బోర్లు ఏకధాటిగా నడిస్తే పంటలకు నీరందడం కష్టంగా ఉంటుందన్నారు. అందుకే రైతులు గతంలో ఏర్పాటు చేసుకున్న ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై ఎవరెన్ని విమర్శలు చేసినా, ఎంత బురద చల్లినా.. తమను అప్రతిష్ఠపాలు చేయాలని చూసినా ప్రజలే తగిన సమాధానం చెపుతారన్నారు. సమావేశంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, సర్పంచ్ మాడుగుల సంజీవలక్ష్మి, జెడ్పీటీసీ తోట ఆగయ్య, ఎంపీటీసీ బోడ లక్ష్మి, రాష్ట్ర నాయకులు చిక్కాల రామారావు, శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేఎన్నికల్లో వారి డిపాజిట్లు గల్లంతే


- అందుకే ప్రతిపక్షాల రాద్ధాంతం
- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నిజామాబాద్‌లో పలువురు నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

నిజామాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని వ్యవసాయ శాఖమంత్రి పోచా రం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వారికి డిపాజిట్లు సైతం రావనే ఉద్దేశంతో సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగాల భర్తీ, అభివృద్ధి పనులు అడ్డుకోవడమే ధ్యేయంగా కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలకు చెందిన పలువురు నాయకులు, 950 మంది కార్యకర్తలు మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ నాయకులు గాదె కృష్ణ, తోటగోపాల్, కాంగ్రెస్‌కు చెందిన మధురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, టీడీపీ యువత అధ్యక్షుడు మాకు రవికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులు కావడంతోపాటు బంగారు తెలంగాణ సాధనలో సైనికులుగా పనిచేయడానికి అన్నివర్గాలు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, మేయర్ ఆకుల సుజాత, టీఆర్‌ఎస్ నాయకులు ఆర్ రాంకిషన్‌రావు, సుజిత్‌సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బాల్, సత్యప్రకాశ్, కిషన్, మాధవరావు గుజరాతి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



విఠల్‌రెడ్డి (ఫైల్)

కామారెడ్డి లీగల్ : స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ న్యాయవాది, కామారెడ్డి నియోజకవర్గ మొదటి ఎమ్మెల్యే జీడిపల్లి విఠల్‌రెడ్డి(95) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మాచారెడ్డి మండలంలోని ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన పాపిరెడ్డి, జానకమ్మలకు 1922లో జన్మించిన విఠల్‌రెడ్డి 1944లో స్వాంత్రోద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో న్యాయవాదిగా పనిచేశారు. ఈక్రమంలో 1952లో కామారెడ్డి దిసభ్య నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. అప్పట్లో సికింద్రాబాద్‌కు చెందిన రామారావు ఏకగ్రీవంగా ఎన్నికవగా కాంగ్రెస్ పార్టీ నుంచి విఠల్‌రెడ్డి , సోషల్‌పార్టీ నుంచి శేషాచారి పోటీచేశారు. శేషాచారిపై 27 వేల 606 ఓట్ల మెజార్టీతో విఠల్‌రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం కామారెడ్డి పట్టణంలో సిరిసిల్లరోడ్ ఎస్‌బీహెచ్‌వద్ద నివాసంలో ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌లో ఉంటూ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

బాలుడి ప్రాణం తీసిన టీవీ రియాలిటీ షో

నోట్లో కిరోసిన్ పోసుకొని నిప్పు అంటిస్తుండగా ప్రమాదం



కాశీ విశ్వనాథ్(ఫైల్)

మంథని, నమస్తే తెలంగాణ: టీవీ రియాలిటీ షో ఓ బాలుడి ప్రాణం తీసింది. ఓ టీవీలో వస్తున్న ప్రోగ్రాంను అనుకరించే క్రమంలో ప్రమాదం బారిన పడి మరణించాడు. వివరాలు ఇలా.. మంథని పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన దాసరి భూదేవి-లచ్చయ్య మనుమడు దాసరి కాశీ విశ్వనాథ్(13) గత నెల 31న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో టీవీలో వస్తున్న ఓ సాహస రియాల్టీ షోను చూస్తూ, దానిని అనుకరించే క్రమంలో నోటిలో కిరోసిన్ పోసుకొని అగ్గిపుల్లతో మంట పెట్టాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి, కాశీ విశ్వనాథ్ శరీరం దాదాపుగా 70శాతం వరకు కాలిపోయింది. పొగలు వస్తుండటాన్ని గమనించి చుట్టుపక్కల వారు ఆ ఇంట్లోకి వెళ్లి చూడగా, బాలుడు కాలుతూ కనిపించాడు. వెంటనే మంటలను ఆర్పివేసి, హుటాహుటిన మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాశీవిశ్వనాథ్ తల్లి రెండేళ్ల క్రితం చనిపోగా, అమ్మమ్మ తాత ఇతడిని పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదివిస్తున్నారు. హోంసిక్ హాలీడేస్‌లో భాగంగా హనుమాన్‌నగర్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. అంతలోనే ప్రమాదం బారిన పడి ప్రాణాలు వదిలాడు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య



వసంత (ఫైల్)

వికారాబాద్ టౌన్: అవమాన భారంతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వికారాబాద్ పట్టణ పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన పరశురాములు, సక్కీబాయి దంపతుల కూతురు వసంత(13) పెద్దేముల్ మండలం మంబాపూర్ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నది. ఈ మధ్యనే ఇంటికి వచ్చింది. పక్కనేగల బుజ్జిబాయి ఇంట్లో మంగళవారం సిమ్‌కార్డు కన్పించక పోవడంతో ఆ నెపాన్ని వసంతపై మోపారు. ఈ విషయమై గొడవ జరిగింది. సాయంత్రం మరోమారు కూడా గొడవ జరగ్గా వసంతపై చేయి కూడా చేసుకున్నారు. దీంతో తనకు జరిగిన అవమాన భారాన్ని భరించలేక వసంత తమ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపు తట్టారు. ఎంతకీ తీయకపోవడంతో గట్టిగా నెట్టి ఇంట్లోకి వెళ్లారు. అప్పటికే వసంత ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఇరుగు పొరుగు వారు వచ్చి బాలికను కిందికి దింపి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.



నారాయణపూర్ ప్రాజెక్ట్ పవర్ హౌస్ నుంచి దిగువకు (జూరాలకు) వస్తున్న నీళ్లు



భీమా ఫేజ్-2, స్టేజ్-2 లిఫ్టు నుంచి విడుదలైన నీటి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

జూరాలకు పోటెత్తనున్న వరద

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి అర్ధరాత్రి రెండు స్పిల్ వే గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కులు వదిలారు. దీంతో జూరాలకు వరద భారీగా తరలివస్తున్నది. బుధవారం ఉదయం వరకు 4,574 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, నారాయణపూర్ జలాశయం పవర్ హౌస్ నుంచి 6వేల క్యూసెక్కు లు దిగువకు వదులుతున్నారు. అదేవిధంగా ఎడమ కాల్వకు 8600 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, రీ జనరేటింగ్ వాటర్, స్పిల్ వే ద్వారా దాదాపు 22 వేల క్యూసెక్కులు కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు జూరాలకు రానున్నది.

పూర్తిగా నిండిన నారాయణపూర్..

నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యంతో జలకళను సంతరించుకున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 36.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 37.792 టీఎంసీలు. ఆల్మట్టి నుంచి 20,849 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. నారాయణపూర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటినిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో దిగువకు వదులుతున్నారు.

జూరాల నుంచి కొనసాగుతున్న ఔట్ ఫ్లో..

జూరాల ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకాలు, ఎడమ, కుడి కాల్వలకు 4,400క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాలకు 4,574 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో వాటర్ లెవల్ సమానంగా ఉంది. ప్రస్తుతం జూరాలలో 5.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నెట్టెంపాడ్ ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్టు-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 900, కుడి కాల్వకు 716, సమాంతర కాల్వకు 965, భీమా లిఫ్టు-2కు 283 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

భీమా ఫేజ్-2 స్టేజ్-2 నుంచి నీటి విడుదల

కొత్తకోట: ఈ ఏడాది జూరాల నీటితో ఎడున్నర లక్షల ఎకరాలు సాగయ్యేలా కృషి చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలోని భీమా ఫేజ్-2, స్టేజ్-2 లిఫ్టు నుంచి శంకరసముద్రం, కృష్ణా సముద్రానికి నీటిని ఎత్తిపోసే మోటర్లను ఆయన ప్రారంభించారు. గత ఏడాది దేవరకద్ర నియోజకవర్గంలో 82 చెరువులను నింపుకోవడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వరమ్మ భీంరెడ్డి, ఎంపీపీ గుంతమౌనిక పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	20849	20849	1705	1704.72	129.72	128.19
నారాయణపూర్	18240	38031	1615	1614.17	37.646	36.98
జూరాల	4574	4400	1045	1037.60	9.66	5.580
తుంగభద్ర	11412	469	1633	1612.55	100.86	40.37
శ్రీశైలం	80	80	885	777.90	215.807	19.59
నాగార్జునసాగర్	400	400	590	500.70	312.045	116.41
పులిచింతల	0	0	175	117.32	45.77	3.21
ప్రకాశం బ్యారేజీ	7493	7493	57.05	54.75	3.070	2.47



(జూన్1 నుంచి ఇప్పటివరకు 304.354 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	13308	2996	1522	1511.59	102.732	64.89
కడెం	0	848	700	688.10	7.6	4.883
ఎస్సారెస్పీ	0	182	1091	1055.50	90.313	9.66
సింగూరు	0	275	1717.93	1709.04	29.91	17.92
నిజాంసాగర్	0	35	1405	1380.30	17.803	1.35
ఎల్లంపల్లి	217	418	485	472.08	20.175	10.49
లోయర్‌మానేరు	0	129	920	893.65	24.07	7.394
ధవళేశ్వరం	43631	44094	45	45	2.93	2.93



కోడిపుంజుల వాగులో వరదనీరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వర్షం..

మణుగూరు, నమస్తేతెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, గుండాల, కరకగూడెం, దుమ్మగూడెం, చర్ల మండలాల్లో బుధవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మణుగూరులో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోడిపుంజుల వాగులో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. వర్షానికి వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది.

మారని తీరు..

- టైటాన్స్‌కు వరుసగా నాలుగో ఓటమి
- బెంగాల్ అద్భుత విజయం
- డ్రాగా ముగిసిన గుజరాత్, హర్యానా పోరు
- ప్రొ కబడ్డీ లీగ్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి:

మళ్లీ అదే వరుస.. ఏమాత్రం మారని తీరు.. సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ ఓటముల పరంపర కొనసాగుతూనే ఉంది. తొలిరోజు మినహా ఆ తర్వాత వరుస మ్యాచుల్లో పూర్తిగా తేలిపోతున్న టైటాన్స్ వరుసగా నాలుగో పరాజయాన్ని మూటగట్టుకుంది. డిఫెండర్లు రాణించినా రైడింగ్‌లో వైఫల్యంతో టైటాన్స్‌కు మరోసారి చుక్కెదురైంది. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ జట్టు 24-30 స్కోరు తేడాతో బెంగాల్ వారియర్స్ చేతిలో చిత్తుగా ఓడింది. మణీందర్ సింగ్ రైడింగ్‌లో చెలరేగి 11 పాయింట్లు సాధించడం బెంగాల్ వారియర్స్‌కు కలిసొచ్చింది. ఇక దక్షిణ కొరియాకు చెందిన స్టార్ ఆటగాడు జాంగ్ కున్ లీ 8 పాయింట్లతో మెరిసి బెంగాల్ విజయంలో కీలకమయ్యాడు. మొత్తంగా 19 రైడింగ్, 6 ట్యాకిల్, 2 ఆలౌట్, 3 ఎక్స్‌ట్రా పాయింట్లు గెలిచి వారియర్స్.. టైటాన్స్‌పై ఆధిపత్యం చాటుకున్నారు. టైటాన్స్ జట్టులో కెప్టెన్ రాహుల్ చౌదరి 5, నీలేశ్ సాలుంకే 5 రైడింగ్ పాయింట్లతో మెరిశారు.



ఉత్కం'టై'

గుజరాత్ ఫార్చ్యూనర్స్, హర్యానా స్టీలర్స్ జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్ టైగా ముగిసింది. చివరి 5 నిముషాలలో హర్యానా స్టీలర్స్ ఆటగాళ్లు 13 పాయింట్లు సాధించడంతో ఆట ముగిసే సమయానికి రెండు జట్లు 27-27 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచాయి. చివరివరకు రెండు జట్లు కొదమసింహాలను తలపించే ఆటతో కనువిందు చేయడంతో మ్యాచ్ ఆసాంతం ఉత్కంఠగా సాగింది. హర్యానా రైడర్లు సుర్జీత్ సింగ్ 6, వికాస్ ఖాందోలా 7, సురేందర్ నదా 7 పాయింట్లతో రాణించగా.. గుజరాత్ జట్టులో మహేంద్ర కుమార్ 5 రైడింగ్ పాయింట్లు సాధించాడు.
తొలిమ్యాచ్‌లో ఢిల్లీ దబాంగ్‌ను చిత్తు చేసిన ఉత్సాహంలో గుజరాత్ జట్టు ..హర్యానా స్టీలర్స్‌పై ప్రథమార్ధం నుంచే ఎదురుదాడి వ్యూహంతో నిలువరించే ప్రయత్నం చేసింది. తొలి రెండు నిమిషాల ఆటలో ఇరుజట్లు కూడా పాయింట్లు సాధించలేకపోయాయి. మూడో నిమిషంలో గుజరాత్ రెండు రైడింగ్ పాయింట్లతో ఆటలో ఊపు తీసుకువచ్చింది. అదే ఊపులో 4-0 పాయింట్లతో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఆరో నిమిషంలో ఖాతా తెరిచిన స్టీలర్స్ వరుసగా పాయింట్లు సాధించి గుజరాత్ ఆధిక్యాన్ని 4-5కు తగ్గించింది. అయినా గుజరాత్ 11-8తో ప్రథమార్థాన్ని ముగించింది. రెండో అర్ధభాగంలో సబ్‌స్టిట్యూట్‌గా దిగిన సుర్జీత్ సింగ్ రైడింగ్‌లో రెండు పాయింట్లు తేవడంతో స్టీలర్స్ 10-11 స్కోరుతో మళ్లీ పోరులోకి వచ్చింది. మ్యాచ్ 24వ నిమిషానికి 12-11తో హర్యానా ఆధిక్యంలోకి దూసుకెళ్లగా..గుజరాత్ జట్టు కోర్టులో ముగ్గురే మిగిలారు. ఈ సమయంలో సూపర్ ట్యాకిల్ పాయింట్ సంపాదించిన గుజరాత్ 13-12 తో ఆధిక్యం అందుకుంది. ఇక వరుసగా పాయింట్లు సంపాదిస్తూ వస్తున్న గుజరాత్ జట్టు 20-13 తో ఆధిక్యంలో ఉన్న సమయంలో అనూహ్యంగా ఆలౌటైంది. 22-15తో విజయంవైపు సాఫీగా సాగుతున్న గుజరాత్ జట్టుకు అనుకోని ప్రతిఘటన ఎదురైంది. 34వ నిమిషంలో హర్యానా ఆటగాడు వికాస్ సూపర్ రెయిడ్ సాధించడంతో గుజరాత్ ఆధిక్యం 22-20కు పడిపోయింది. ఇక చివర్లో రెండు జట్లూ వరుసగా పాయింట్లు సాధించడంతో మ్యాచ్ 26-26తో డ్రాగా ముగిసింది.



వీర్‌దేవ్ కంచు పట్టు

జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ కాంస్య పతక పోరుకు దీపక్

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు సత్తాచాటారు. ఒకరు కాంస్య పతకంతో మెరువగా, మరొకరు కాంస్య పతకపోరుకు చేరుకున్నారు. ఫిన్లాండ్‌లోని తాంపెరెలో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పురుషుల 74కిలోల ఫ్రీస్టయిల్ కేటగిరిలో భారత రెజ్లర్ వీర్‌దేవ్ గులియా కాంస్య పతకం సాధించాడు. కాంస్యం కోసం జరిగిన ఫైట్‌లో వీర్‌దేవ్ 8-5 స్కోరు తేడాతో జపాన్ రెజ్లర్ యమసాకి యజురోను చిత్తుచేశాడు. క్వార్టర్‌ఫైనల్ బౌట్‌లో ఓడిన వీర్‌దేవ్, అతని ప్రత్యర్థి ఫైనల్ చేరడంతో కాంస్య పతకపోరులో ఆడే అవకాశం దక్కింది. దీంతో తనకు అందివచ్చిన అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకున్న వీర్‌దేవ్ పతకంతో మెరిశాడు. ఇక 84 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో మరో భారత రెజ్లర్ దీపక్ పూనియా సెమీస్‌లో 0-11తో జాహిద్ (అమెరికా) చేతిలో ఓడాడు. దీంతో దీపక్ కాంస్యం కోసం అజర్‌బైజాన్ రెజ్లర్ గధిమురాద్ మగొమెడ్‌సైదోవ్‌తో తలపడనున్నాడు. మిగతా భారత రెజ్లర్లలో భరత్ పాటిల్ (55 కి), కరణ్ (66 కి), మోహిత్ (120 కి)లు ఆరంభరౌండ్లలోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

ఆసియా జూనియర్ బాక్సింగ్‌లో మనోళ్ల ముందంజ

న్యూఢిల్లీ: పిలిప్పీన్స్‌లోని పోర్టా ప్రిన్సెసాలో జరుగుతున్న ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు పతకాలు సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ముగ్గురు భారత బాక్సర్లు సేలయ్ రాయ్ (46 కిలోలు), భవేశ్ కటిమాని (52 కి), అమన్ షెరావత్ (70 కి)లు తమ విభాగాల్లో ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించారు. తొలిరౌండ్ బౌట్‌లో రాయ్.. జపాన్ బాక్సర్ తగవారుకాపై జడ్జీల ఏకగ్రీవ నిర్ణయంతో గెలుపొందాడు. మిగతా బౌట్లలో సౌదీ అరేబియాకు చెందిన మజ్రాషి జియాద్ అలీపై భవేశ్ నెగ్గగా, యూఏఈ బాక్సర్ సైఫ్ అల్కిందిని షెరావత్ ఓడించాడు. మరో భారత బాక్సర్ స్వప్నిల్ అనిల్ 50కిలోల విభాగం తొలిరౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన తగ్లాత్ సిరిమ్‌బెతోవ్ చేతిలో ఓడాడు.

సిరీస్‌ను కొట్టేస్తారా..!



ఊపుమీదున్న కోహ్లీసేన ▪ ఒత్తిడిలో శ్రీలంక ▪ నేటినుంచి రెండో టెస్ట్

అత్యుత్తమ ఫామ్‌లోనున్న భారత జట్టు గాలే వేదికగా తొలి టెస్టులో శ్రీలంకపై గర్జన చేసింది. ఆ మ్యాచ్‌ను నాలుగు రోజుల్లోనే ముగించిన కోహ్లీసేన ఇదే జోరులో కొలంబోనూ కొల్లగొట్టి సిరీస్ దక్కించుకోవాలనే కసితో ఉంది. మరోవైపు అనుభవలేమికి తోడు గాయాలతో సతమతమవుతున్న లంక రెండోమ్యాచ్‌లోనైనా నెగ్గి సొంతగడ్డపై పరువు కాపాడుకోవాలన్న ఆరాటంలో ఉన్నది.

కొలంబో:

సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కు శ్రీలంకకు చాలా వైరుధ్యమున్నది. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుంటే..అందుకు భిన్నంగా ఉపఖండ దేశం లంక ఏడో ర్యాంక్‌లో ఉన్నది. సొంతగడ్డపై వరుస టెస్ట్ సిరీస్ విజయాలతో యమదూకుడు మీదున్న కోహ్లీసేన..అదే జోరును లంకలోనూ కొనసాగిస్తున్నది. సరిగ్గా రెండేండ్ల క్రితం గాలెలో తమకు ఎదురైన పరాజయానికి రికార్డు విజయంతో కోహ్లీసేన ప్రతీకారం తీర్చుకున్నది. పరుగుల పరంగా లంకకు కలకాలం మర్చిపోలేని ఓటమిని కట్టబెట్టింది. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో రాణించడంతో టీమ్ ఇండియా గెలుపు నల్లేరుపై నడకే అయ్యింది. దీనికి తోడు లంక జట్టు అనుభవలేమి మనకు బాగా కలిసొచ్చింది. ఇదే గెలుపు జోరును కొలంబోనూ కొనసాగించాలనుకుంటున్న భారత్...చీఫ్ కోచ్ రవిశాస్త్రి పర్యవేక్షణలో పక్కా ప్రణాళికతో సిద్ధమైంది.

రాహుల్ రీఎంట్రీ

రెగ్యులర్ ఓపెనర్ లోకేశ్ రాహుల్ పునరాగమనం ఖాయమైంది. భుజం గాయం నుంచి కోలుకుని లంకతో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన రాహుల్ అనూహ్యంగా వైరల్ జ్వరంతో గాలె టెస్ట్‌కు దూరమయ్యాడు. అయితే జ్వరం నుంచి కోలుకున్న రాహుల్ నెట్‌ప్రాక్టీస్‌లో చురుగ్గా పాల్గొన్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని అతణ్ని తుది జట్టులోకి తీసుకుంటామని కెప్టెన్ విరాట్ స్పష్టం చేశాడు. రాహుల్ రాకతో గాలె టెస్ట్‌లో సూపర్‌గా రాణించిన ధవన్, అభినవ్ ముకుంద్‌లలో ఒకరికి ముప్పు తప్పకపోవచ్చు. ఇదే విషయమై కెప్టెన్ కోహ్లీ మాట్లాడుతూ ఆటగాళ్ల మెరుగైన ప్రదర్శనతో జట్టులో పోటీవాతావరణం నెలకొన్నదని, ఎవరిని ఎంపిక చేయాలనేది ఒకింత క్లిష్టంగా తయారైందని చెప్పుకొచ్చాడు. ఇక్కడే అర్థమవుతుంది..మనోళ్లు ఏ స్థాయిలో అదరగొడుతున్నారో. గురువారం మొదలయ్యే రెండో టెస్ట్‌లో అంత భారీ మార్పులేమి ఉండకపోవచ్చు.

గాయాలతో సతమతం:

శ్రీలంక జట్టు గాయాలతో సతమతమవుతున్నది. ఇప్పటికే గుణరత్నే సిరీస్ నుంచి పూర్తిగా నిష్క్రమించగా, వెన్నునొప్పితో పేసర్ సురంగ లక్మల్ కొలంబో టెస్ట్‌కు దూరమయ్యారు. మరోవైపు లంకకు ఆయువుపట్టు అయిన సీనియర్ స్పిన్నర్ హెరాత్ రెండో టెస్ట్‌లో ఆడేది అనుమానంగా మారింది. బౌలింగ్ వేసే చేతికే గాయం కావడంతో హెరాత్ రెండో టెస్ట్‌కు అందుబాటులో ఉంటాడా అన్నది ఆఖరు వరకు తెలిసేలా లేదు. దీనిపై లంక క్రికెట్ మేనేజర్ అసనకా గురుసిన్హా మాట్లాడుతూ 'హెరాత్ గాయాన్ని పరిశీలిస్తున్నాం. గాయం పచ్చిగా ఉండటంతో బౌలింగ్ చేయడం అంత సులువు కాదు. మ్యాచ్ సమయానికి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే అతను తుదిజట్టులో ఉంటాడు' అని అన్నాడు. మరోవైపు న్యూమోనియా నుంచి కోలుకున్న రెగ్యులర్ కెప్టెన్ చండీమల్ తిరిగి జట్టులోకి రావడం కొంతలో కొంత ఉపశమనం. దీనికి తోడు లాహిర్ తిరిమానేను తిరిగి జట్టుకు ఎంపిక చేశారు. మరి ఇప్పటికైనా..లంక భారత్‌కు కొలంబోలో కనీసం పోటీ ఇస్తుందో లేదో చూడాలి.





50 పుజారాకిది కెరీర్‌లో 50వ టెస్టు. శ్రీలంకలో పుజారాకు మంచి రికార్డుంది. ఈ వేదికపై అత్యుత్తమంగా 2015లో ఓ మ్యాచ్‌లో అజేయంగా 145 పరుగులు చేశాడు.

మరో 50 పరుగులు చేస్తే అశ్విన్ టెస్టుల్లో 2000 పరుగుల మైలురాయిని అందుకుంటాడు.

జట్ల అంచనా

భారత్: కేఎల్ రాహుల్, శిఖర్ ధవన్, చతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ (కెప్టెన్), అజింక్యా రహానే, ఆర్ అశ్విన్, వృద్ధిమాన్ సాహ (వికెట్‌కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ఉమేశ్ యాదవ్, మహమ్మద్ షమీ.

శ్రీలంక: ఉపుల్ తరంగ, దిముత్ కరుణరత్నే, కుశాల్ మెండిస్, దినేశ్ చండీమల్ (కెప్టెన్), ఏంజెలో మాథ్యూస్, నిరోషన్ డిక్వెల్లా (వికెట్‌కీపర్), ధనంజయ డిసిల్వా, దిల్‌రువాన్ పెరెర, రంగన హెరాత్, మలింద పుష్పకుమార, నువాన్ ప్రదీప్.

ప్రీక్వార్టర్స్‌లో కశ్యప్ X సౌరభ్

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రీ గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు టైటిల్ దిశగా దూసుకెళుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ, సిరిల్ వర్మ ప్రీక్వార్టర్స్ చేరారు. ప్రణయ్ 23-21, 21-18తో ఫిర్మాన్ అబ్దుల్ ఖోలిక్ (ఇండోనేసియా)పై, కశ్యప్ 21-9, 21-8తో స్థానిక షట్లర్ ఆస్కార్ గువాపై గెలుపొందారు. సౌరభ్ 21-16, 21-16తో హెన్రిఖో ఖో విబోవో (ఇండోనేసియా)పై, సిరిల్ వర్మ 21-14, 21-16తో సపుతా విక్కీ అన్‌గాపై నెగ్గారు. ప్రీక్వార్టర్స్‌లో వీన్ నాన్‌తో ప్రణయ్ తలపడనుండగా.. మరో ప్రీక్వార్టర్ పోరులో భారత్‌కే చెందిన కశ్యప్, సౌరభ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

పారా అథ్లెట్లుగా గుర్తించండి

ప్రభుత్వానికి డెఫొలింపియన్స్ డిమాండ్

న్యూఢిల్లీ: పారా అథ్లెట్లతో సమానంగా మమ్మల్ని కూడా గుర్తించి నజరానాలు అందించాలంటూ డెఫ్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన బధిర అథ్లెట్లు డిమాండ్ చేశారు. టర్కీలోని సామ్‌సున్ నగరంలో గత నెల 18 నుంచి 30వ తేదీవరకు జరిగిన డెఫొలింపిక్స్‌లో మన దేశానికి చెందిన బధిర అథ్లెట్లు ఒక స్వర్ణం, ఒక రజతం సహా 3 కాంస్యాలు సాధించి పతకాల పట్టికలో భారత్‌ను 26వ స్థానంలో నిలిపారు. విజయానందంలో ఉన్న 46 మంది బధిర అథ్లెట్లు మంగళవారం ఢిల్లీ విమానాశ్రయంలో దిగగా.. వారిని స్వాగతించడానికి క్రీడాశాఖ నుంచి ఏ స్థాయి అధికారి కూడా రాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన వీళ్లంతా.. తమను ఇంత అవమానిస్తారా అంటూ అక్కడే నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.. దీంతో క్రీడాశాఖకు చెందిన ప్రాజెక్ట్ అధికారి ఒకరు విమానాశ్రయం చేరుకుని బధిర అథ్లెట్లను శాంతింప చేశారు. బుధవారం కేంద్ర క్రీడాకార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్‌ను కలిసిన బధిర అథ్లెట్ల బృందం తమను కూడా పారాలింపియన్స్ తరహాలో గుర్తించి అన్ని రకాల సౌకర్యాలు.. బహుమతులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డెఫొలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన వీరేందర్ కుమార్ (74 కేజీలు ఫ్రీస్టైల్ రెజ్లింగ్) కోచ్ మహా సింగ్ రావ్ మీడియాతో మాట్లాడారు. 'విమానాశ్రయానికి క్రీడాకార్యదర్శి రాకపోవడం తీవ్రంగా బాధించింది. డెఫొలింపియన్స్‌ను కూడా పారాలింపియన్స్‌లాగా గుర్తించాలని కోరుకుంటున్నాము. ఇదే విషయాన్ని సాయ్ డైరెక్టర్ జనరల్ ముందు పెట్టి మా డిమాండ్‌ను నెరవేర్చాలని కోరాం' అని చెప్పారు.



క్వార్టర్స్‌లో పల్లికల్ జోడీ

మాంచెస్టర్: ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ జోడీ దీపికా పల్లికల్-జోష్నా చినప్ప మహిళల డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-బిలో మూడో లీగ్ మ్యాచ్‌లో పల్లికల్ జంట 11-8, 11-7తో వేల్స్‌కు చెందిన ఎవాన్స్-సఫారీ జోడీని చిత్తుచేసి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. పల్లికల్, జోష్నలు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ తమ భాగస్వాములతో కలిసి ముందంజ వేశారు. పల్లికల్-సౌరవ్‌జోడీ 11-7, 11-4తో మలేసియాకు చెందిన మహమ్మద్-రేచల్ జంటపై, జోష్న-విక్రమ్ ద్వయం 11-9, 11-9తో న్యూజిలాండ్ జోడీ మిల్లర్-అమందాపై గెలిచారు.

'ఈ నెల 8లోగా కార్యవర్గ జాబితా పంపండి'

న్యూఢిల్లీ: కార్యవర్గ సభ్యుల జాబితాను ఈనెల 8లోగా పంపాలంటూ అన్ని రాష్ట్ర క్రికెట్ సంఘాలకు బీసీసీఐ పరిపాలన కమిటీ (సీవోఏ) ఆదేశాలు జారీచేసింది. తమ సంఘాల్లోని సభ్యుల వివరాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా ఆయా సంఘాల అధికారిక వెబ్‌సైట్లలో పొందుపరచాలంటూ 30 రాష్ట్ర సంఘాలకు సీవోఏ బుధవారం ఈమెయిల్ చేసింది. సీవోఏ సభ్యులు ఈనెల 9న ముగ్గురు బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, సీఈవోతో సమావేశమై రాష్ట్ర సంఘాల సభ్యుల అంశంపై చర్చించనుంది.

ప్రజ్ఞయ్ సెంచరీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి: హెచ్‌సీఏ మూడురోజుల డివిజన్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో సాయి ప్రజ్ఞయ్ రెడ్డి శతక్కొట్టాడు. హైదరాబాద్‌లో బుధవారం ఆంధ్యా బ్యాంక్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ప్రజ్ఞయ్ (119 నాటౌట్) అజేయ సెంచరీ సాధించడంతో డీసీ జట్టు తొలిరోజ ఆట ముగిసేసరికి మూడు వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. రేవంత్ (57), వరుణ్ గౌడ్ (56 నాటౌట్)లు అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు.

ఇక్కడ ఫుట్‌బాల్‌ను కాపాడండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి:



రాష్ట్రంలో ఫుట్‌బాల్‌కు ఆదరణ కరువైందనీ, ఈ క్రీడను కాపాడాలంటూ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ మాజీ ఆటగాళ్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒకప్పుడు ఫుట్‌బాల్‌కు పుట్టినిల్లుగా మారిన హైదరాబాద్‌లో ఇప్పుడు ఒక్క ఆటగాడు కూడా జాతీయస్థాయికి ఎదగలేకపోతున్నారని మాజీలు అంటున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన మాజీ ఆటగాళ్లు, ఒలింపియన్లు షమీమ్ అలీమ్, షాహిద్ హకీమ్, నోవీ కపాడియా, హమీద్‌లు కలిసి బుధవారం నగరంలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ, గతంలో అంతర్జాతీయస్థాయిలో భారత ఫుట్‌బాల్‌కు సేవలు అందించిన హైదరాబాద్ ఆటగాళ్లు అజీజుద్దీన్, అజీజ్, హబీబ్‌లను ఎవరూ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటలో ఎంతో ప్రతిభ చూపినా, వీళ్లకు పద్మశ్రీ కానీ, మరే పురస్కారాలు దక్కకపోవడం విచారకరమన్నారు. కనీసం ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి మాజీలను తగురీతిలో గౌరవించాల్సిన అవసరముందన్నారు. అలాగే రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.




మంచిర్యాలలోని గాంధారి వనం పార్కు ముఖద్వారం

రాష్ట్రంలో మరో 80 పట్టణ పార్కులు

- ప్రణాళిక సిద్ధంచేసిన అటవీశాఖ
- అర్బన్ లంగ్‌స్పేస్‌లు అద్భుతం: కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అన్ని పట్టణాలు, నగరాలకు సమీపంలో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి మరో 80 పట్టణ పార్కులను నిర్మించడానికి అటవీశాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. ఇందుకోసం రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 3,354 హెక్టార్ల భూమిని ఎంపిక చేసింది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ, శంషాబాద్ కొత్వాల్ గూడ, మేడ్చల్ జిల్లాలోని దూలపల్లి, నాగారం, మేడిపల్లిలో అన్ని హంగులతో 12 పట్టణ పార్కులు (లంగ్‌స్పేస్ పార్క్) నిర్మాణం పూర్తయ్యాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అర్బన్ పార్కులలో నడక కోసం వాకింగ్ పాత్‌వే, సైకిలింగ్ కోసం సైకిల్ ట్రాక్, పిల్లలు ఆడుకునే విధంగా చిల్డ్రన్ కార్నర్‌లను ఏర్పాటుచేశారు. యోగాసెంటర్లను, భారీ చెట్ల కింద రచ్చబండలను కూడా నెలకొల్పారు. పట్టణ ప్రాంతాలలో అటవీభూములను గుర్తించి వాటిలో కొంతభాగం ప్రకృతి రమ



మంత్రి కేటీఆర్



మంత్రి జోగు రామన్న

ణీయ వాతావరణం మధ్య పార్కులను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. దీంతో పట్టణప్రాంతాల్లో ఒక్కో పార్క్‌ను ఒక్కో థీమ్‌తో ఏర్పాటు చేస్తున్నారు. ఇదేవిధంగా మరో 80 అర్బన్ పార్కులను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. పెద్దపల్లి రామగుండం పార్క్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొంపల్లి, కాళేశ్వరం, లక్నవరం డీర్ రెస్క్యూ సెంటర్, బొగత వాటర్ ఫాల్స్, వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల ఎకో-టూరిజం పార్క్, సిద్దిపేట జిల్లాలోని మర్పడగ, సింగపూర్, మహబూబ్‌నగర్ జిల్లాలోని మయూరి ఎకో-పార్క్, గద్వాల జిల్లాలో తిరుమల నట స్వామి ఎకో-పార్క్, రంగారెడ్డి జిల్లాలోని అలిపల్లిలో మజీద్‌గడ్డ పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. వీటి నిర్మాణాలకు రూ.25 కోట్లను కూడా విడుదల చేశారు.

లంగ్‌స్పేస్‌లు భేష్: కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ చుట్టూ అటవీశాఖ ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులు అద్భుతంగా ఉన్నాయని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కే తారక రామారావు ట్వీట్ చేశారు. అటవీ, పర్యావరణశాఖల మంత్రి జోగురామన్న నాయకత్వంలో అధికారులు సమర్థంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఫారెస్ట్ సర్ భాగ్యనగర్ నందనవనం, గుర్రంగూడ చిలుకూరు జాతీయ పార్క్, కండ్లకోయ, శంషాబాద్ పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని అధికారులను అభినందించారు. దీనిపై కేటీఆర్‌కు మంత్రి జోగురామన్న కృతజ్ఞతలు తెలిపారు.

బజాజ్ కమిటీకి ఏపీ లేఖ ఎలా అందింది?

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

కృష్ణా జలాల వినియోగం, పంపిణీపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడానికి ఏర్పాటైన కృష్ణానదీ జలాల యాజమాన్యబోర్డు నిష్పక్షపాతంగా ఉన్నదా? లేక ఏపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నదా?..ఈ సందేహాలు మొదటి నుంచి ఉన్నాయి. ఢిల్లీలో బుధవారం బజాజ్ కమిటీ సమావేశం కృష్ణాబోర్డు ఏపీకి అనుకూలంగా పనిచేస్తున్నదనే విషయాన్ని రూఢీ చేసే విధంగా జరిగింది. కేవలం కృష్ణాబోర్డు చైర్మన్ శ్రీవాస్తవ మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు. ఏపీ నుంచి ఎవరూ రాలేదు. అయినా ఏపీ తరపున లేఖ సమావేశానికి చేరింది. దీంతో ఆ లేఖ బజాజ్ కమిటీకి ఎవరు అందించారన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీవాస్తవ వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌లోకి నీటిని అక్రమంగా మళ్ళిస్తున్నందువల్ల ఎగువ రాష్ట్రంగా తమకు వాటా ఇవ్వాల్సిందేనని తెలంగాణ పట్టుబడుతున్నది. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని బజాజ్ కమిటీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత అప్పజెప్పింది. ఇందుకోసమే చైర్మన్ బజాజ్ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణను ఆహ్వానించలేదు. మా వాదనలను వినిపించే అవకాశం ఇవ్వాలని తెలంగాణ కోరినా ఏపీ నుంచి అడ్డుపుల్ల వేసింది. మొదట ఏపీ ప్రతినిధులను వెంట తీసుకు వెళదామనుకున్న శ్రీవాస్తవ, తెలంగాణ అభ్యంతరంతో ఒక్కరే వెళ్లారు. ఏపీ ప్రతినిధులు వెళ్లకున్నా ఏపీ తరపున బజాజ్ కమిటీకి లేఖ అందింది. ఆ లేఖలోని ముఖ్యమైన వివరాలు 'నమస్తే తెలంగాణ'కు అందాయి. లేఖలో ఏపీ మూడు అంశాలను ప్రస్తావించింది. ఏపీ పట్టిసీమ, పోలవరం

> **ఆ రాష్ట్ర ప్రతినిధులు రాకున్నా ఆ లేఖ మోసిందెవరు?**
> **కృష్ణాబోర్డు ఏపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నదా?**
> **నీటి వాటాలను నిర్ణయించే అధికారం కమిటీకి లేదని లేఖలో ఏపీ మొండి వాదన**
> **పట్టిసీమ, పోలవరం నీటి మళ్లింపులపై తెలంగాణకు వాటా ఎగవేసేందుకు కుట్ర**

ప్రాజెక్టుల ద్వారా కేవలం 80 టీఎంసీల నీటిని మాత్రమే తరలిస్తున్నట్లు తెలిపింది. గోదావరి నది పరీవాహక ప్రాంతం నుంచి కృష్ణా పరీవాహక ప్రాంతంలోకి నీటిని తరలిస్తున్న అంశానికి సంబంధించి చర్చించినట్లయితే తెలంగాణ ఐదు ప్రాజెక్టుల ద్వారా 211.145 టీఎంసీల నీటిని తరలించే అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొంది. నిజానికి ఇది వాస్తవ విరుద్ధం. అయినా ఏపీ పాత వాదననే మళ్ళీ ప్రస్తావించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పట్టిసీమ ప్రాజెక్టు ప్రస్తావన లేనందు వల్ల ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోకి తరలించడంపై చర్చించాల్సిన అవసరం లేదని, తెలంగాణకు వాటా ఇవ్వాలని ఎక్కడా చట్టంలో లేదని రెండో అంశంగా పేర్కొంది. కృష్ణాజలాల పంపిణీకి అసలు బజాజ్ కమిటీకి ఎలాంటి చట్టబద్ధమైన అధికారాలు లేవని, ఆ అధికారం కేవలం ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉన్నదని మూడో ప్రధానం అంశంగా ప్రస్తావించింది. అటువంటి బజాజ్ కమిటీకి నీటి వాటాలను నిర్ణయించే అధికారాన్ని కట్టబెట్టే అధికారం కేంద్ర ప్రభుత్వానికి కూడా లేదని రాసింది. అంతర్ రాష్ట్ర నదీ జలాల చట్టం(1956) ప్రకారం రాష్ట్రాలకు నీటి వాటాలను నిర్ణయించడం అనేది జలవివాదాల కిందికే వస్తుందని, ఇందులో జోక్యం చేసుకునే అధికారం కేవలం ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉన్నదని వాదించింది. లేఖలోని సారాంశం ఇలా ఉంటే, అసలు ఈ లేఖ బజాజ్ కమిటీకి ఎలా చేరిందనేది కీలకం. ఈ లేఖను మోసుకెళ్ళిందెవరు, ఎందుకు మోసుకెళ్ళాల్సి వచ్చిందనే ప్రశ్నలకు బజాజ్ కమిటీ, కృష్ణా బోర్డు చైర్మన్ సమాధానం చెప్పాల్సి ఉంది. పక్షపాతం లేకుండా పనిచేయాలిన సంస్థలు ఒక రాష్ట్రానికి అనుకూలంగా పని చేస్తున్నట్లు గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి. గోదావరి జలాలను ఏదైనా ప్రాజెక్టు ద్వారా కృష్ణా బేసిన్‌లోకి మళ్ళిస్తే ఎగువ రాష్ట్రాలకు ఆ మేరకు నిష్పత్తి ప్రకారం నీటి వాటాను ఇవ్వాల్సి ఉంటుందని జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పులో స్పష్టంగా ఉంది. అది పోలవరం కావచ్చు. పట్టిసీమ కావచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉనికిలోకి వచ్చేనాటికి పట్టిసీమ ప్రస్తావన లేదు కాబట్టి చట్టంలో దాని గురించి రాయలేదు. ఇలాంటివి జరుగువచ్చుననే బచావత్ ట్రిబ్యునల్ దూరదృష్టితో ఆలోచించి రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలకు ఆస్కారంలేని విధంగా తరలించిన జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని పేర్కొన్నది. ఈ ప్రకారంగా పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి కృష్ణా నదిలోకి వెళ్తున్న నీటిలో ఎగువ రాష్ట్రమైన తెలంగాణకు వాటా రావాలన్నది ట్రిబ్యునల్ తీర్పు సారాంశం. కానీ ఏపీ మాత్రం తన సహజమైన తొండి వైఖరితో మొండి వాదన చేస్తున్నది. తెలంగాణ 211 టీఎంసీల నీటిని మూసీ, మున్నేరు, పాలేరు తదితరాలకు తరలిస్తున్నదని నీటి మొత్తాల్లో వీటి విషయం కూడా కమిటీ చర్చించాలని చెప్తూనే పట్టిసీమ విషయంలో మాత్రం డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నది.



బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న గవర్నర్ నరసింహన్

రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

- ఢిల్లీలో ప్రధాని ప్రభృతులతో నరసింహన్ సమావేశం
- గవర్నర్ల మార్పులు, కొత్త బాధ్యతలపై చర్చ?

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఢిల్లీ చేరుకున్న గవర్నర్ నరసింహన్ రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. త్వరలో వివిధ రాష్ట్రాల గవర్నర్లను మారుస్తారని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో పై ముగ్గురితో ఆయన భేటీ కావడం కొత్త ఊహాగానాలకు తెర లేపింది. అయితే నరసింహన్ మాత్రం తాను కేవలం మర్యాదపూర్వకంగా వారిని కలుసుకున్నాను తప్ప అంతకు మించిన ప్రాధాన్యంలేదని అన్నారు. కొత్త రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఈ పర్యటన సందర్భంగా ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా గవర్నర్ల మార్పుల గురించి చర్చకు వచ్చినట్లు తెలిసింది. రెండు తెలుగు రాష్ట్రాలకు వేర్వేరు గవర్నర్లను నియమించాలని కేంద్రం భావిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఏ రాష్ట్రంలో ఉండాలనుకుంటున్నారు? లేదా కొత్త బాధ్యతలు అప్పగిస్తే వెళతారా? అనే అంశాలపై నరసింహన్ అభిప్రాయాన్ని రాష్ట్రపతి తెలుసుకున్నట్లు సమాచారం. రాష్ట్రపతితో భేటీ అనంతరం ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్రసింగ్‌తో గవర్నర్ భేటీ అయ్యారు. తర్వాత ప్రధానితోనూ సమావేశమయ్యారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దడానికి జాతీయ భద్రతాసలహాదారు నేతృత్వంలో ప్రత్యేకంగా ఒక వ్యూహాత్మక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తున్నది. దీనికి సంబంధించి నరసింహన్‌కు నూతన బాధ్యతలు అప్పజెప్పడంపై ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీనిగురించి గవర్నర్‌ను ప్రశ్నించగా ఇవేవీ తనకు తెలియదని చెప్పారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్న నిందితుడు రీఫెల్ ఎలెక్స్ విక్టర్‌ను మీడియాకు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు, (ఇన్‌సెట్) కొకైన్ ప్యాకెట్లు

వస్త్రం చాటున మత్తు దందా

- ఎక్సైజ్ ఎస్టీఫ్ సిబ్బందిపై దక్షిణాఫ్రికా నిందితుడి దాడి
- చేజ్‌చేసి పట్టుకున్న అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వస్త్ర వ్యాపారం పేరుతో డ్రగ్స్ దందా సాగిస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన మరొకరిని ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) అరెస్ట్ చేసింది. అధికారులపై దాడి చేసి పరుగులు తీసిన నిందితుడిని.. వెంబడించి మరీ పట్టుకున్నది. మంగళవారం రాత్రి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం వద్ద కాపుకాసి డ్రగ్స్‌కేసులో కీలకమైన రీఫెల్ ఎలెక్స్ విక్టర్‌ను అదుపులోకి తీసుకుని, 10 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నట్టు బుధవారం ఎస్టీఎఫ్ ఏఈఎస్ వివేక్ తెలిపారు. నిందితుడిని ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో మీడియాకు చూపించారు. ముంబై కేంద్రంగా బట్టల వ్యాపారం నిర్వహిస్తున్న విక్టర్ మూడుసార్లు హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్‌ను సరఫరా చేశాడని, ఎవరికి, ఎంత సరఫరా చేశాడనే దానిపై ఇంకా స్పష్టతరాలేదని చెప్పారు. నగరంలో రెగ్యులర్‌గా డ్రగ్స్ వాడే వారికి వీటిని సరఫరా చేస్తున్నట్టు అనుమానాలున్నాయన్నారు. పూర్తివివరాల కోసం ఆఫ్రికా ఎంబసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నైజీరియన్ డ్రగ్స్ కేసులో పురోగతి

నైజీరియన్ డ్రగ్స్ ముఠా కేసులో పురోగతి కనిపిస్తున్నది. ముఠా సభ్యుల నోరువిప్పడంతో డ్రగ్స్ కొన్న ఆరుగురికి నోటీసులు జారీచేసినట్టు రాచకొండ పోలీసులు వెల్లడించారు. గత నెల 23న ఎల్బీనగర్ ప్రాంతంలో విజయవాడకు చెందిన మహిళతోపాటు ఐదుగురు నైజీరియన్లను రాచకొండ పోలీసులు అరెస్టుచేశారు. విచారణ కోసం విజయవాడకు చెందిన సంగీత, కాస్మోస్, జాన్‌పాల్, హెన్రీలను కస్టడీకి తీసుకుని విచారించగా, కాస్మోస్ ఆరుగురి పేర్లను బయటపెట్టారు. ముఠా నుంచి డ్రగ్స్‌ను ఖరీదు చేసిన అన్నారపు పవన్‌కుమార్‌రెడ్డి (కొత్తగూడ), కే సందీప్‌రెడ్డి (జూబ్లీహిల్స్), సామ్యూల్ జాన్ (రెడ్డి నగర్), ఏ ఆకాశ్ (బంజారాహిల్స్), సామ అర్జున్‌రెడ్డి(అయ్యప్ప సొసైటీ, మాదాపూర్), సామ అమరసింహారెడ్డి (జూబ్లీహిల్స్)కి నోటీసులు జారీచేశారు. వీరిని విచారించి మూడునెలలుగా డ్రగ్స్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. ఆరుగురి అంగీకారంతో రక్తం, వెంట్రుకలు, గోళ్ల నమూనాల సేకరణకు ఉస్మానియాకు సిఫార్సు చేశామని, నివేదిక ఆధారంగా చర్యలను తీసుకుంటామనిఎల్బీనగర్ డీసీపీ తెలిపారు.

డ్రగ్స్‌పై మరింత నిఘా

- పబ్బులు, క్లబ్బులు, బార్లపై ఎస్టీఎఫ్ ఆకస్మిక దాడులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మత్తు మకిలిని పూర్తిస్థాయిలో కడిగేసేందుకు తెలంగాణ సర్కారు అన్నిచర్యలు చేపడుతున్నది. పబ్బులు, క్లబ్బులు, బార్లు అడ్డాగా డ్రగ్స్ దందా సాగుతున్నట్టు అనుమానించి నిర్వాహకులకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం హెచ్చరికలు జారీచేసింది. బానిసలుగా మారుస్తున్న డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తులు చేస్తూనే.. మాట వినకపోతే లైసెన్స్‌లు రద్దుచేస్తామని, కేసులు తప్పవని స్పష్టంచేస్తున్నది. ఇకనుంచి పబ్బులు, క్లబ్బులు, బార్లలో డ్రగ్స్ వినియోగిస్తే.. అందుకు వాటి నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని సిట్ అధికారులు స్పష్టంచేశారు. అక్కడ కొచ్చే వినియోగదారులను గమనించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని, ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, ఉపయోగిస్తున్నట్టు తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగిస్తూ ఎవరైనా పట్టుబడితే వెంటనే నిర్వాహకుల లైసెన్స్‌లను రద్దుచేస్తామని హెచ్చరించారు.

అనుమానిత బార్లపై కన్ను

డ్రగ్స్ వ్యవహారంలో అమీర్‌పేట ఆబ్కారీ స్టేషన్ పరిధిలోని 7, సికింద్రాబాద్ పరిధిలోని 2, నాంపల్లి పరిధిలోని 6, జూబ్లీహిల్స్ పరిధిలోని 12 పబ్బులు, క్లబ్బులు, బార్లకు నోటీసులు జారీచేసిన సిట్ అధికారులు.. వాటి నిర్వాహకులను విచారణకు రప్పించారు. ఎక్సైజ్ ప్రధాన కార్యాలయలో సిట్ ముందు నగరంలోని 14 పబ్బుల నిర్వాహకులు హాజరయ్యారు. వీటిలో ప్రధానంగా ఒవర్ ద మ్యాన్, బీ అండ్ సీ, కిస్మత్, ఎయిర్ పబ్, హాట్ కప్ కాఫీ, బిట్స్ ఫర్ మినిట్, రన్స్, బాటిల్స్ అండ్ చిమ్నీస్, దస్పల్లా, ప్లేబాయ్, బీర్ డ్రాగన్, డక్-40 తదితర పబ్బుల నిర్వాహకులున్నట్టు తెలిసింది.

డ్రగ్ కల్చర్‌పై ఆరా..

డ్రగ్స్ వినియోగానికి కొన్ని పబ్బులు, క్లబ్బులు, బార్లు నిలయంగా మారాయని, కొంతమంది నిర్వాహకులే.. అక్కడకొచ్చే వినియోగదారులకు నేరుగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా పబ్బులు, క్లబ్బులకు రెగ్యులర్‌గా వచ్చే వారి వివరాలను సేకరించినట్టు తెలిసింది. వారం నుంచి పబ్బులు, క్లబ్బులపై ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు సమాచారం. పబ్బుల నిర్వాహకుల వెనుక ఉన్న పెద్దమనుషుల వివరాలను సైతం అధికారులు కూపీ లాగుతున్నట్టు సమాచారం. డ్రగ్స్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎఫ్-క్లబ్బుపై ఆబ్కారీ అధికారులు సస్పెన్షన్ వేటువేశారు. ఇటీవల డ్రగ్స్ సరఫరా చేస్తూ ఒక నైజీరియన్ ఈ క్లబ్బులో పట్టుబడటంతో ఈమేరకు చర్యలుచేపట్టారు. త్వరలోనే క్లబ్బు లైసెన్స్‌ను రద్దు చేయనున్నట్టు సమాచారం.

సీఎం కేసీఆర్ తెగువ అభినందనీయం

- డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి, పోలీసులకు సహకరిస్తాం
- ముఖ్యమంత్రికి తెలుగు ఫిలిం ఇండస్ట్రీ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'డ్రగ్స్ కేసును ధైర్యంగా బయటకు తెచ్చిన తీరు, వివిధ రంగాల్లోని యువతను పెడదోవ పట్టిస్తున్న మత్తు భూతాన్ని తరిమికొట్టడంలో మీరు చూపిస్తున్న తెగువను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం' అంటూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తెలుగు ఫిలిం ఇండస్ట్రీ లేఖ రాసింది. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి, పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని తెలిపింది. బుధవారం తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పీ కిరణ్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు బూర్గుపల్లి శివరామకృష్ణ, మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీరాజా, తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కే మురళీకృష్ణారావు సంయుక్తంగా సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను.. మీడియాకు విడుదలచేశారు. విలన్లు నెగ్గిన సినిమాలు తీయబోమని, సమాజం మంచిని గుర్తించేలా స్ఫూర్తినిచ్చే సినిమాలు తీస్తున్నామని పేర్కొన్నారు. కొందరు చేసిన తప్పులకు నేడు సినిమా పరిశ్రమ తలవంచుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. సినీ పరిశ్రమకు గడిచిన 10 రోజులు చీకటి దినాలుగా పేర్కొంటూనే, ఇది పరిశ్రమకు ఒక కుదుపు వంటిదని, అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సినిమా వాళ్లపై ఇంతగా ప్రతిస్పందించడం బాధగా ఉందని, సమాజంలో ఎవరికైనా కష్టమొస్తే జోలె పట్టుకుని విరాళాలు సేకరించిన కథానాయకులున్న పరిశ్రమగా తెలుగు ఇండస్ట్రీకి పేరుందన్నారు. సినీ పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, విచారణను హుందాగా ముందుకు తీసుకెళ్లాలని, ఈ వ్యవహారాన్ని సున్నిత అంశంగా పరిగణించాలని లేఖలో విజ్ఞప్తిచేశారు.

ఈ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలి

- ఎస్సీ వర్గీకరణపై టీఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ డిమాండ్

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం జరిగిన భారీ నిరసన ప్రదర్శనలో తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీల కార్యకర్తలు తరలివచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి ప్రసంగిస్తూ, ఎస్సీ వర్గీకరణపై బీజేపీ హామీ నిలబెట్టుకోలేదని, ఆ పార్టీపై మాదిగలు తిరుగబడే సమయం ఆసన్నమైందని అన్నారు. నిరంతరం అంబేద్కర్ గురించి వేదికల మీద ప్రస్తావించే ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ చేయకపోవడానికి కారణం వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా కేంద్రం ఎందుకు ఇలా చేస్తున్నదని ప్రశ్నించారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా ఓటుబ్యాంకు రాజకీయాలను మానుకుని మాదిగలకు సమాన హక్కులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య, కన్వీనర్ వినాయకరావు, మాదిగ మహిళ జాతీయాధ్యక్షురాలు పెబ్బె జీవమాదిగ తదితరులు కూడా పాల్గొన్నారు.



బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

8 నుంచి ఐసెట్ తుదివిడుత కౌన్సెలింగ్

- షెడ్యూల్ విడుదల చేసిన కన్వీనర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎంసీఏ, ఎంబీఏ కాలేజీల్లో సీట్ల కోసం ఈ నెల 8 నుంచి తుదివిడుత ఐసెట్-2017 కౌన్సెలింగ్ ప్రారంభించనున్నారు. ఈ నెల 8న సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 8 నుంచి 9 వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి, 11న సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు బుధవారం షెడ్యూల్ చేసినట్లు టీఎస్ఐసెట్ కౌన్సెల్ కన్వీనర్ ఏ వాణీప్రసాద్ పేర్కొన్నారు.

హైస్కూళ్ల అభివృద్ధికి రూ.28.195 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 5,639 మాధ్యమిక పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ద్వారా రూ.28.195 కోట్లు విడుదలైనట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. దీనితో పాఠశాలల అభివృద్ధి కోసం రూ.50 వేలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ నిధులతో హైస్కూళ్లలో మరమ్మతులు, ల్యాబ్ పరికరాలను మార్చడం, ఆర్టికల్స్‌ను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అలాగే కంప్యూటర్ ల్యాబ్‌నకు సంబంధించిన పరికరాల కొనుగోలుకు రూ.20 వేలు కేటాయించారు. పుస్తకాలు, పీరియాడికల్స్, దినపత్రికలు, ఆటలు, క్రీడలు, సంగీతం వంటి వాటి కోసం రూ.5,000 కేటాయించారు. తాగునీరు, విద్యుత్‌చార్జీలు, కేబుల్, ఇంటర్నెట్ ఇతరచార్జీల కోసం రూ.25,000 కేటాయించారు. దీని ప్రకారం నిధులను ఖర్చు చేయాల్సి ఉన్నదని కిషన్ పేర్కొన్నారు.